చేయబోయే పనిని గుర్చి తెలుసుకోవడం వివేకం, ఎలా చేయాలో తెలుసుకోవడం నైపుణ్యం,పూర్తిచేయడం సామర్థ్యం. ఇందులో అవగాహనారాహిత్యంతో ఎక్కడ లోపం జరిగినా ఫలితాలు దారుణంగా ఉంటాయి. అందులోనూ కీలకపదవుల్లో ఉన్నవారు కోట్లాది మందికి సంబంధించిన సమస్యలకు పరిష్కారం చూపడంలో తొందరపాటుతోనో, పొరపాటుతోనో లేక కావాలని పక్షపాతంతో నిర్ణయాలు తీసుకుంటే జరిగే పరిణామాలు ఊహాకందవు. అందుకే గతంలో పాలకులు కొన్ని కీలకవిషయాల్లో ఎంతో దూరదృష్టితో అన్ని కోణాల్లో సమగ్రంగా చర్చించి నిర్ణయాలు తీసుకునేవారు. మిగిలిన సమస్యలు ఎలావున్నా నీటి విషయంలో మాత్రం ఎన్నోజాగ్రత్తలు తీసుకొని అడుగులు వేసేవారు.తెలుగు రాష్ట్రాలు విడిపోయిన తర్వాత గోదావరి, కృష్ణా నదీజలాల సమస్య పరిష్కారంలో కేంద్ర ప్రభుత్వం నాన్చినాన్చి యేళ్లతరబడి పెండింగ్‌లో పెట్టి సమస్యను జటిలం చేస్తున్నదనే విమర్శలు పెల్లుబుకుతున్నాయి. ఇటీవల తాజాగా నీటి విభజన సమస్యల పరిష్కారానికి తెరలేపారు. ఇందులో ఎలాంటి తప్పులు జరిగినా, జరిగినట్లు ఏ ప్రాంత ప్రజలు భావించినా విద్వేషాలు పెరిగిపోతాయి. వీటిని రెచ్చగొట్టడానికి ఎలాగో కొందరు ఉండనే ఉంటారు. ఏదిఏమైనా స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి తాగునీరు, సాగునీరు విషయంలో తెలుగు రాష్ట్రాలకు న్యాయం జరగలేదేమోననిపిస్తున్నది. ఉభయ రాష్ట్రాల్లో చిన్న,పెద్ద కలిపి నలభైనదులు పొంగిపొర్లుతున్నాయి. కోట్లాది ఎకరాల బీడుభూములున్నాయి. కోట్లాది మంది శ్రమజీవులు ఉన్నారు. బీడుభూములకు నీటిని తరలించడంలో పాలకులు గతంలో విఫలమయ్యారని చెప్పక తప్పదు. ఈ పార్టీ, ఆ పార్టీ అని లేకుండా అధికారంలో ఎవరున్నా సాగునీటి విషయంలో సమర్థవంతంగా వ్యవహరించలేకపోయారేమోననిపిస్తున్నది. దీనికితోడు పాలకుల పక్షపాతం,అవగాహనారాహిత్యం, కొందరు అధికారుల దుర్బుద్ధికారణంగా తెలుగు రాష్ట్రాల్లో కొన్ని ప్రాంతాలకు తీరని అన్యాయం జరిగింది. ఇందులో ముఖ్యంగా తెలంగాణ, రాయలసీమ, ఆంధ్రలోని కొన్ని ఎగువ ప్రాంతాలున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సాగునీరు, తాగునీరు విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని కొంతమేరకు సమస్యకు పరిష్కారం చూపగలిగిందని చెప్పొచ్చు. అయినా ఇప్పటికీ రెండు తెలుగు రాష్ట్రాల్లో కరవు,దుర్భిక్షం, ఆకలిచావులు, ఆత్మహత్యలతో కొన్ని ప్రాంతాలు అల్లాడిపోతున్నాయి. అతిపెద్ద నీటివనరు అయిన గోదావరి, కృష్ణానదులు తెలుగు రాష్ట్రాల నుంచి ప్రవహిస్తున్నా బంగారం పండే సారవంతమైన భూములున్నా ఆరుగాలం కష్టపడి రక్తాన్ని చిందించి ఉత్పత్తులను పెంచే శ్రమజీవులున్నా కేవలం సాగునీటి సౌకర్యాలు లేని కారణంగా నిరుపయోగం అవుతున్నాయి. ఇప్పటికీ ఈ రెండు నదుల నుంచియేటా లక్షలాది ఎకరాలకు సరిపోయే వేలాది టిఎంసిల నీరు పాలకుల అసమర్థతను చాటుతూ కళ్లముందే సముద్రం పాలవుతున్నాయి. మరొకపక్క వేలాది గ్రామాలు గుక్కెడు మంచినీటి కోసం అలమటిస్తున్నాయి. మరెన్నో వేలాది ఎకరాల భూమి నీరు లేక సాగుకు నోచుకోలేకపోతున్నది. ఒకనాడు వ్యవసాయ రంగంలో అత్యంత ప్రాధాన్యత వహించిన చిన్ననీటి కుంటలు, చెరువుల పరిస్థితి ఆందోళనకరంగా తయారైంది. పెరుగుతున్న జనావాసాల ఆక్రమణతో అధికశాతం చిన్ననీటి వనరులు అదృశ్యమైపోయాయి. దీంతో కొన్ని ప్రాంతాల్లో పూర్తిగా వర్షం మీదనే ఆధారపడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఒకసారి నిండితే పండే అవకాశాలు లేవు.నిర్ణీత సమయంలో నిండితే తప్ప రైతులు బయటపడలేరు. వర్షాల పరిస్థితి ఎలావుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. వరుణదేవుడు ఒక్కొక్కసారి ఒక్కో ప్రాంతంపై విరుచుకుపడి కుంభవృష్టి కురియడంతో అప్పటివరకు గుక్కెడు నీటికోసం ఎదురుచూస్తున్న చిన్ననీటి వనరులు రాత్రికిరాత్రే నిండి కట్టలు తెగి తెల్లవారేసరికి ఒట్టిపోతున్నాయి. మరికొన్ని సాగుకోసమో లేక ఇళ్లపట్టాల కోసమో ఆక్రమణకు గురై శాశ్వతంగా అదృశ్యమైపోతున్నాయి. తెలుగు రాష్ట్రాల చరిత్రను పరిశీలించినా గతంలో చిన్ననీటి వనరులకు మనపెద్దలు ఎంతో ప్రాధాన్యత ఇచ్చారు. కాకతీయులు కానీ, ఆ తర్వాత వచ్చిన విజయనగరాధీశుడు శ్రీకృష్ణదేవరాయల కాలం నుంచి సాగునీటి ముఖ్యంగా చిన్ననీటి వనరులకు ఎంతో ప్రాముఖ్యత ఇచ్చారు. వాననీటిని వృధాగా పోనీయకుండా మౌలిక వసతులను దృష్టిలో ఉంచుకొని ఒక క్రమపద్ధతి ద్వారా నీటిపారుదల వ్యవస్థను ఏర్పాటు చేసేవారు. వాగులు, వంకలకు అడ్డుకట్ట వేసి నీటిని మళ్లించి చిన్న కుంటలను ఏర్పాటు చేయడం,అవి నిండితే వాటి మత్తడి ద్వారా మరో కుంటలోకి అలా వరుసగా కుంటలు, చెరువులు ఏర్పాటుచేశారు.వర్షాలవల్ల వస్తున్న నీటిని అంచనా వేసి చిన్న,పెద్ద చెరువులను నిర్మించారు. గత రెండు, మూడు దశాబ్దాలుగా ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నా చిన్ననీటి వనరుల విషయంలో మాత్రం ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో నిర్లక్ష్యం చేస్తున్నారనే విమర్శను మూటకట్టుకుంటున్నారు. రాయలసీమలోని కొన్ని ప్రాంతాలు సాగునీటి సంగతి దేవుడెరుగు మంచినీటి కోసం కూడా ప్రజలు పడుతున్న బాధలు వర్ణనాతీతం. అధికారులు సహకరించకపోతే ఎంతపెద్ద నాయకుడు ఉన్నా ఏమీ చేయలేరనేందుకు రాయలసీమ ఒక ప్రత్యేక్ష ఉదాహరణగా చెప్పొచ్చు. ఏదిఏమైనా రెండు రాష్ట్రాల మధ్య నీటిసమస్యను పరిష్కరించేందుకు కేంద్రం శ్రీకారం చుట్టాలి. రెండు ప్రాంతాలకు న్యాయం జరిగేలా నిర్ణయాలు తీసుకోవాలి.రాజకీయ కక్షను తీర్చుకోవడానికి నీటి వివాదాన్ని ఎగదోస్తే ఆ తర్వాత ఆర్పడం ఎవరితరం కాదు.

ధర్మాత్ముడైన మనిషి మంచి గంధపు చెట్టు వంటివాడు. తనను నరికే గొడ్డలికి కూడా అది సువాసన ఇస్తుంది.



తులసీదాస్

మాట్లాడటం కంటే అధికంగా వినాలని, చూడాలని భగవంతుడు మనకు రెండు కళ్లు, రెండు చెవులు ఇచ్చి, నోరు మాత్రం ఒకటే ఇచ్చాడు.



సోక్రటీస్

## ప్రజావాక్కు



### ప్రశ్నార్థకంగా మారిన మహిళల భద్రత!

**ఈమధ్యకాలంలో** కేంద్ర,రాష్ట్రవ్యాప్తంగా మహిళలపై, చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాలు,అత్యాచారాలు ఈ ప్రజాస్వామ్యానికే మాయని మచ్చగా నిలుస్తున్నాయి. ఒక విధంగా చెప్పాలంటే ఇటీవల కాలంలో మహిళలపై జరుగుతున్న అమానుష దుర్ఘటనలు, లైంగిక వేధింపులు చూస్తూ ఉంటే కేంద్ర, రాష్ట్రవ్యాప్తంగా మహిళలభద్రత ఇక ప్రశ్నార్థకమేనా అనే అనుమానం పెనుభూతమై మన హృదయాల్ని తీవ్రంగా కలిచివేయకమానదు. అభం,శుభం తెలియని చిన్నారులపై జరుగుతున్న దారుణాలకు సంబంధించిన వార్తలే మనకు తరచుగా కళ్లకుకడుతూ ఉంటాయి.ప్రతిఒక్కరూ మహిళలపై జరుగుతున్న ఇలాంటి అమానుష అత్యాచారాలు, లైంగికదాడులను నియంత్రించే విషయంలో తమవంతుగా భాగస్వాములై మహిళల మాన ప్రాణాలకు ఒక రక్షణ కవచంలా నిలబడితీరాలి.

-బుగ్గన మధుసూదనరెడ్డి, నంద్యాలజిల్లా

### చర్యలు తీసుకోవాలి

**సమాజంలో** అక్రమాలు, అవినీతి వంటి పనులు జరగకుండా చూడాల్సిన పోలీసు అధికారులే అక్రమాలకు పాల్పడితే ఇక సమాజంలోఉంటున్న ప్రజలువారికి జరుగుతున్న అన్యాయాలను ఎవరితో చెప్పుకోవాలి. తెలంగాణ రాష్ట్రప్రభుత్వం పోలీసు వ్యవస్థలో సమూల మార్పులు తీసుకువచ్చింది. అధికారులందరికీ ఎటువంటి ఇబ్బందులు లేకుండా అత్యాధునిక సాంకేతిక సదుపాయాలతో అన్ని పోలీసుస్టేషన్లలో సరైన సదుపాయాలు కల్పించింది.వేలకుపైగా జీతాలు తీసుకుంటూ కూడా కొంత మంది పోలీసు అధికారులు చేతివాటం ప్రదర్శిస్తూమామూళ్లను తీసుకుంటున్నారు.ఇప్పటికీ కొన్నిస్టేషన్లలో అధికారులకు డబ్బుల ఆశచూపి ఏమి తెలియని అమాయకులను దోచుకుంటున్నారు. దీనివల్ల సామాన్య ప్రజలకు న్యాయం జరగడం లేదు.

-కూరపాటి శ్రావణ్, హైదరాబాద్

### వాహనాల అతివేగం

**వాహనదారులు** అతివేగంగా డ్రైవింగ్ చేయడం వలన అనర్థాలు అనుకోని సంఘటనలు జరుగుతున్నాయి. మరీ ముఖ్యంగా మైనర్ బాలురురోడ్లపై విపరీతమైన వేగంతో వెళ్తున్నారు.నగరాలు,పట్టణాలతోపాటుగా పెద్ద పెద్దగ్రామాల్లో కూడా మండలకేంద్రాలలో కూడాట్రాఫిక్‌సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి.విద్య,వైద్య,వ్యాపారసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, దేవాలయాలు ప్రజలు రద్దీగా ఉండే ప్రదేశాల్లో స్పీడ్ బ్రేకర్లు, ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్‌జిల్లా

### షాపింగ్ మాల్స్ ఫుల్

**ఇదివరకు** పెద్దపెద్ద నగరాల్లో,పట్టణాల్లోఉండే షాపింగ్ మాల్స్ ఈరోజు చిన్న చిన్న పట్టణాలు ఆమాటకొస్తే కొంచెం పెద్ద పెద్ద గ్రామీణ ప్రాంతాల్లోవిస్తృతంగా విస్తరించడంతో నేటికీ భారత్‌లో చాలామంది గ్రామాల్లో నివసించడంవల్ల ఎక్కువజనాభా షాపింగ్ మాల్స్‌బాటపడుతున్నారు. ముఖ్యంగా అన్ని వస్తువులు ఒకే చోట దొరకడం, వివిధ బ్రాండ్‌లు అందుబాటులో ఉండటం, డిస్కౌంట్ ఆఫర్ల పేరుతో షాపింగ్ మాల్స్ బాటపడుతున్నారు. ఆహ్లాదకరమైన వాతావరణం, పరిశుభ్రంగా ఉండుట వలన కూడా షాపింగ్ మాల్స్ బాటపడుతున్నారు. వివిధ పండుగలు పర్వదినాలు సందర్భంగా కొన్ని వస్తువులపై భారీ రాయితీలు ప్రోత్సాహకాలుఇస్తున్నారు. డోర్ డెలివరీ వంటివి సదుపాయాలు ఉన్నాయి. వన్ ప్లస్ వన్, బై వన్ గెట్‌వన్ ఫ్రీ వంటి పలు ఆఫర్లు వినియోగదారులకు మైకం కలుగచేస్తూ అవసరం లేని వస్తువులను కొనుగోలు చేసే పరిస్థితి ఏర్పడింది. ఇటువంటి పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ డబ్బు విలువ తెలుసుకోవాలి.

-ఐ.పి.రావు, హైదరాబాద్

### కష్టే ఫలి

**విజయం** అనే మంత్రదండాన్ని భగవంతుడు మనకు అల్లా ఉద్దీన్ అద్భుత దీపంలాఒకేసారి మనకు అందివ్వడు. నిరంతర కృషి, పట్టుదల, దృఢచిత్తాన్ని బట్టి భగవంతుడు అనేక కఠిన పరీక్షలుపెడుతూ అంతిమంగా మాత్రమే మనకు విజయం అనే ఈ కిరీటాన్ని తలపై అధిష్టిస్తాడు. విజయం విజయం అంటూ వెంపర్లాడకుండా పరుగు లంకించుకోకుండా కష్టేఫలి అనే నానుడికి మనమంతా కట్టుబడి, మనమనుకున్న రంగంలో మన సర్వశక్తులు వడ్డినిరంతర సాధన చేస్తూపోతే అందుకు ఆ దేవదేవుని ఆశీస్సులు తోడైతే విజయం అనేది ఆఘమేఘాల మీద మన ఇంటి తలుపు తట్టడం తథ్యం.

-మధుపాళి, బేతంచెర్ల, నంద్యాలజిల్లా

### ఒలింపిక్స్‌లో క్రికెట్ పునరాగమనం

**భారత్** వేదికగా వన్డే ప్రపంచ కప్ జరుగుతున్న వేళ క్రికెట్ క్రీడాభిమానులకు అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ సంతోషకరమైన వార్త ప్రకటించింది. 2028 లాస్ ఏంజెలిస్ విశ్వక్రీడల్లో టీ-20 క్రికెట్, స్క్వాష్, బేస్‌బాల్, లాక్రాస్, ఫ్లాగ్,ఫుట్‌బాల్ క్రీడాంశాలకు చోటు కల్పించింది. 1900లో తొలిసారిగా జరిగిన ప్యారిస్ ఒలింపిక్స్‌లో క్రికెట్ భాగమైంది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ ఆడుతున్న దేశాలు వందలోపే ఉన్నాయి. తాజా వన్డే ప్రపంచ కప్ క్రికెట్ పోటీల్లో కేవలం 10 దేశాలు మాత్రమే పాల్గొంటున్నాయి.

-చల్లాచంద్రశేఖర్ రెడ్డి, కలువాయి, నెల్లూరుజిల్లా

**ఎడిట్ పేజీకి..** ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. e-mail : editpage@vaartha.com

# కులాల వర్గీకరణ నివేదిక అమలు సాధ్యమా?

*నిజానికి జనాభా వివరాల సేకరణ సమయంలో కులాల గణాంకాలు సేకరించడం చాలా సులువైన మార్గం. కానీ కులాల వారీ గణన జరిగితే తమ అధికార పీఠాలు కదిలిపోతాయనే ఆధిపత్యకులాల నేతల భయం వల్ల జనాభా వివరాల సేకరణలో కులాలవారీగా గణాంకాలను సేకరించాలనే డిమాండ్‌ను కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ తెలివిగా రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించింది. అయితే ఇదే సమయంలో దేశంలో అనేక రాష్ట్రాలలో బిజెపి అధికారంలో ఉన్న విషయాన్ని మరిచిపో యింది. మెజారిటీ ప్రజల కోర్కెలను పరిగణనలోకి తీసుకుంటున్న బిజెపియేతర రాష్ట్రాలు కులాల గణన చేపట్టడానికి సిద్ధమవు తున్నాయి. ఈ నేపథ్యంలో ఒబిసి కులాల గణనకు బిజెపి వ్యతిరేకమని ప్రజలకు తెలిసిపోతోంది. వ్రతం చెడినా ఫలితం దక్కని చందంగా బిజెపిపాలిత రాష్ట్రాల్లో కూడా ఏదో ఒక రూపంలో కుల సర్వే చేయడం అనివార్యంగా మారింది.*



అన్నవరపు బ్రహ్మయ్య

ఇతర వెనుకబడిన తరగతుల (ఒబిసి) కులాల వర్గీకరణకు సంబంధించి జస్టిస్ రోహిణి కమిషన్ సమర్పిం చిన నివేదిక అమలు సాధ్యం అవుతుందా? లేక బుట్ట దాఖలవుతుందా? అనే ప్రశ్నతలెత్తుతోంది. ఒబిసి గణాంకాలు వివరాలులేకుండా రూపొందించిన నివేదికకు చట్టబద్ధత సాధ్యం అవుతుందా? ఈ నివేదిక అమలు కావాలంటే కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి కావాలి. జస్టిస్ రోహిణి సమర్పించిన నివేదికను తొలుత కేంద్ర కేబినెట్‌లో, ఆ తర్వాత పార్లమెంటులో ఆమోదం పొందాలి.బిసిల గణాంకాలను సేకరించడానికి ఇష్టపడని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఒబిసి వర్గీకరణ నివేదికను రికార్డులకే పరిమితం చేసే ప్రమాదం కనిపిస్తోంది. జస్టిస్ రోహిణి కమిషన్ జస్టిస్ జి. రోహిణి నేతృత్వంలోని ఇతర వెనుకబడిన తరగతుల (ఒబిసి) కులాల వర్గీకరణకు నియమించిన కమిషన్ ఎట్టకేలకు జులై 31న తన నివేదికను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు, సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వశాఖకు సమర్పించింది. ఢిల్లీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జి. రోహిణి చైర్‌పర్సన్‌గా అక్టోబరు 2, 2017న ఏర్పాటైన కమిషన్ ఈ కమిషన్ 12 వారాల్లో నివేదిక సమర్పించాల్సి ఉన్నప్పటికీ, దఫాలవారీగా 13సార్లు గడువును పెంచారు. అయినప్పటికీ కమిషన్ వర్గీకరణకు సంబంధించి పూర్తిస్థాయిలో పరిష్కార మార్గాలు సూచించలేకపోయినట్టు తెలుస్తోంది. అందుకు ప్రధాన బిసి వర్గాలకు సంబంధించి సరైన గణాంకాలు అందుబాటులో లేకపోవడమే కారణమని కమిషన్ తన నివేదికలో ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వ జాబితాలో ఉన్న మొత్తం 2,633 ఒబిసి కులాలలో కేవలం 25 శాతం కులాల వారే 97శాతం ఉద్యోగాలు పొందినట్టుగా కమిషన్ పేర్కొంది. ఈ స్థితిలో ఒబిసి (ఇతర వెనుకబడిన కులాల)లకు సంబంధించి ప్రస్తుతం కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న మొత్తం 27శాతం కోటా ప్రస్తుతం జాబితాలో ఉన్న అన్నికులాలకు సమాన ఫలాలు అందేవిధంగా 1,2,3,4 సంఖ్యలతో కూడిన కేటగిరిలుగా 27 శాతం ఒబిసి రిజర్వేషన్ విభజించాలని ప్రతిపాదించారు. ఉదాహరణకి కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే విద్యాసంస్థల్లో ఉద్యోగాలు, సీట్లలో ఒబిసిలకు 27శాతం రిజర్వేషన్ అమలవుతోంది.అయితే ఈ మొత్తం రిజర్వేషన్‌లో కొన్ని కులాలు మాత్రమే అత్యధిక ఫలాలను పొందుతున్నట్టు కమిషన్ గుర్తించింది. ప్రాథమిక అంచనా ప్రకారం కేటగిరి 1లో 1,674 కుల సమూహాలు, కేటగిరి 2లో అంటే కోటా నుండి ఎక్కువ ప్రయోజనం పొందని 534 కులాలు ఉండగా, 3,4 కేటగిరీలలో వరుసగా 328, 97 కులాలు ఉన్నాయి. 3,5 కేటగిరీలలో 4వ కేటగిరి వారు అత్యల్పంగా రిజర్వేషన్ ఫలాలు అందుకుంటున్న విషయాన్ని కమిషన్ గుర్తించింది. ప్రస్తుతం 27శాతం రిజర్వేషన్లలో అత్యధిక ప్రయోజనాలను పొందుతున్న కులాలను 1వ కేటగిరిగా, ఒబిసిలలో ఆధిపత్య కులాలుగా రోహిణి కమిషన్ పేర్కొంది. కమిషన్‌కు తన నివేదికలో రిజర్వేషన్ ప్రయోజనాల అసమాన పంపిణీ ఏ మేరకు జరిగిందో అధ్యయనం చేసింది. ఒబిసిలలో శాస్త్రీయంగా వర్గీకరణ




చేయడానికి అవసరమైన యంత్రాంగం, ప్రాతిపదిక, పద్ధతులు, ప్రమాణాలను నెలకొల్పడం, ఒబిసిలలో ఒకే విధమైన వృత్తులు కలిగిన ఉపకులాలను గుర్తించడం, వారి వారి సామాజిక, ఆర్థిక విద్యాస్థాయిలను అధ్యయనంచేసి ఆ మేరకు వేర్వేరు తరగతులుగా ఒబిసి కులాలను వర్గీకరించింది. రోహిణి కమిషన్ నివేదిక రూపొందించే సమయంలో 2018వ సంవత్సరానికి ముందు ఐదేళ్లలో నియమితులైన 1.3 లక్షల కేంద్ర ప్రభుత్వ ఒబిసి ఉద్యోగుల వివరాలను పరిశీలించింది. అలాగే మూడేళ్లలో ఐఐటీ, ఐఐఎం, ఎయిమ్స్ వంటి విద్యాసంస్థల్లో కేంద్ర విశ్వవిద్యాలయాల్లో జరిగిన ఒబిసి అడ్మిషన్లను కూడా పరిశీలించింది. ఈ సందర్భంగా వెల్లడైన అంశాలను కూడా కమిషన్ పరిగణనలోకి తీసుకుంది. కమిషన్ తన అధ్యయనంలో 97శాతం ఉద్యోగాలు,విద్యావకాశాలు ఒబిసిల్లోని 25 శాతం కులాలకే దక్కుతున్నాయి. ఇంకా చెప్పాలంటే కేవలం పదికులాలకు 24.95 శాతం ఉద్యోగాలు అనుభవిస్తున్నాయి.ఇదే సమయంలో దాదాపు 983 కులాలకు (37శాతం) విద్య, ఉద్యోగాల్లో కనీస ప్రాతినిధ్యం లేదు. 994కులాలకు విద్య, ఉద్యోగాల్లో కేవలం 2.68శాతం ప్రాతినిధ్యమే ఉంది. అయితే ఒబిసిల జనాభా వివరాలు లేనందున ఈవిశ్లేషణ ఏ మేరకు శాస్త్రీయమైనదన్న సందేహాలు ఉన్నాయి. ఒబిసిలకు సంబంధించిన అంశాలు సామాజిక న్యాయ మంత్రిత్వశాఖకు సంబంధించిన అంశం కావడం వల్ల కమిషన్ సమర్పించిన నివేదిక రాష్ట్రపతి నుంచి కేంద్ర ప్రభుత్వం సామాజిక,న్యాయమంత్రిత్వశాఖకు చేరింది. నివేదికను ప్రభుత్వం ఇంకా బహిరంగపరచలేదు. ఈ నివేదిక సిఫార్సులు అమలు చేయడానికి ముందు చర్చలు జరపడం అవసరమని గుర్తించారు.నివేదికలోని పునర్విభజనపై రాజకీయంగా సున్నితమైన అంశాలను పరిశీలించడానికి దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలతో సంప్రదింపులు జరపాలని కూడా జస్టిస్ రోహిణి కమిషన్ పేర్కొంది.ఈ కమిషన్ సిఫార్సులు అమలుపై అనేక అనుమానాలు కలుగుతుంది. దానికి ప్రధాన కారణం ఒబిసిలకు సంబంధించిన గణాంకాలు కేంద్రప్రభుత్వం వద్ద లేకపోవడమే. ఒబిసిల జనగణనపై అఖిల భారత స్థాయిలో సర్వే చేపట్టడానికి వీలుగా బడ్జెట్ కేటాయించాలని 2018 డిసెంబరు 12న కేంద్రానికి కమిషన్ లేఖ రాసింది. 2019 జులై 30న కమిషన్ ప్రభుత్వానికి మరో లేఖ రాస్తూ తమ నివేదిక ముసాయిదా సిద్ధమైందని, అయితే కేంద్ర ఒబిసి జాబితాలో ఎన్నో అస్పష్టతలు ఉన్నాయని, వర్గీకరణ జరగడానికన్నా ముందే వాటిని సవరించాలని ఆ లేఖలో పేర్కొంది.ఈ లేఖలపై కేంద్రప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేదు. ఒబిసి జనాభాపై స్పష్టత లేనప్పటికీ రోహిణి కమిషన్ చివరికి నివేదిక సమర్పించింది. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వం తెలివిగా కులాలవారీగా గణాంకాలను సేకరించడానికి ససేమిరా అంటూనే రాష్ట్ర ప్రభుత్వాలు కులాల వివరాలు సేకరించుకోవచ్చునని పేర్కొంది. ఈ నేపథ్యంలో బీహార్ రాష్ట్రప్రభుత్వం ప్రథమంగా బిసి కులాల గణన ప్రారంభించి పూర్తి చేసింది. ఈ సందర్భంగా కులగణన వల్ల జాతి సమైక్యత దెబ్బతింటుందంటూ కొంతమంది న్యాయస్థానాల్లో సవాలుచేశారు.అయితే ఈ సవాల్‌ను పాట్నా హైకోర్టు కొట్టివేసింది. నిజానికి జనాభా వివరాల సేకరణ సమయంలో కులాల గణాంకాలు సేకరించడం చాలా సులువైన మార్గం. కానీ కులాల వారీ గణన జరిగితే తమ అధికార పీఠాలు కదిలిపోతాయనే ఆధిపత్యకులాల నేతల భయంవల్ల జనాభా వివరాల సేకరణలో కులాలవారీగా గణాంకాలను సేకరించాలనే డిమాండ్‌ను కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ తెలివిగా రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించింది. అయితే ఇదే సమయంలో దేశంలో అనేక రాష్ట్రాలలో బిజెపి అధికారంలో ఉన్న విషయాన్ని మరిచిపోయింది. మెజారిటీ ప్రజల కోర్కెలను పరిగణనలోకి తీసుకుంటున్న బిజెపియేతర రాష్ట్రాలు కులాల గణన చేపట్టడానికి సిద్ధమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఒబిసికులాల గణనకు బిజెపి వ్యతిరేకమని ప్రజలకు తెలిసిపోతోంది. వ్రతం చెడినా ఫలితం దక్కని చందంగా బిజెపిపాలిత రాష్ట్రాల్లో కూడా ఏదో ఒక రూపంలో కుల సర్వే చేయడం అనివార్యంగా మారింది. ●

# ఎన్నికలపై ఓటర్లలో చైతన్యం రావాలి

కొల్లు లక్ష్మీ నారాయణ

ప్రజాసంక్షేమ సిద్ధాంతాలతో, విధి విధానాలలో ప్రజలను పాలించేందుకు ఎన్నో పార్టీలు ఎన్నికల్లో పోటీ పడతాయి. సుభిక్షమైన పాలనను అందించాల్సిన పార్టీలు పౌరులకు ప్రజాప్రతినిధులకు మధ్య నేడు దళారీల పాత్ర పోషిస్తున్నాయి. ఎన్నికల కమిషన్ విధించిన పరిమితికి లోబడి దొంగ లెక్కలు చూపెడుతూ అన్యాయ, అక్రమ, దోపిడీ, వారసత్వ విధానాలతో లక్షలు, కోట్ల రూపాయలు ఖర్చుపెడుతున్న తీరు మనకు ప్రత్యక్ష నిదర్శనమే. పార్టీల వివిధ కార్యక్రమాలకు, ప్రచారాలకు, సమావేశాలకు జనసమీకరణ కీలకం. తరలింపు జనానికి ఒక్కొక్కరికి కనీసం రెండు, మూడు వందల రూపాయలే కాక మద్యం, బిర్యానీలు, తాయిలాలు పంపిణీ చేస్తుండడం బహిరంగ సత్యం. తరలింపు జనం నిజమైన ఆ పార్టీ కార్యకర్తలు కాకపోగా, ఇదే జనం మరో పార్టీ కార్యక్రమంలో ప్రత్యక్షమవటం గమనించవచ్చు. వాగ్దానం చేసినట్లు డబ్బులు, తాయిలాలను సభల ముగింపు అనంతరం పార్టీలు, అభ్యర్థులు, స్థానిక నాయకులచేత ఓటర్లకు సక్రమంగా పంపిణీ జరగనప్పుడు ఏర్పడే తగాదాలు, వివాదాలు, సంభాషణలు ప్రత్యక్ష నిదర్శనమేగాక సామాజిక మాధ్యమాల ద్వారా మనకు విదితమే. పోలింగ్‌కు మూడు, నాలుగు రోజుల ముందు ప్రతి నియోజకవర్గంలో పోటీ చేసే వివిధ పార్టీల అభ్యర్థులు తమ చేతికి మట్టి అంటకుండా పరోక్షంగా స్థానిక నాయకగణం చేత కనిష్టంగా 500 నుండి గరిష్టంగా రెండువేల రూపాయల వరకు ఓటు కోసం పంపిణీ చేస్తుండడం, తీసుకోవడం నేడు ఆనవాయితీగా మారింది. డబ్బులు, మద్యం తాయిలాల పంపిణీలో సాక్ష్యాధారాలు దొరకకుండా రాత్రికిరాత్రే తమ అక్రమ పనులు పూర్తి చేస్తున్నారు. ఒకవేళ అధికారులకు దొరికిపోయినా వారిని బతిమాలో,బెదిరించో మభ్యపెడుతున్నారు.విచ్చలవిడిగా మద్యం పంపిణీ, డబ్బులు ఖర్చుపెడుతున్న నిజాన్ని ఓటర్లే ముచ్చటించుకోవడం తెలిసిందే. సొంత పార్టీ విధివిధానాలతో, సిద్ధాంతా



లతో, జెండాలతో ఎన్నికల్లో గెలిచి అధికారం దక్కని పార్టీ అభ్యర్థులు తమ ఉనికి కోసం, పదవుల కోసం,అక్రమంగా సంపాదించిన ఆస్తుల రక్షణ కోసం అధికారం దక్కిన పార్టీలో చేరి 'పార్టీ ఫిరాయింపు'లకు పాల్పడుతున్న తీరు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తుండటమే.డబ్బు, మద్యం, అక్రమ,అవినీతి, దోపిడీల వంటి అప్రజాస్వామ్య లక్షణాలున్న నేటి రాజకీయాల్లో ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాలని మార్పుకోరే ఒక సామాన్య వ్యక్తి, ఒక ప్రజాసేవకుడు, ఒక విద్యావంతుడు, ఒక మేధావి, ఒక ప్రజాస్వామ్యవాది పోటీ చేయాలంటే భయపడే పరిస్థితి. నేటి విశృంకుల రాజకీయాలలో గెలుపు అనే మాట కలలో కూడా రాదు. ఓటర్లు ఎక్కడున్నా, ఏం చేస్తున్నా వారి దగ్గరికి వెళ్లి అలవికాని వాగ్దానాలు, ప్రలోభాలతో కాళ్లవేళ్ల పడి ఓట్లు రాబట్టుకుని గెలుస్తున్నారు. గెలిచాక గ్రామ, మండలస్థాయి నాయకులకు, కాంట్రాక్టర్లకు, వ్యాపారస్తులకు, అండబలం, కండబలం, ఉన్నవారికి మాత్రమే ప్రజాప్రతినిధులు ప్రత్యక్ష దర్శనం ఇస్తున్నారు. బడాబాబుల పనులకే మోక్షం. ఇక జనంలోకి వస్తే మాత్రం ప్రభుత్వ ధనాన్ని వృధాగా ఖర్చుపెడుతూ మందిమార్బలం, హంగు ఆర్భాటం, వాహనశ్రేణి (కాన్వాయి) సెక్యూరిటీ గార్డ్‌లతో కండబలం, ధనబలం రాజకీయాలుగా మారిన తీరు మాత్రం ప్రజాసేవను దూరం చేసి స్వార్థం, అవినీతి, దోపిడీ, అక్రమ రాజకీయాలకు పునాది వేస్తుంది. ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోని, ప్రజాసేవలో సరైన పనితీరు, బాధ్యత లేకుండా పారదర్శకతలేని అప్రజాస్వామ్య విధానాలకు పాల్పడే ప్రజాప్రతినిధులను ఐదేళ్లకి ఒకమారు ప్రజలు తమ విలువైన ఓటుద్వారా మార్చే అవకాశాన్ని ఉపయోగించుకోకపోవడం ప్రజాస్వామ్యపునాదులకు ప్రమాదకరం. తాయిలాలకు ఓటును అమ్ముకునే ప్రజలకు తాము ఎన్నుకున్న ప్రతినిధులను ప్రశ్నించేహక్కును కోల్పోవడం ప్రజాస్వామ్యానికి విఘాతం.కుల,మత, వర్గాలకు తాయిలాలకు తలొగ్గి ఎంతో శక్తివంతమైన ఓటును అమ్ముకోవడం, ప్రజాసంక్షేమ పాలకులను ఎన్నుకోకపోవడం ప్రజాస్వామ్య పునాదులకే పెను ప్రమాదం. ప్రజలే అసలైన రాజ్యాంగ సంరక్షకులు, సార్వభౌములు అన్న స్ఫూర్తితో ముందడుగు వేస్తేనే ప్రజాస్వామ్యం పదికాలాలపాటు పరిఢవిల్లుతుంది.

# పాత పెన్షన్ విధానం అమలు జరిగేనా?



వాసిలి సురేష్

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని రాజకీయపార్టీలు ఇప్పుడు ప్రభుత్వ ఉద్యోగుల ఓట్లపై గురిపెట్టాయి. వాళ్ల డిమాండ్లను మేనిఫెస్టోలో పెట్టి ఓట్లు రాబట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఉద్యోగులు కూడా తమ ప్రధాన డిమాండ్ అయిన పాత పెన్షన్ విధానంపై ప్రకటన ఇప్పించుకోవాలని చేసిన ప్రయత్నాలు విఫలం కావడంతో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలలో కొంత నిరాశ నెలకొని ఉంది. సిపిఎస్ ఉద్యోగ ఉపాధ్యాయులంతా ఏ పార్టీ ఓపిఎస్‌ను మేనిఫెస్టోలో పెడుతుందో ఆ పార్టీవైపు ఉండాలని సూత్రపాయంగా నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. తెలంగాణా రాష్ట్రంలో దాదాపు రెండున్నర లక్షలమంది వరకు ఉన్న సిపిఎస్ ఉద్యోగుల ఓట్లు అన్ని పార్టీలకూ కీలకంగా మారుతున్నాయి. అందుకే అన్నిపార్టీలు పాతపెన్షన్ పథకం అమలు చేయాలన్న డిమాండ్లకు ప్రాధాన్యత ఇస్తున్నాయి. అధికారంలోకి రాగానే సిపిఎస్‌ను రద్దు చేసి ఓపిఎస్‌ను అమలు చేస్తామని, ఈ అంశాన్ని మేనిఫెస్టోలో చేరుస్తామని ఇదివరకే కాంగ్రెస్‌పార్టీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బిఆర్‌ఎస్ కూడా సిపిఎస్ రద్దుపైన, ఏదైనా నిర్ణయం తీసుకోవచ్చని ఉద్యోగులు ఆశగా ఎదురుచూస్తున్నప్పటికీ సిపిఎస్ రద్దు, ఓపిఎస్ అమలుపై కమిటీ వేసి అధ్యయనం చేసి సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్నారు. సిపిఎస్‌ను రద్దు చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంది. పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ ఆథారిటీ చట్టంలో ఈ విషయాన్ని చేర్చారు. దీంతో రాష్ట్రంలో బిజెపి మినహా కాంగ్రెస్, బిఆర్‌స్ పార్టీలకే ఓపిఎస్ రద్దు అవకాశం ఉందని ఉద్యోగులు చెబుతున్నారు. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, కర్ణాటక రాష్ట్రాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇప్పటికే సిపిఎస్‌ను రద్దుచేశాయి. ఇక తమిళనాడు ఎన్‌పిఎస్ ఖాతాకు ఒక్కపైసా కూడా జమ చేయడంలేదు. తెలంగాణ రాష్ట్రంలో ఓపిఎస్ కోసం ఉద్యోగులు చాలా ఏళ్లుగా పోరాటం చేస్తున్నారు. పాత, కొత్త అందరు ఉద్యోగులు కలిస్తే మొత్తం ఓపిఎస్ కోరుకునే వాళ్ల సంఖ్య మూడులక్షల వరకు ఉంటుంది. రాష్ట్రప్రభుత్వ పరిధిలో ఉన్న ఉద్యోగుల కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేయాలని ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. సిపిఎస్ వద్దని పాత పెన్షన్ స్కీమ్‌విధానాన్నే తమకు వర్తింపచేయాలని డిమాండ్ చేస్తున్నారు. మరోపక్క సిపిఎస్‌ను రద్దుచేస్తున్న రాష్ట్రాలసంఖ్యక్రమేణా పెరుగుతుండడంతో తెలంగాణ ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగుతోంది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సరైన నిర్ణయం తీసుకోకపోతే




సిపిఎస్ కింద ఉన్న రెండు లక్షల మందికిపైగా ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల ఓట్లు అధికార పార్టీపై ప్రభావం చూపే అవకాశముందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ఇప్పటికే రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్‌లలో అక్కడి రాష్ట్ర ప్రభుత్వాలు సిపిఎస్‌ను రద్దు చేశాయి. ఇటీవల ఎన్నికలు జరిగిన కర్ణాటకలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం సిపిఎస్‌నురద్దు చేస్తుండడంతో తెలంగాణలో కూడా సిపిఎస్ రద్దు చేయాలని ఉద్యోగులు ఒత్తిడి చేస్తున్నారు.నిజానికి సిపిఎస్‌ను రద్దు చేసుకునే అధికారాలను రాష్ట్ర ప్రభుత్వాలకు పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం వీలుకల్పిస్తోంది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, రాష్ట్రాల ఉద్యోగుల కోసం కేంద్రం 'నేషనల్ పెన్షన్ సిస్టం (ఎన్‌పిఎస్), సిపిఎస్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది.2004 జనవరి 1 తర్వాత నియమితులైన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్‌పిఎస్‌ను కేంద్ర పెన్షన్లు, పెన్షనర్ల సంక్షేమ శాఖ వర్తింపచేసింది. ఈ విధానాన్ని రాష్ట్రప్రభుత్వం కూడా అన్వయించుకుంటూ 2014 ఆగస్టు 23న జీవోను జారీచేసింది. దీంతో2004 సెప్టెంబరు1 తర్వాత నియమితులైన రాష్ట్ర ప్రభుత్వఉద్యోగులకు సిపిఎస్ విధానం అమలవుతోంది. తెలంగాణ రాష్ట్రంలోని 3.28 లక్షల మంది ఉద్యోగులు ఉండగా, సిపిఎస్ కిందే రెండు లక్షల మంది ఉద్యోగులున్నారు. అటెండర్ నుంచి గ్రూపు-1 అధికారుల వరకు సిపిఎస్ కింద ఉన్నారు. దీనిని రద్దు చేయాలంటూమొదటి నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తూ వస్తున్నాయి. సిపిఎస్ విధానం వల్ల తమకు పాతపెన్షన్ విధానంలో ఒనగూరిన యాభైశాతం పెన్షన్, కుటుంబసభ్యులకు ముప్పైశాతం పెన్షన్ రూ.16 లక్షల గ్రాట్యూటీ, కమ్యూనికేషన్ వంటి సౌకర్యాలను ఉద్యోగులు కోల్పోతున్నారు. నిజానికి పాత పెన్షన్ స్కీమ్ (ఓపిఎస్) కింద ఉద్యోగి పదవీ విరమణ చేయగానే ఆఖరి నెల వేతనంలో యాభైశాతం మొత్తాన్ని ప్రతినెలా పెన్షన్ కింద చెల్లిస్తారు. సిపిఎస్ కింద ఈ సౌకర్యం లేదు. ప్రస్తుతం సిపిఎస్ కింద ఉద్యోగి వేతనం, డిఏల నుంచి పదిశాతం, ప్రభుత్వం నుంచిమరో పది శాతం సొమ్మును కలిపి నేషనల్ పెన్షన్ స్కీం ట్రస్టులో జమ చేస్తున్నారు. ఉద్యోగికి కేటాయించిన పర్మినెంట్ రిటైర్‌మెంట్ అకౌంట్ నెంబర్‌లో ఈ సొమ్ము జమ అవుతుంది. ఉద్యోగి పదవీ విరమణ పొందే వరకు జమ అయిన మొత్తం నుంచి అరవై శాతం డబ్బును మాత్రమే ఉద్యోగికి నగదుగా చెల్లిస్తారు.మిగతా నలభై శాతం డబ్బును షేర్ మార్కెట్‌లో పెడుతున్నారు. వచ్చే లాభాన్ని నెలవారి పెన్షన్‌కింద రిటైర్డు ఉద్యోగికి చెల్లిస్తున్నారు. షేర్‌మార్కెట్ నష్టాలను చవిచూస్తే అవే నష్టాల మొత్తాన్ని ఉద్యోగి డబ్బులనుంచి కట్ చేసుకుంటున్నారు.అందుకే ఈ సిపిఎస్ నష్టదాయకంగా ఉందని, దానిని రద్దు చేసి ఓపిఎస్‌ను అమలు చేయాలంటూ ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.ఇప్పటికే ఆరు రాష్ట్రాల్లో సిపిఎస్ రద్దు చేశారు. కాబట్టి తెలంగాణలో రాబోవు ప్రభుత్వం మేనిఫెస్టోలో చెప్పినట్లు సిపిఎస్‌ను రద్దుచేయాలి. సిపిఎస్ వల్ల ఉద్యోగులకు నష్టమే తప్ప లాభంలేదు.పాతపెన్షన్ విధానమే రిటైర్ అయిన తర్వాత అన్నం పెడుతుంది. సిపిఎస్‌ను రద్దు చేస్తే ప్రభుత్వానికి ఉద్యోగులనుంచి మరింత ఆదరణ,అభిమానాలు పెరుగుతాయి.●

# కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అదానీ గ్రూప్‌పై దర్యాప్తు చేపడతాం : రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ, అక్టోబరు18 :** బొగ్గు దిగుమతులపై ఆదానీ గ్రూపుఅధిక ధరలు కారణంగా ప్రజలపై విద్యుత్తు భారం పడుతోందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. బొగ్గు దిగుమతులపై ఆదానీ గ్రూపు అధిక ఇన్‌వాయిస్‌లతో ప్రజలు విద్యుత్తుకు ఎక్కువ చెల్లించేలా చేస్తుందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ క్రమంలో ప్రజలపై రూ. కోట్లభారం పడుతోందని మీడియాలో వచ్చిన కథనాన్ని ఆయన ఉదహరించారు. దీనిపై దర్యాప్తునకు ప్రధాని నరేంద్ర మోడీ ఎందుకు ఆదేశించడం లేదని ప్రశ్నించారు. దీనిపై దర్యాప్తునకు ప్రధాని నరేంద్ర మోడీ ఎందుకు ఆదేశించడం లేదని ప్రశ్నించారు. ఏఐసీసీ ప్రధాన కార్యాలయలో మీడియాతో మాట్లాడిన రాహుల్ గాంధీ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆదానీ గ్రూప్‌పై దర్యాప్తుకు ఆదేశిస్తామన్నారు.ు ఇండోనేషియా నుంచి ఆదానీ గ్రూప్ బొగ్గు దిగుమతి చేసుకొంది. భారత్‌కు చేరేసరికి దాని ధర రెట్టింపు అవుతోంది. ఇలా అధిక ధరల కారణంగా సామాన్య ప్రజలు విద్యుత్ బిల్లులను భారీగా చెల్లించాల్సి వస్తోంది. దీంతో కొన్ని కాంగ్రెస్ పాలిత ప్రాంతాలు పేదలకు సబ్సిడీలు చెల్లించాల్సి వస్తోంద్ని ని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఒకవేళ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే జర్నలిస్టు సౌమ్యవిశ్వనాథన్ హత్యపై 15ఏళ్ల తర్వాత కీలక తీర్పు దీనిపై దర్యాప్తు చేస్తారా? అని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చిన రాహుల్..‘ తాము అధికారంలోకి వస్తే తప్పకుండా దర్యాప్తుకు ఆదేశిస్తాం్ణ అని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ప్రధాని మోడీ ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించిన రాహుల్.. దర్యాప్తు జరిపి విశ్వసనీయతను నిరూపించుకోవాలని అడుగుతున్నానన్నారు. మార్కెట్ విలువకంటే ఎక్కువ ధరకు అదానీ గ్రూప్ బొగ్గు దిగుమతి చేసుకున్నట్లుకనిపిస్తోందంటూ ఫైనాన్షియల్ టైమ్స్ కథనాన్ని రాహుల్ గాంధీ ప్రస్తావిస్తూ ఈ ఆరోపణలు చేశారు.



## సమాజ్ వాదీ నేత అజాంఖాన్‌కు ఏడేళ్ల జైలు శిక్ష

**లక్నో, అక్టోబర్ 18 :** సమాజ్‌వాదీ పార్టీ నాయ కుడు అజాం ఖాన్, ఆయన భార్య తజన్ ఫాతి మా, కుమారుడు అబ్దుల్లా అజాంలకు యూపీ లోని రాంపూర్ కోర్టు ఏడేళ్ల శిక్షను విధించింది. 2019నాటి నకిలీ జనన ధృవీకరణ పత్రాల కేసులో ఈ ముగ్గుర్ని దోషులుగా నిర్ధారించింది. ఎంపీ -ఎమ్మెల్యే కోర్టు న్యాయమూర్తి షోబిత్ బన్సల్ ముగ్గురు దోషులకు గరిష్టంగా ఏడేళ్ల జైలు విధిస్తూ శిక్షను ఖరారు చేశారు. నకిలీ ధ్రువపత్రాలపై బిజెపి ఎమ్మెల్యే అకాష్ సక్సేనా రాంపూర్‌లోని గంజ్ పోలీస్ స్టేషన్‌లో జనవరి 3,2019న పోలీసులకు ఫిర్యాదు చేయగా .. ఎఫ్ఐఆర్ నమోదైంది. వారి కుమారుడు అబ్దుల్లా అజాంకు రెండు నకిలీ పుట్టిన తేదీ సర్టిఫికేట్‌లు పొందేందుకు అజాం ఖాన్, ఆయన భార్య తజీన్ ఫాతిమా సహాయం చేశారని సక్సేనా ఫిర్యాదులో పేర్కొన్నారు. ఒక సర్టిఫికెట్ లక్నోనుంచి కాగా మరొకటి రాంపూర్ నుంచి పొందినట్లు ఫిర్యాదులో స్పష్టం చేశారు. ‘ కోర్టుతీర్పు తర్వాత, ముగ్గురిని జ్యుడీషల్ కస్టడీలోకి తీసుకున్నారు. కోర్టు నుండే దోషులను జైలుకు తరలించార్ను అని ప్రాసిక్యూషన్ తరఫున వాదిస్తున్న మాజీ జిల్లా ప్రభుత్వ న్యాయవాది అరుణ్ ప్రకాష్ సక్సేనా అన్నారు.

## గగన్‌యాన్ ప్రయోగానికి ముందుగా కీలక పరిశోధన

### - షార్ నుంచి క్రూ మాడ్యూల్ ఎస్కేప్ సిస్టం ప్రయోగానికి సర్వంసిద్ధం

**శ్రీహరికోట (తడ), అక్టోబర్ 18 ప్రభాతవార్త** అంతరిక్ష పరిశోధనలో అత్యంత ప్రతిష్టాత్మకమైన గగన్‌యాన్ ప్రయోగానికి శాస్త్రవేత్తలు ముందస్తుగా అన్ని పరిశోధనలు పూర్తి చేస్తున్నారు. ఇప్పటికే నింగిలో హెలికాప్టర్ ద్వారా పారాచూట్ల పరిశోధన, సముద్రంలోకి పరికరాలు చేర్చడం, క్షేమంగా భూమికి తీసుకురావడం వంటి పరిశోధనలు కొన్ని నెలలుగా పూర్తి చేశారు. ఇద్దరికి పైగా వ్యోమగాములకు శిక్షణ ఇచ్చారు. అంతరిక్షంలోకి మనుషులకు ముందుగా రోబోను ప్రయోగించడానికి రూపకల్పన చేశారు. ఇవన్నీ ఒక ఎత్తు అయితే నింగి నీరు నేలలలో ఒకేసారి క్రూమాడ్యూల్ ఎస్కేప్ సిస్టం ప్రయోగాన్ని ప్రస్తుతం శ్రీహరికోట నుంచి చేపడుతున్నారు. గగన్‌యాన్ టెస్ట్ వెహికల్ డి-1 పేరుతో దీన్ని రూపొందించారు. ఇప్పటిదాకా జరిగిన గగన్‌యాన్ పరీక్షలు, పరిశోధనలు ఒక ఎత్తు కాగా, ఈ ప్రయోగం మరో ఎత్తు. అందుకే దీనిని అత్యంత క్లిష్టమైనదిగా ఇస్రో శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. సాధారణంగా జిఎస్ఎల్వి తరహా రాకెట్లలో క్రింది భాగంలో ఉపయోగించే నాలుగు స్ట్రాపాన్ బూస్టర్లలో ఒక దాని సైజులో ఈ రాకెట్‌ను రూపొందించారు. ఎల్‌పార్టీగా పిలిచే ఈ బూస్టర్‌లో 44 టన్నుల ద్రవ ఇంధనం నింపారు. ఈ రాకెట్ ద్వారా క్రూమాడ్యూల్ పరికరాన్ని 16.9 కిలోమీటర్ల దూరం అంతరిక్షంలోకి ప్రయోగిస్తారు. అక్కడ నుంచి పారాచూట్ల సహాయంతో ఈ పరికరం సముద్రంలో పడుతుంది.

## పాక్‌లో ఆర్థిక సంక్షోభం - 48 విమానాలు రద్దు

**ఇస్లామాబాద్, అక్టోబరు 18:** పాకిస్థాన్ ఆర్థిక పరిస్థితి రోజురోజుకి మరింత దిగజారిపోతోంది. తాజాగా ఇంధనం లేని కారణంగా పాక్ ఇంటర్నేషనల్ ఎయిర్‌లైన్స్ (పిఐఎ) 48 జాతీయ, అంతర్జాతీయ విమానాలను నిలిపివేయాల్సి వచ్చింది. ఇంధనం పరిమితంగా ఉండడం వల్ల విమానాలు రద్దు చేయాల్సి వచ్చింది, కొన్ని విమాన సర్వీసులను రీషెడూనయల్ కూడా చేశామని పిఐఎ ప్రతినిధి ఒకరు తెలిపారు. ఇప్పటి వరకూ మొత్తం 13 దేశీయ, 11 అంతర్జాతీయ విమాన సర్వీసులు రద్దు చేసినట్లు చెప్పారు. అలాగే 12 విమానాలను షెడ్యూల్ మార్చామని అన్నారు. రద్దు చేసిన విమానాలకు సంబంధించిన ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని తెలిపారు. ప్రయాణికులు ఎయిర్‌పోర్టుకు వచ్చే ముందే పిఐఎ కస్టమర్ కేర్‌ను సంప్రదించాలని కోరారు. బుధవారం మరో 16 విమానాలను రద్దు చేశామని, మరికొన్ని ఆలస్యం కానున్నాయని చెప్పారు. బకాయిలు చెల్లించకపోవడంతో ప్రభుత్వ చమురు సంస్థ (పిఎస్ఒ) పిఐఎకు ఇంధన సరఫరా నిలిపివేయడంతో ఈ సంక్షోభం తలెత్తినట్లు తెలిసింది. దీంతో పిఐఎకు ఇంధన కొరత ఏర్పడింది. మరోవైపు రుణభారం పెరిగిపోతున్న నేపథ్యంలో పిఐఎను ప్రైవేట్ పరం చేసేందుకూ ఆలోచనలు నడుస్తున్నాయి.

## బెంగళూరు పబ్‌లో భారీ అగ్నిప్రమాదం

**బెంగుళూరు, అక్టోబరు 18 :** బెంగళూరులోని ఓ పబ్ మంటల్లో చిక్కుకుంది. ఈ దృష్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. కర్ణాటక రాజధాని బెంగళూరు నగరంలోని ఓ పబ్‌లో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. వివరాల్లోకి వెళితే.. కోరమంగళ ప్రాంతంలోని ఓ నాలుగు అంతస్తుల భవనంలో నిర్వహిస్తున్న పబ్‌లో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఇదే భవనంలో జిమ్, కార్ల షోరూం సైతం ఉన్నాయి. ప్రమాద సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది సుమారు ఆరు పఃరింజన్ల సాయంతో మంటలను అదుపులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. ప్రస్తుతానికి మంటలు చాలా వరకు అదుపులోకి వచ్చాయని పోలీసులు తెలిపారు. ఈ అగ్ని ప్రమాదానికి సంబం ధించిన దృష్యాలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి. ఓ వ్యక్తి భవనం టెర్రస్‌పై నుంచి కిందికిదూకాడు.

# గాజా ఆసుపత్రిపై దాడి ఉగ్రవాదుల పనే ఆధారాలున్నాయంటున్న ఇజ్రాయెల్

**జెరూసలెం, అక్టోబరు 18:** గాజాలోని అల్ అహ్లీ సిటీ ఆసుపత్రిపై ఇజ్రాయెల్ దాడులు చేసిందన్న పాలస్తీనా ఆరోపణలను ఇజ్రాయెల్ సైన్యం ఖండించింది. దాడి చేసింది తాము కాదని స్పష్టం చేసింది. పాలస్తీనా ఇస్లామిక్ జిహాద్ మిలిటరీ గ్రూప్ రాకెట్ మిస్‌ఫైర్ అయి ఆసుపత్రిపై పడిందని తెలిపింది. ఇందుకు సంబంధించిన ఆధారాలను కూడా విడుదల చేసింది. ఆసుపత్రి దాడిపై తీవ్రంగా



ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఇజ్రాయెల్ ఈ మేరకు స్పందించింది. పాలస్తీనా ఇస్లామిక్ జిహాద్ మిలిటరీ గ్రూప్ హమాస్‌తో కలిసి మిత్ర కూటమిగా పనిచేస్తోంది. హమాస్, ఇజ్రాయెల్ యుద్ధం మంగళవారం భీకర రూపం సంతరించుకుంది. సెంట్రల్ గాజాలోని అల్ అహ్లీ సిటీ ఆసుపత్రిపై ఇజ్రాయెల్ జరిపిన భారీ వైమానిక దాడిలో ఏకంగా 500 మంది ప్రాణాలు కోల్పోయారని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది. అయితే దాడిని ఇజ్రాయెల్ ధృవీకరించలేదు. హమాస్ దళాలకు చెందిన రాకెట్ దాడుల్లోనే ఆసుపత్రి కూలిపోయిందని స్పష్టం చేసింది. అక్టోబరు 7న హమాస్ దళాలు ఇజ్రాయెల్‌లో నోవా ఫెస్టివల్‌పై దాడులు ప్రారంభించాయి. అకస్మాత్తుగా జరిగిన ఈ దాడుల నుంచితేరుకుని ఇజ్రాయెల్ హమాస్ దళాలపై తిరగబడింది. హమాస్ అంతమే లక్ష్యంగా మెరుపుదాడులు చేస్తోంది. ఇరుపక్షాల వైపు దాడుల్లో ఇజ్రాయెల్‌లో సైనికులు, మహిళలు, చిన్నారులతో సహా 1,400 మందికిపైగా జనం మరణించారు. హమాస్ దళాల చేతికి దాదాపు 200 మంది ఇజ్రాయెల్ పౌరులు బందీలుగా చిక్కారు. ఈ విషయాన్ని యావత్ ప్రపంచం తెలుసుకోవాలి. గాజాలోని అనాగరిక ఉగ్ర మూకలే, అక్కడి ఆసుపత్రిపై దాడి చేశాయి. ఐడిఎఫ్ (ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్) కాదు. మా పిల్లలను అతి దారుణంగా హత్య చేసిన ఆ ఉగ్రవాదులు ఇప్పుడు వారి పిల్లలను కూడా చంపేస్తున్నారు' అని నెతన్యాహు ఆరోపించారు. అటు ‘ ఇజ్రాయెల్ డిఫెన్స ఫోర్సెస్' కూడా ఇదే విషయాన్ని వెల్లడించింది. ఆసుపత్రి సమీపంలో పిఐజె మిలిటెంట్లు ప్రయోగించిన రాకెట్ గురితప్పి ఆసుపత్రిలో పేలుడు సంభవించిందని పేర్కొంది. ఇదిలా ఉండగా, ఆసుపత్రిలో పేలుడు ఘటనపై అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తీవ్రంగా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ విషయం తెలియగానే తాను జోర్డాన్ రాజు అబ్దుల్లా 2, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో మాట్లాడినట్లు తెలిపారు. మరోవైపు ఈ దాడి నేపథ్యంలో బైడెన్ జోర్డాన్ పర్యటన రద్దయింది. జోర్డాన్‌లో ఆయన అబ్దుల్లాతో పాటు ఈజిప్టు ప్రధాని ఎల్-సిసి, పాలస్తీనా అధ్యక్షుడు మహ్‌ముద్ అబ్బాస్ తదితరులతో భేటీ కావాల్సి ఉండగా, ఆ సమావేశం రద్దయినట్లు జోర్డాన్ విదేశాంగ మంత్రి తెలిపారు. ఇందుకు గల కారణాన్ని మాత్రం ఆయన వెల్లడించలేదు. మరోవైపు బైడెన్ ఇప్పటికే ఇజ్రాయెల్ పర్యటన నిమిత్తం బయల్దేరారు. బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ కూడా ఈ వారం ఇజ్రాయెల్‌లో పరనయటించనున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ కొన్ని కథనాలు వెలువడ్డాయి.

### 4.30 గంటలు డోర్ పట్టుకునే ఉన్నాం:

హమాస్ దాడిని ప్రత్యక్షంగా చూసిన కేరళ మహిళ

తిరువనంతపురం, అక్టోబరు 18: కేరళకు చెందిన సబిత, మీరా మోహన్ ఇజ్రాయెల్‌లో కేర్‌గివర్లుగా పనిచేస్తున్నారు. ఇటీవల గాజా సరిహద్దుల్లోని నీర్ ఓజ్ అనే కిబుట్జ్‌లోకి హమాస్ మిలిటెంట్లు చొరబడి



నరమేధానికి పాల్పడిన సమయంలో వారు అక్కడే విధి నిర్వహణలో ఉన్నారు. ఆ సమయంలో ప్రాణాలకు తెగించి వారు ఓ వృద్ధురాలిని హమాస్ దాడి నుంచి కాపాడగలిగారు. వారి ధైర్యాన్ని అభినందిస్తూ భారత్‌లోని ఇజ్రాయెల్ ఎంబసి తాజాగా తమ అధికారిక ఎక్స్ ఖాతాలో ఓ విడియోను పోస్ట్ చేసింది. ఆనాడు వారు ఎదుర్కొన్న భయానక అనుభవాన్ని సబిత ఆ విడియోలో గుర్తుచేసుకున్నారు. ఈ సరిహద్దు ప్రాంతంలో నేను మూడేళ్లుగా పనిచేస్తున్నా. ఎఎల్ఎస్ వ్యాధితో బాధపడుతున్న రాహేల్‌కు నేను, మీరా మోహన్ కేర్‌గివర్లుగా ఉన్నాం. ఆ రోజు అక్టోబరు 7న నేను నైట్ డ్యూటీలో ఉన్నాం. ఉదయం 6.30 గంటలకు వెళ్లిపోవాల్సి ంది. సరిగ్గా అదే సమయంలో మాకు సైరన్లు వినిపించాయి. వెంటనే రహేల్‌ను తీసుకుని మేం సేఫ్టీ గదుల్లోకి పరిగెత్తాం. సైరన్ల మోత ఆగట్లేదు. బయట ఏం జరుగుతుందో తెలియదు. అప్పుడు రహేల్ కుమార్తె మాకు ఫోన్ చేసి,‘ పరిస్థితి చేయి దాటిపోయింది. ముందు, వెనుక డోర్లు లాక్ చేసుకోండి' అని చెప్పారు. ‘ వెంటనే మేం తలుపులు లాక్ చేసుకున్నాం. ఉదయం 7.30గంటల సమయంలో ఉగ్రవాదులు మా ఇంట్లోకి చొరబడ్డారు. మేము ఉన్న గది తలుపులు తెరిచేందుకు ప్రయత్నించారు. మాకేం చేయలో అర్థం కాలేదు. మళ్లీ రహేల్ కుమార్తెకు ఫోన్ చేశాం.‘ డోర్‌ను గట్టిగా పట్టుకోండి. వదిలిపెట్టొద్దు' అని ఆమె చెప్పారు. మేం అలాగే చేశాం. గ్రిప్ పోకుండా ఉండేందుకు చెప్పులను కూడా తీసేశాం. బయట నుంచి ఉగ్రవాదులు మా గది తలుపు బద్దలుకొట్టేందుకు ప్రయత్నిస్తూనే ఉన్నారు. తుపాకీతో కాల్పులు కూడా జరిపారు' అని తెలిపారు.

‘ దాదాపు నాలుగున్నర గంటల పాటు మేం ఆ డోర్‌ను గట్టిగా పట్టుకునే ఉన్నాం. మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో మళ్లీ కాల్పుల చప్పుడు వినిపించింది. అప్పుడు షెములిక్ (ఆ ఇంటి యజమాని) వచ్చి ఇజ్రాయెల్ సైన్యం వచ్చిందని చెప్పారు. ఆయన బయటకెళ్లి చూసే సరికి అంతా ధ్వంసమై కనిపించింది. మా ఇంట్లో ఉగ్రవాదులు అన్ని దోచుకెళ్లారు. మీరా పాస్‌పోర్ట్, నా ఎమర్జెన్సీ బ్యాగ్‌ను కూడా తీసుకెళ్లారు'. ‘ సాధారణంగా సరిహద్దుల్లో ఉండే మాకు క్షిపణులు పడినప్పుడు సేఫ్టీ గదుల్లోకి వెళ్లి, పరిస్థితులు సద్దుమణిగా బయటకు రావడం అలవాటే. అప్పుడు మా ఎమర్జెన్సీ బ్యాగులు తీసుకుని వెళ్తాం. అందులో మా డాక్యుమెంట్లన్నీ ఉంటాయి. కానీ ఇలాంటి ఉగ్రదాడిని మేం ఊహించలేదు.

### గాజాపై వైమానిక దాడులు ఆపితే..బందీల విడుదల..

ఇజ్రాయెల్‌పై మెరుపుదాడి చేసి కొందరు పౌరులను బందీలుగా పట్టుకెళ్లిన హమాస్ గ్రూప్, ఇప్పుడు వారిని విడిచిపెట్టేందుకు ఆఫర్ ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఇందుకోసం ఇజ్రాయెల్‌కు షరతు విధించినట్లు సమాచారం. గాజాలో బాంబు దాడులు ఆపితే బందీలందరినీ విడిచిపెట్టేస్తామని హమాస్ సీనియర్ అధికారి ఒకరు చెప్పినట్లు కథనాలు వెలువడ్డాయి. గాజాలో ఇజ్రాయెల్ బలగాలు తమ సైనిక దురాక్రమణ, వైమానిక దాడులను నిలిపివేస్తే, గంటలోనే మా వద్ద బందీలుగా ఉన్న ఇజ్రాయెల్, ఇతర దేశాల పౌరులను విడిచిపెడతాం. ప్రస్తుతం వారిని విడిచిపెట్టేందుకు సురక్షిత ప్రదేశం లేదు' అని హమాస్ సీనియర్ అధికారి చెప్పినట్లు కథనం పేర్కొంది. ఆ అధికారి ఎవరనేది మాత్రం వెల్లడించలేదు.



## ఇజ్రాయెల్ నుంచి భారత్ చేరిన ఐదో విమానం

**న్యూఢిల్లీ, అక్టోబరు 18:** ఇజ్రాయెల్‌లో చిక్కుకున్న భారతీయులను స్వదేశానికి రప్పించేందుకు చేపట్టిన ఆపరేషన్ అజయ్ నిర్విరామంగా కొనసాగుతోంది. తాజాగా 286 మందితో కూడిన మరో విమానం భారత్ చేరుకుంది. ఇందులో 18 మంది నేపాలీలు కూడా ఉన్నారు. ఈ విషయాన్ని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధి అరిందమ్ బాగ్చి ట్విట్టర్ వేదికగా పంచుకున్నారు. భారత్ తిరిగి వచ్చిన వారు తమ హర్షాన్ని వ్యక్తం చేస్తున్న దృశ్యాలను కూడా షేర్ చేశారు. ఇజ్రాయెల్ నుంచి భారతీయలను స్వదేశానికి తీసుకురావడానికి ఎ340 విమానం ఆదివారం టెక్ అవీవ్ నగరానికి చేరుకోగానే సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో ఆ విమానాన్ని జోర్డాన్‌కు తీసుకెళ్లి సమస్యను పరిష్కరించారు. ఫలితంగా సోమవారం రావాల్సిన విమానం మంగళవారం 286 మందితో ఢిల్లీ చేరుకుంది. ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం వల్ల ఇటు ఇజ్రాయెల్, అటు పాలస్తీనాలో కల్లోల పరిస్థితులు నెలకొన్నాయి. యుద్ధంతో అంతర్జాతీయ విమాన రాకపోకలు కూడా బంద్ అయ్యాయి. దీంతో స్వదేశానికి భారతీయులను సురక్షితంగా తీసుకురావడానికి కేంద్రం ఆపరేషన్ అజయ్ కార్యక్రమాన్ని చేపట్టింది. ఇప్పటికే నాలుగు విమానాల్లో సుమారు 900కుపైగా మందిని భారత్‌కు తరలించారు. తాజాగా ఐదో విమానం చేరుకుంది.

# గాజా శరణార్థులను ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నాం :స్కాట్లాండ్ ఫస్ట్ మినిస్టర్

**ఎడిన్‌బర్గ్, అక్టోబరు 18:** యుద్ధం వల్ల తీవ్రంగా నష్టపోతున్న గాజా ప్రజలకు ఆశ్రయం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని స్కాట్లాండ్ ఫస్ట్ మినిస్టర్ హమ్జా యూసఫ్ అన్నారు. యూసఫ్ అత్తమామలు గాజాలోనే చిక్కుకుపోయారు. ఆయన బంధువుల్లోని ఓ రెండేళ్ల చిన్నారి యుద్ధం కారణంగా గాయపడింది. ఈ నేపథ్యంలో యూసఫ్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎవరికి చికిత్స చేయాలి? వైద్యం అందకపోతే చనిపోతారని తెలిసి కూడా ఎవరిని వదిలేయాలో తేల్చుకోలేని దిక్కుతోచని స్థితిలో గాజా వైద్యులున్నారని చెప్పారు. గాజా శరణార్థుల గురించి మాట్లాడుతూ సిరియా, ఉక్రెయిన్ ఇతర దేశాల నుంచి చాలా మందిని మనం ఆహ్వానించాం. మళ్లీ మనం ఆ పని చేయాల్సిన అవసరం ఉంది. ఈ భీకర దాడుల్లో చిక్కుకున్న వారికి భద్రత, ఆశ్రయం కల్పించేందుకు యూకెలోని మొదటి ప్రాంతంలో స్కాట్లాండ్ సిద్ధంగా ఉందని ప్రకటించారు. గాజాలో నిరాశ్రయులైన పది లక్షల మందిని ఆదుకునేందుకు ప్రపంచవ్యాప్త శరణార్థుల కార్యక్రమానికి అంతర్జాతీయ సమాజం కట్టుబడి ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. యూకె ప్రభుత్వం అత్యవసరంగా రెండు చర్యలు తీసుకోవాలని కోరారు. ముందుగా గాజాలో ఉన్నవారికోసం శరణార్థుల పునరావాస పథకాన్ని రూపొందించాలి. గాజాలో గాయపడిన పౌరులను వైద్య చికిత్స నిమిత్తం తరలించే కార్యక్రమానికి మద్దతివ్వాలని కోరారు. ఒకవేళ ఇది కార్యరూపం దాల్చితే స్కాట్లాండ్ తన వంతు పాత్ర పోషిస్తుందన్నారు. క్షతగాత్రులైన గాజా పురుషులు, స్త్రీలు, చిన్నారులకు తమ ఆసుపత్రుల్లో చికిత్స అందచేస్తామని పేర్కొన్నారు. గాజాలో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని మినిస్టర్ హమ్జా యూసఫ్ వ్యాఖ్యానించారు. మా బావ గాజాలో వైద్యుడు. ఆయనతో ఫోన్‌లో మాట్లాడినప్పుడు అక్కడ జరుగుతున్న మారణహోమాన్ని వివరించారు.



సరిపడా మందులు, వైద్యులు, నర్సులు లేకుండానే అక్కడి ఆసుపత్రుల్లో చికిత్స కొనసాగుతోందని చెప్పారు. ఎవరికి చికిత్స అందించాలో చనిపోయినా ఫర్వాలేదని ఎవరిని వదిలేయాలో వారు తేల్చుకోవాలేకపోతున్నారని చెప్పారు. ఈ ఆధునిక యుగంలో అలాంటి పరిస్థితులను రానివ్వకూడదన్నారు. హమ్జాయూసఫ్ స్కాట్లాండ్ ఫస్ట్ మినిస్టర్‌గా కొనసాగుతున్నారు. అంటే మంత్రివర్గానికి ఆయన నాయకత్వం వహిస్తారు. ఇది ప్రధానమంత్రి పదవికి సమానంగా ఉంటుంది. ఇజ్రాయలల్, హమాస్ యుద్ధం కారణంగా ఆయన అత్తమామలు గాజాలో చిక్కుకుపోయారు. అక్కడ వారికి సరిపడా ఆహారం, నీరు అందం లేదు. ఆ ప్రాంతాన్ని వీడకపోతే వారు చనిపోతారని ఇజ్రాయెల్ డ్రోన్ దాడిలో తన సోదరుడి రెండేళ్ల చిన్నారి గాయపడ్డాడని యూసఫ్ సతీమణి చెప్పారు.

## ఒకేసారి 6 ఎయిర్ పోర్టులకు బాంబు బెదరింపుల కలకలం

**పారిస్, అక్టోబర్ 18 :** ఇజ్రాయిల్- హమాస్ యుద్ధవేళ.. ఫ్రాన్స్‌లో ఉద్రిక్త ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. తాజాగా పలు విమానాశ్రయాలకు బాంబు బెదిరింపులు రావడం కలకలం సృష్టించింది. ఫ్రాన్స్‌లో ఒకేసారి పలు విమానాశ్రయాలకు బెదిరింపులు రావడం తీవ్ర కలకలం రేపింది. దీంతో ఆయా ఎయిర్‌పోర్టులను ఖాళీ చేయించిన అధికారులు ముమ్మర తనిఖీలు చేపట్టినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఇజ్రాయిల్- హమాస్ మధ్య యుద్ధం కొనసాగుతొన్న వెకళ బెదిరింపులు రావడం గమనార్హం. ఫ్రాన్స్‌లో లిల్లె ఎయిర్‌పోర్టుకు తొలుత బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. దీంతో భద్రతా సిబ్బంది విమానాశ్రయాన్ని ఖాళీ చేయించి తనిఖీలు చేపట్టారు. ఆ తర్వాత గంటల వ్యవధిలోనే బ్యూవైస్ టోలౌస్,నైస్ లియాన్, నాంటెస్ ఎయిర్‌పోర్టులకు కూడా ఈ తరహా బెదిరింపులు రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ముందు జాగ్రత్తగా ఆ విమానాశ్రయాలను ఖాళీ చేయించారు. ఏం జరుగుతుందో అర్థంగాక ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. కాగా.. నైస్ ఎయిర్‌పోర్టులో ఓ అనుమానస్పద బ్యాగుకూడా కనిపించినట్లు ఆ విమానాశ్రయం తమ ఎక్స్ ట్విటర్ ఖాతాలో వెల్లడించింది. అయితే ప్రస్తుతం పరిస్థితులు సాధారణస్థితికి వచ్చినట్లు పేర్కొంది. మరోవైపు లిల్లె ఎయిర్‌పోర్టులోనూ ఎలాంటి పేలుడు పదార్థాలు లభించకపోవడంతోనూ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం కొన్ని చోట్ల తనిఖీలు కొనసాగుతున్నాయి. ఇజ్రాయిల్ -హమాస్ పోరు తర్వాత నుంచి ఫ్రాన్స్‌లో ఉద్రిక్తత ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల ఓ స్కూల్‌లో దుండగుడు చొరబడి ఓ టీచర్‌ను అతి దారుణంగా చంపిన విషయం తెలిసిందే. దీంతో ఫ్రాన్స్ వ్యాప్తంగా భద్రతను కట్టుదిట్టం చేశారు. ప్రముఖ పర్యాటక ప్రాంతంల్లో భద్రతా బలగాలను మోహరించారు.

# యుద్ధం వేళ మాలాలా రూ.2.5 కోట్ల సాయం



**న్యూఢిల్లీ, అక్టోబర్18:** గాజా ఆసుపత్రిపై రాకెట్ దాడి జరగడం పట్ల నోబెల్ పురస్కార గ్రహీత మలాలా యూసఫ్‌జాయ్ విచారం వ్యక్తం చేశారు. బాధితులను ఆదుకునేందుకు తన వంతుగా రూ.2.5 కోట్ల సాయం ప్రకటించారు. ఈ సందర్భంగా ఓ వీడియో సందేశాన్ని విడుదల చేవారు. గాజాలోని అల్ అహ్లి ఆసుపత్రిపై జరిగిన బాంబుదాడిచూసి భయపడ్డాను. ఆ చర్యను ఖండిస్తున్నాను. ఇజ్రాయెల్, పాలస్తీనా ప్రపంచవ్యాప్తంగా శాంతినెలకొనాలని కోరుకుంటున్న వారితో నేను గొంతుకలుపుతున్నాను. సామూహిక శిక్ష పరిష్కారం కాదు. గాజాలో నివసిస్తున్న జనాభాలో సగం మంది 18 సంవత్సరాలలోపు వయసున్నవారే. వారు తమ జీవితంతాంతం బాంబు దాడుల మధ్య ఉండకూదని అందులో పేర్కొన్నారు. గాజాకు మానవతా సాయం అందేందుకు సహకరించాలని ఆమె ఇజ్రాయెల్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ సంక్షోభం వేళ పాలస్తీనా ప్రజలకు సాయం చేస్తున్న మూడు స్వచ్ఛంద సంస్థలకు 3 లక్షల డాలర్లు విరాళంగా అందచేస్తున్నట్లు ప్రకటించారు. అలాంటి స్వచ్ఛంద సంస్థలకు ప్రజలు విరాళాలిచ్చి ఆదుకోవాలని మలాలా పిలుపునిచ్చారు. ఇరుదేశాలు తక్షణమే కాల్పుల విరమణ ఒప్పందం చేసుకుని, శాంతి స్థాపనకు కృషి చేయాలన్నారు. గాజాలోని అల్ అహ్లి ఆసుపత్రిపై దాడి జరగడాన్ని ఇప్పటికే పలువురు ప్రముఖులు ఖండించారు. పేలుడు ఘటనపై అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తీవ్రంగా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రస్తుత సంఘర్షణలో పౌరుల మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయి. వీటితో సంబంధం ఉన్నవారు బాధ్యత వహించాలని భారత ప్రధాని వ్యాఖ్యానించారు. రష్యా, ప్రపంచ ఆరోగ్య సంస్థ సైతం ఈ దాడిని ఖండించాయి. ఈ దారుణానికి ఇజ్రాయెల్ వైమానిక దాడులే కారణమని హమాస్ ఆరోపించగా దాన్ని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఖండించారు. అది ఉగ్రమూకల దుశ్చర్యే అని దుయ్యబట్టారు. వారు ప్రయోగించిన రాకెట్ గురి తప్పి ఆ ప్రమాదం చోటు చేసుకుందని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ అధికారి చెప్పారు.

## రాకెట్ గురితప్పే పేలుడు.. అల్ అహ్లీ ఆసుపత్రి ఘటనపై ఐడిఎఫ్ ప్రతినిధి!

**జెరూసలెం, అక్టోబరు 18 :** గాజాలోని అల్ అహ్లి ఆసుపత్రిపై దాడిని తమ పని కాదని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ వెల్లడించింది. ఈ మేరకు సాక్ష్యాలను ట్విటర్‌లో అందుబాటులోకి తెచ్చింది. వీటిలో వీడియోలు, ఆడియో రికార్డింగ్‌లు వంటివి కూడా ఉన్నాయి. గాజా ఆసుపనరతిపై దాడికి వాడిన మందుగుండు యుద్ధ విమానాలు ప్రయోగించేదిలేదని ఐడీఎఫ్ ప్రతినిధి వెల్లడించారు. గాజాలోని ఆల్ అహ్లి ఆసుపత్రిలో పేలుగు సంబంధించి ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ పలు ఆధారాలను ట్వీట్ చేస్తోంది. తాజాగా ఐడీఎఫ్ ప్రతినిధి రియల్ ఆడ్మరల్ డేనియల్ హగారి ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. వాస్తవానికి పేలుడు ఆసుపత్రి పార్కింగ్ ప్రదేశంలో చోటుచేసుకొందని వివరించారు.ు పేలుడు చోటు చేసుకొన్న ప్రదేశంలో భారీ గొయ్యి ఏర్పడలేదు. అక్కడి గోడలు కూడా బలంగానే ఉన్నాయని. ఆ పార్కింగ్‌లో పేలుడు వాడింది గగనతల దాడులకు వినియోగించే మందుగుండు కాదని తెలుస్తోంది. మా ఏరియల్ పుటేజీ విశ్లేషణలో ఆసుపత్రిని ఏదీ నేరుగా తాకలేదని తేలింది. అక్కడి పార్కింగ్ ప్రదేశం దెబ్బతిన్నది. అక్కడ కాలిన గుర్తులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆసుపత్రికి అత్యంత సమీపం నుంచి రాకెట్‌ను ప్రయోగించినట్లు తెలుస్తోంది.వెంటనే ఆ రాకెట్ కూలిపోవడంతో అందులోని ఇంధనం జాడ కనిపిస్తోంద్ని అని పేర్కొన్నారు. రాత్రి సమయంలో ఆసుపత్రి సమీపంలోని శ్మశానం నుంచి ఇస్లామిక్ జిహాద్ సంస్థ దాదాపు 10 రాకెట్లను ప్రయోగించింది. గాజాలోని ఆసుపత్రిలో అదే సమయానికి పేలుడు వినిపించింద్ని అని డేనియల్ హగారి వెల్లడించారు. రాకెట్ గురితప్పడంపై చర్చించుకొంటున్న ఇద్దరు ఉగ్రవాదుల సంభాషణలు కూడా తమ ఇంటెలిజెన్స్ ప్రదేశం ఏరియల్ వ్యూ వీడియోను కూడా ఐడీఎఫ్ గాజాలోని మిలిటెంట్ సంస్థలు ప్రయోగించే రాకెట్లు మార్గం మధ్యలో కూలిపోవడం సర్వసాధారణమని హగారి వెల్లడించారు. యుద్ధం మొదలైన నాటి నుంచి దాదాపు450 రాకెట్లు గాజా భూభాగంలోనే కూలిపోయాయని వివరించారు. పారదర్శకత్వం కోసం తాము ఆధారాలను ఆమెరికా సహా ఇతరులతో పంచుకుంటూన్నామని చెప్పారు.





# పదేళ్లలో 42 భేటీలు.. పుతిన్‌తో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్!

**బీజింగ్, అక్టోబరు 18:** ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో ఇరు దేశాల మధ్య సన్నిహిత రాజకీయ సమన్వయం, విశ్వాసం అవసరమని రష్యానయ అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పేర్కొన్నారు. చైనా పర్యటనలో ఉన్న ఆయన, అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ చట్టాలను కాపాడేందుకు సంయుక్త కృషికి చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. చైనా పర్యటనలో ఉన్న పుతిన్‌తో ద్వైపాక్షిక చర్చల సమయంలో ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై ఇరువురు నేతలు చర్చించినట్లు సమాచారం. బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ కార్యక్రమం ప్రారంభించిన పదేళ్లయిన సందర్భంగా బీజింగ్‌లో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ శిఖరాగ్ర సదస్సులో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఐ పనితీరును ఆయన కొనియాడారు. అనంతరం జిన్‌పింగ్‌తో ద్వైపాక్షిక చర్చలు జరిపిన ఆయన, ప్రస్తుతం నెలకొన్న ఇబ్బందికర పరిస్థితుల్లో సన్నిహిత విదేశీ విధాన సమన్వయం ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. ఇప్పటికే దీన్ని కొనసాగిస్తున్నామన్న ఆయన, వీటన్నింటిపై సుదీర్ఘ చర్చలు జరుపుతామన్నారు. షీ జిన్‌పింగ్ మాట్లాడుతూ, పుతిన్, తాను గడచిన 10యేళ్లలో 42 సార్లు సమావేశమయ్యామని గుర్తుచేశారు. ఇరుదేశాల మధ్య మంచి సంబంధాలను ఏర్పరచడంతో పాటు వ్యక్తిగతంలోనూ మంచి స్నేహితులమయ్యామని తెలిపారు.

## కోనసీమ తిరుమల వాడపల్లి వెంకన్న హుండీల ఆదాయం

### 27 రోజులకు 80 లక్షల46 వేల 827రూపాయలు.

### - ఆలయఈ వో ముదునూరి సత్యనారాయణ రాజు వెల్లడి.

**ఆత్రేయపురం, అక్టోబర్ 18( ప్రభాతవార్త )**



కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి ఆలయ హుండీల ద్వారా 80 లక్షల 46వేల 827 రూపాయలు ఆదాయం లభించినట్లు ఆలయ ఈ ఓ సత్యనారాయణ రాజు వెల్లడించారు. ఆలయ ఆవరణలో హుండీలను బుధవారం బుధవారం ఉదయం దేవాదాయ శాఖ పర్యవేక్షణాధికారులు కే ఎన్ వి డి వరప్రసాద్, ఎం రాధాకృష్ణ, ఎన్ వి ఎన్ ఎస్ వి ప్రసాదరాజు, పీకే లక్ష్మణరావు తదితరుల సమక్షంలో లెక్కించారు. 27 రోజులకు గాను ప్రధాన హుండీల ద్వారా 60 లక్షల 63 వేల558 రూపాయలు, అన్న ప్రసాదం హుండీల ద్వారా 19 లక్షల,83 వేల 269 రూపాయలు, లభించాయన్నారు. అలాగే బంగారం 12 గ్రాములు, వెండి 309 గ్రాములు, పలు విదేశీ కరెన్సీ నోట్లు లభించాయన్నారు. ఈ కార్యక్రమాలలో ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు, కమిటీ సభ్యులు పి సురేష్ రాజు , రెడ్డి చంటి రవిదేవి, మెర్ల వెంకటేశ్వరరావు, మన్యం భాను, రొట్టె రాజేశ్వరి రాజబాబు, కే శారదాంబ శ్రీనివాస్, ఏపుగంటి కనకారావు, శనగల సత్యనారాయణ, వాడపల్లి వెంకట సత్య సాయి, ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్, శ్రీదేవి, సిబ్బంది నారాయణ, రామానుజన్ ఆలయ అర్చకులు సిబ్బంది పాల్గొని సహాయ సహకారాలు అందించారు.



## భువనేశ్వరికి పలు వర్గాల ప్రజల సంఘీభావం

**ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బ్యూరో అక్టోబర్ 18( ప్రభాతవార్త):**

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ పలు ప్రాంతాల ప్రజలు నారా భువనేశ్వరికి తమ సంఘీభావం తెలిపారు. రంపచోడవరం, పెద్దాపురం అసెంబ్లీ నియోజకవర్గాలకు నుంచి వచ్చిన ప్రజలు, టీడీపీ కార్యకర్తలు రాజమహేంద్రంలో విద్యానగర్ లోని క్యాంప్ కార్యాలయంలో భువనేశ్వరిని కలిసి తమ మద్దతు ప్రకటించారు. తెలంగాణ రాష్ట్రం నుంచి వచ్చిన పలువురు టీడీపీ కార్యకర్తలు కూడా భువనేశ్వరిని కలిసి చంద్రబాబు ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకుని తమసంఘీబావం తెలిపారు.





## చంద్రబాబు ఆరోగ్య పరిస్థితిపై
# ఆందోళన ఉంది

- -జగన్ రాక్షస క్రీడకు ముగింపు పలకాలి
- -చంద్రబాబు హెల్త్ బులిటెన్ ను కుటుంబ సభ్యులకు ఎందుకివ్వరు
- -లాయర్ల ములాఖత్ ను ఎందుకు తగ్గించారు
- -దళితులను చంపిన వారికి మాత్రం ఇష్టానుసారంగా ములాఖత్ లా.
- -భువనేశ్వరిని కలిసి సంఘీభావం తెలిపే హక్కు మాకు లేదా
- -మాజీమంత్రులు కళావెంకట్రావు, కొల్లు రవీంద్ర

**ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బ్యూరో అక్టోబర్ 18 (ప్రభాతవార్త)**

రాష్ట్రంలో జగన్ ఆడుతున్న వికృత క్రీడకు పులుస్టాప్ పడాలని మాజీమంత్రులు కిమిడి కళావెంకట్రావు, కొల్లు రవీంద్ర అన్నారు. అధికారులు ఇచ్చే మందులతో చంద్రబాబుకు ఉపశమనం లభించలేదని, చంద్రబాబు హెల్త్ బులిటెన్ ను కుటుంబ సభ్యులకు ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. చంద్రబాబుతో లాయర్ల రోజువారీ అయ్యే ములాఖత్ లను కూడా తగ్గించారని, దళితులను చంపిన వారికి, శిరోముండనాలు చేసిన వారికి ఇష్టానుసారంగా ములాఖత్ లకు అవకాశం ఇస్తున్నారని మండిపడ్డారు. రాజమహేంద్రవరంలోని కేంద్ర కారాగారంలో ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబుతో బుధవారం నారా లోకేష్, భువనేశ్వరి, బ్రాహ్మణి ములాఖత్ అయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర కారాగారం వద్ద కళావెంకట్రావు, కొల్లు రవీంద్ర మీడియాతో మాట్లాడారు. కళావెంకట్రావు మాట్లాడుతూ' చంద్రబాబు ఆరోగ్య పరిస్థితిపై మాకు ఆందోళన ఉందని చంద్రబాబుకు చేసే వైద్య పరీక్షలు, డాక్టర్లు ఏం సలహాలు ఇచ్చారో లిఖిత పూర్వకంగా ఇవ్వాలని భువనేశ్వరి ఇటీవల అధికారులకు లేఖ కూడా రాశారన్నారు. చంద్రబాబు వైద్య నివేదికను వ్యక్తిగత డాక్టర్లకు పంపిస్తే పాత మందులకు మార్పులు చేర్పులు చేస్తే గానీ పరిస్థతి మారుతుందేమో చూడాలి. వైద్య నివేదికలు ఇవ్వకపోవడానికి కారణం ఏంటని ప్రశ్నించారు .తప్పుడు కేసులు, తప్పుడు ఆరోపణలతో 40 రోజులుగా చంద్రబాబును జైల్లో పెట్టారు. కేసును ఏదో విధంగా ఆలస్యం చేసి చంద్రబాబును ఇంకా జైల్లో పెట్టాలని చూస్తున్నారు. 40 రోజులుగా ఒక్క ఆధారం కూడా కోర్టులకు చూపించలేదు. ప్రజాస్వామ్యంలో పాలకులు ఉండే విధంగా జగన్ ఉండటం లేదు. ఈ ప్రభుత్వంలో ఎవరికీ స్వేచ్ఛ లేదు. జైల్ల శాఖ డీఐజీ ప్రభుత్వాన్ని మెప్పించేలా మాట్లాడుతున్నారు. పోలీస్ వ్యవస్థలకు కొన్ని విలువలు ఉంటాయి..వాటికి అనుగుణంగా నడుచుకోవాలి. జగన్ వ్యవస్థలను చేతుల్లో పెట్టుకుని పోలీసులను పావులా వాడుకుంటున్నారని విమర్శించారు.కొందరు చేసే చెడ్డ పనులతో వ్యవస్థలకు చెడ్డపేరు వస్తోంది. డాక్టర్ల నివేదకను వెంటనే కుటుంబ సభ్యులకు ఇవ్వాలి. ఆరోగ్య నివేదిక డాక్టర్లు ఇవ్వకుండా..పోలీసులు ఎందుకు ఇస్తున్నారు. అధికారంలోకి వచ్చాక సీఎం కుర్చీనే కాదు..బాధ్యతలు కూడా ఉంటాయి. చంద్రబాబు వైద్య నివేదికలు ఎప్పటికప్పుడు కుటుంబ సభ్యులకు అందించాలని కళావెంకట్రావు డిమాండ్ చేశారు.

కొల్లు రవీంద్ర మాట్లాడుతూ

చంద్రబాబు ఆరోగ్య పరిస్థితి చూస్తే బాధగా ఉంది. 14 ఏళ్లు సీఎంగా చేసిన వ్యక్తి పట్ల ఇష్టానుసారంగా ప్రభుత్వం వ్యవహరించడం సరికాదు. చంద్రబాబు ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందో కుటుంబ సభ్యులకు కూడా చెప్పరా అని ప్రశ్నించారు .లాయర్ల





ములాఖత్ ను కూడా తగ్గిస్తున్నారు. దళితులను చంపిన, శిరోముండనాలు చేసిన వారికి ఇష్టానుసారంగా ములాఖత్ లకు అవకాశం ఇస్తున్నారు. చట్టాల్లోని లోపాలను వినియోగించుకుని, వ్యవస్థలను మేనేజ్ చేసి చంద్రబాబును జైల్లో పెట్టారు. ఈ వికృతానందం ఎన్నో రోజులు ఉండదు. భువనేశ్వరికి సంఘీభావం తెలిపేందుకు వచ్చిన బీసీలను అడ్డుకున్నారు.

# వైసీపీకి ముకుమ్మడి రాజీనామాలు

- -బూరుగుపూడిలో జనసేన తీర్థం పుచ్చుకున్న వైసీపీ కీలక నేతలు, కార్యకర్తలు
- -జననీరాజనాలతో జనసంద్రమై 'బత్తుల' దంపతులకు అఖండ స్వాగతం
- -ఎన్నికలకు ముందే వైసీపీకి 'చెక్' పెట్టేలా "బత్తుల" పదునైన వ్యూహం

**ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బ్యూరో అక్టోబర్ 18 (ప్రభాతవార్త):**





రాజానగరం నియోజకవర్గం కోరుకొండ మండలం బూరుగుపూడి గ్రామంలో వైఎస్ఆర్సిపి కి చెందిన కీలక నేతలు, కార్యకర్తలు పార్టీ నుంచి వీడి జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలు ఆయన చేస్తున్న ప్రజా పోరాటాలు మనసుకు నచ్చి జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో జనసేన పార్టీ లో చేరారు. రాజానగరం నియోజకవర్గంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ తన సేవానిరతిని చాటుకుంటూ ప్రజా సమస్యలపై దీటుగా స్పందిస్తూ నియోజకవర్గ ప్రజలకు అన్ని విధాల బాసటగా ఉంటూ ప్రజల ఆశీస్సులతో ప్రజానాయకుడిగా ఎదుగుతూ సమర్దవంతమైన నాయకత్వానికి నిదర్శనం నియోజవర్గ జనసేన పార్టీ రథసారథి బత్తుల బలరామకృష్ణ, వెంకటలక్ష్మి దంపతులు సీనియర్ జనసేన నేతలు, జనసైనికుల సమక్షంలో జనసేన కుటుంబంలోకి చేరారు. వారందరికీ బలరామన్న జనసేన కండువా వేస్తూ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించి, జనసేన పార్టీ ఘన విజయం కోసం సమిష్టిగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో జనసేన రథసారథి బలరామన్న దెబ్బ మీద దెబ్బకు పిచ్చుకలా అల్లాడుతున్న వైఎస్ఆర్సిపి పార్టీ ఎన్నికలకు ముందే చేతులెత్తేసే అవకాశం ఉండడంతో రాజానగరం నియోజకవర్గంలో జనశ్రేణులు ఎదురుచూస్తున్న పవనోత్సవానికి అంకురార్పణ మొదలైనట్టయిందని పార్టీ లో చేరిన వారున్నారు.

## జనసేన, తెలుగుదేశం పార్టీల కలయిక రాష్ట్ర భవిష్యత్తు కోసమే

### - జనసేన పార్టీ పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్

**రావులపాలెం (కొత్తపేట) అక్టోబర్ 18 (ప్రభాతవార్త) :**



రాష్ట్రంలో నేడు నెలకొని ఉన్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో పవన్ కళ్యాణ్ వర్తమాన రాజకీయ ఆలోచనలు, చంద్రబాబు సుదీర్ఘ అనుభవం రాష్టానికి ఎంతో అవసరం అని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ (పీఏసీ) నాదెండ్ల మనోహర్ అన్నారు. బుధవారం ఆయన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంలో పర్యటించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పార్టీ ఇన్చార్జి బండారు శ్రీనివాస్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. రావులపాలెం నుంచి భారీ ర్యాలీగా కొత్తపేట చేరుకున్న ఆయన నియోజకవర్గంలో ఇటీవల ప్రమాదవశాత్తు మరణించిన, గాయపడిన క్రియాశీలక సభ్యుల కుటుంబాలకు బీమా చెక్కులను అందజేసారు. కొత్తపేట మండలం కండ్రిగ గ్రామ పరిధిలోని అల్లపల్లి వారి పాలెం బండారు వెంకటరాజు, వానపల్లికి చెందిన నాగిరెడ్డి సత్తిబాబుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున బీమా చెక్కులను అందజేసారు. అలాగే పలివెల గ్రామానికి చెందిన గండ్రోతు మనోహర్ రూ.50 వేలు, వానపల్లికి చెందిన గనిశెట్టి శ్రీనివాసరావుకు రూ.29 వేలు, రావులపాలెం మండలం ఊబలంకకు చెందిన మద్దింశెట్టి అయ్యప్పకు రూ.50 వేలు, ఆలమూరు మండలం బడుగు వాని లంకకు చెందిన దూలం దేవతా నాగేంద్రకు రూ.31 వేలు, ఆత్రేయపురం మండలం వాడపల్లికి చెందిన ఏపుగంటి సత్యనారాయణ (సతీష్) కు రూ.47 వేలు బీమా చెక్కులను అందజేసారు. అనంతరం వాడపాలెంలో బండారు శ్రీనివాస్ స్వగృహం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు కోసమే జనసేన, తెలుగుదేశం పార్టీలు కలిసాయని, పవన్ కళ్యాణ్, చంద్రబాబుల నాయకత్వంలో ఉమ్మడి ప్రణాళిక సిద్ధం చేసుకుని వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విముక్త ఆంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. జనసేన, టీడీపీల కలయిక, పొత్తు ద్వారా రాష్టం మరింత అభివృద్ధి చెందుతుందని చెప్పారు. త్వరలోనే ఉమ్మడి ప్రణాళిక ద్వారా ప్రజల ముందుకు వెళ్తామని ప్రకటించారు. ఈ ప్రభుత్వం చేస్తున్న బటన్ నొక్కే సంక్షేమం కాకుండా దీనికి భిన్నంగా పేద ప్రజలకు నిజమైన సంక్షేమం అందేలా భవిష్యత్తు ప్రణాళిక ఉంటుందన్నారు.రాష్ట్రంలోని ఏ రాజకీయ పార్టీ చేయని విధంగా పవన్ కళ్యాణ్ సారధ్యంలోని జనసేన పార్టీ ప్రమాదవశాత్తు మరణించిన, గాయపడిన కార్యకర్తల కుటుంబాలను ఆదుకునే విధంగా ఆర్థిక భరోసాగా ఉంటుందన్నారు. క్రియాశీలక సభ్యత్వాల నమోదులో కొత్తపేట నియోజకవర్గం బండారు శ్రీనివాస్ నాయకత్వంలో రాష్ట్రంలోనే మూడో స్థానంలో ఉందన్నారు. ప్రమాదవశాత్తు మరణించిన క్రియాశీలక కార్యకర్తల కుటుంబాలకు రూ.లక్షల చొప్పున బీమా అందజేస్తున్నామని, ఆ విధంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 11 కుటుంబాలకు రూ.55 లక్షల విలువైన చెక్కులను అందజేసామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్, పులిదిండి భగవాన్ రాజు, గుత్తుల నాగేశ్వరరావు, తులా రాజు, తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలు సమూలంగా నిర్మూలించడానికి కంకణ బద్ధులు కావాలి:

## కలెక్టర్ డా. కృతికా శుక్లా.

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త**



జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలనకు సమాజంలోని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని జిల్లా జిల్లా కలెక్టర్ డా. కృతికా శుక్లా కోరారు.

బుధవారం జిల్లా కలెక్టరేట్ లోని గౌతమి సమావేశ మందిరంలో బాల్య వివాహ నిషేధిత చట్టం 2006 పై అవగాహన, ప్రభుత్వం జి ఒ నెం .31, 39, లలో సూచించిన అంశాల అమలుపై జిల్లా మహిళా శిశు అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించడం జరిగింది. బాల్య వివాహాల నిరోధంపై అవగాహన కలిగించేలా ప్రతి ఒక్కరూ పనిచేయాలని కలెక్టర్ అన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాలను సమూలంగా నిర్మూలించడానికి ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు. బాల్య వివాహాలు నిరోధించడానికి మనమంతా కృషి చేయాలన్నారు. బాల్య వివాహాల వలన బాలిక, ఆమె పిల్లల జీవితం, భవిష్యత్తుపై తీవ్రమైన పరిమాణాలను కలిగిస్తుందన్నారు. బాల్య వివాహాలు నివారించేందుకు గ్రామస్థాయి నుండి కలిసికట్టుగా పని చేయాలన్నారు. బాల్య వివాహం చేయడానికి సన్నద్ధం అవుతున్నారని తెలిస్తే ముందుగా వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని, బాల్య వివాహం వలన పిల్లలపై ఎటువంటి దుష్పరిణామాలు ఏర్పడతాయో విశదీకరించాలన్నారు. అలాగే బాల్య వివాహం చట్టరీత్యా నేరమని, ఇందుకు రెండు సంవత్సరాల జైలు శిక్ష, ఒక లక్ష రూపాయలు జరిమానా విధించబడుతుందని తెలియ చెప్పాలన్నారు. బాల్య వివాహంపై సమాచారాన్ని 112 లేదా చైల్డ్ లైన్ 1098 నెంబరుకు తెలియజేయాలన్నారు. ఎక్కడా ఒక్క బాల్య వివాహం కేసు కూడా నమోదు అవ్వకూడదన్నదే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమన్నారు. అనుమానం ఉన్న చోట ముందుగానే అప్రమత్తం చేసి బాల్య వివాహాలు జరగకుండా మన వంతు భాధ్యతగా కృషి చేద్దామన్నారు. జిల్లాలో హాట్ స్పాట్ లనుగుర్తించి అక్కడ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు .ప్రతి నెల విధిగా గ్రామస్థాయిలో సమావేశాలు నిర్వహించి నివేదికలు సమర్పించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.కాకినాడ జిల్లా ఎస్పీ ఎస్ . సతీష్ కుమార్ మాట్లాడుతూ బాల్య వివాహాలు జరగకముందు ,జరిగిన తర్వాత కూడా కేసులు పెట్టవచ్చునని అటువంటి వారిని గుర్తించినట్లయితే 1098కు ఫోన్ చేసి తెలియజేయాలని సమాచారాన్ని గోప్యంగా ఉంచడం జరుగుతుందని ఆయన తెలిపారు .గ్రామ, మండల ,డివిజన్ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ఈ సమాచారాన్ని సక్రమంగా పంపించినట్లయితే జిల్లాలో బాల్యవివాహాలు జరగకుండా కట్టు దిట్టమైన చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుందని ఆయన అన్నారు. అనంతరం

బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించే పోస్టర్ ను జిల్లా కలెక్టర్, ఎస్పీ ఇతర అధికారులతో కలిసి ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ పిడి కె.ప్రవీణ , డిసిపిఓ సీహెచ్.వెంకటరావు, ఆర్డిఓ ఎన్.వి. వి సత్యనారాయణ, జిల్లా పంచాయితీ అధికారి అర్.విక్టర్, డి ఇ ఒ నాగమణి , సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ రమణమూర్తి , ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఏ.విజయ శాంతి, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి వనిత

చాగల్లు,అక్టోబర్18,ప్రభాత వార్త

దేశంలో ఎక్కడా లేనివిధంగా వైద్య రంగంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అని రాష్ట్ర హోం మరియు విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వనిత తెలిపారు. బుధవారం చాగల్లు మండలం చాగల్లు సచివాలయం-4 పరిధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని హోంమంత్రి ప్రారంభించారు. క్యాంపులో అందిస్తున్న వైద్య సేవల తీరును మంత్రి పరిశీలించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి వనిత మాట్లాడుతూ... జగనన్న ఆరోగ్య సురక్షా కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రతి సచివాలయంలో హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. ఉచితంగా వైద్య పరీక్షలు చేయడం, మందులు ఇవ్వడంతో పాటు అవసరమైతే పెద్ద పెద్ద ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారని తెలిపారు. ఈ విధంగా రాష్ట్ర చరిత్రలో ప్రభుత్వ వైద్యులు ఇంటి వద్దకు వచ్చి పేద ప్రజల ఆరోగ్యక్షేమాలు తెలుసుకుని సేవలు అందించిన ప్రభుత్వం ఏదైనా ఉందా..? అని ప్రశ్నించారు. దేశంలోనే మొదటిసారిగా స్పెషలిస్టులను ఇంటివద్దకు తెచ్చిన ఘనత సీఎం జగన్ కే దక్కుతుందన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో ప్రతి ఇంటికి కూడా వాలంటీర్స్ వెళ్లి వారి వారసత్వం, జన్యుపరంగా వచ్చే దీర్ఘకాలిక వ్యాధులపైన వైద్యం అందించడంతో పాటు ఖరీదైన మందులు కూడా ఉచితంగా అందజేస్తున్నామన్నారు. ఉదాహరణకు టీబీ తో బాధపడుతున్న వ్యక్తులకు ముందుగా కొర్సు మందులు ఇస్తారని, అప్పటికీ తగ్గకపోతే ప్రత్యేక మందుల కోర్సు రాస్తారని.. ఆ మందులు విలువ 188 మాత్రలు రూ. 2 లక్షల పైనే ఉంటుందని వివరించారు. ఆ మందులను కూడా కేవలం ప్రభుత్వం మాత్రమే అందిస్తోందన్నారు. ఇలా ప్రతి పేదవాడి ఆరోగ్య బాధ్యత ప్రభుత్వమే తీసుకుని వారిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దుతున్నారని తెలిపారు. అంతేకాకుండా ఇప్పటికే దేశంలో ఎక్కడా లేని విధంగా ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ప్రజల ముంగిటకే వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, మన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ ను ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దుతున్నారని హోంమంత్రి తానేటి వనిత తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులతో పాటు చిన్నపిల్లలకు గుండె ఆపరేషన్ వైద్య నిపుణులు, ఇతర వ్యాధులకు సంబంధించిన స్పెషలిస్ట్ డాక్టర్లు, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



# లలితాదేవిగా దర్శనమిచ్చిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి..

అంబాజీపేట, అక్టోబర్ 28, ప్రభాతవార్త..

దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా స్థానిక బస్ స్టేషన్ సమీపంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు శ్రీ లలితా దేవిగా భక్తులకు బుధవారం దర్శనమిచ్చారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న కనకదుర్గమ్మ ఆలయాల వద్ద మహిళలు ఘనంగాకుంకుమ పూజలు నిర్వహించారు. స్థానిక పెద్దవీధిలో శ్రీ మీనా శ్యామలాంబ సమేతచంద్రశేఖర స్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన ఆదిశేషవాహనంపై అమ్మవారిని కొలువు దీర్చి మహిళా భక్తులు గ్రామోత్సవం నిర్వహించారు. మాచవరం పక్కుల రావిచెట్టు వద్ద శ్రీరాంనగర్,అంబాజీపేట పశువుల మార్కెట్ వద్ద ఉన్న విజయకనకదుర్గ అమ్మవారికి ఆలయ ప్రాంగణంలోను కుంకుమ పూజలు నిర్వహించారు.





## ఉత్తమ న్యాయవాది అవార్డు మనోజ్ కైవసం

అమలాపురం టౌన్, అక్టోబర్ 18 ప్రభాతవార్త.

ఎస్ వి కె ఎమ్ ప్రవీణ్ గాంధీ కాలేజ్ ఆఫ్ లా ముంబై వారు అక్టోబర్ 12 నుండి 15 వ తేదీ వరకు ముంబై లో నిర్వహించిన నేషనల్ ట్రైల్ అడ్వకేసీ మరియు జడ్జ్ మెంట్ రైటింగ్ కాంపిటీషన్ 2023 నందు దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వ విద్యాలయం సబ్బవరం నందు న్యాయవిద్యను అభ్యసిస్తున్న మాకిరెడ్డి మనోజ్, లాస్యచరిత, నిఖిల్ టీం పాల్గొన్నారు. ఈ కాంపిటీషన్ నందు వివిధ రాష్ట్రాల నుండి 40 టీములు పాల్గొనగా మాకిరెడ్డి మనోజ్ అండ్ టీం సెమీఫైనల్ వరకు చేరుకున్నారు. మాకిరెడ్డి మనోజ్ కు ఉత్తమ న్యాయవాది అవార్డు దక్కింది. రిటైర్డ్ ముంబై హైకోర్టు జడ్జ్ ఉమేష్ దత్తాత్రేయ సాల్వి చేతుల మీదుగా మెమొంటో ప్రశంశా పత్రం ,7000రూపాయిల చెక్ అందజేశారు. ఈ సందర్భంగా మనోజ్ తల్లిదండ్రులు ప్రముఖ అడ్వకేట్ మాకిరెడ్డి ఆదినారాయణ, ఎ వి ఎస్ పూర్ణిమ లకు అమలాపురంలో అడ్వకేట్ విభాగంలో పలువురు అభినందనలు తెలిపారు.




## జగనన్న ఆరోగ్య సురక్షతో ఉచిత వైద్య సేవలు...

అమలాపురం రూరల్, అక్టోబర్ 18, (ప్రభాతవాం

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా ఉచిత వైద్య సేవలు పొందవచ్చునని జడ్పీటీసీ పందిరి శ్రీహరి రామ్ గోపాల్ పేర్కొన్నారు. అమలాపురం రూరల్ మండలం ఈదరపల్లి గ్రామ పంచాయితీ వద్ద బుధవారం ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని జడ్పీటీసీ శ్రీహరిరామ్ గోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతీ ఒక్కరికి సంపూర్ణ వైద్య సేవలు అందించాలన్న దృఢ సంకల్పంతో సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు శ్రీకారం చుట్టారని వివరించారు. ఇప్పటికే ఈ శిబిరాలను ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకుంటున్నారని, కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందిస్తున్నందునే ప్రజలు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు తరలివస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాయుడు వరలక్ష్మి, వైస్ ఎంపీపీ అడపా వెంకట సుబ్రహ్మణ్యం, పిఏసీఎస్ అధ్యక్షులు అడపా బాబులు, ఉప సర్పంచ్ వీరబాబు, ఎంపీడీవో జె వెంకటేశ్వరరావు, కార్యదర్శి కోడూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# ఆరోగ్య ఆంధ్రప్రదేశే ప్రభుత్వ లక్ష్యం.. ఎంపీపీ దొమ్మేటి..

అంబాజీపేట, అక్టోబర్ 18, ప్రభాతవార్త..

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యమని, ఆరోగ్య భద్రత అంశాన్ని పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకుందని ఎంపీపీదొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోనివక్కలంక గ్రామంలో ఇన్చార్జి తహసీల్దార్ పి. నాగమల్లక్ష్మి పర్యవేక్షణలో సర్పంచ్ వాసంశెట్టిదేవత అధ్యక్షత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎంపీపీ వెంకటేశ్వరరావు బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో 2236 మంది జనాభాలో 472మందికి టోకెన్లు అందించామన్నారు. ఈ వైద్య శిబిరంలో 230 మంది రోగులకువైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె. సత్యనారాయణ,ఈఓపిఆర్డి బి. మమత, పంచాయతీ కార్యదర్శి వి. తాతాజీ,ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ముత్యాబత్తుల ప్రశాంత్,ఎంపీటీసీలు పిల్లిసత్యవేణి, కుసుమ వెంకటేష్, సొసైటీ అధ్యక్షులు దొమ్మేటి సత్యమోహన్, వాసంశెట్టి రాంబాబు, గ్రామ శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి పెదబాబు, నాయకులుజున్నుపల్లి ఏడుకొండలు, పిల్లి రమేష్, కొర్లపాటి కోటబాబు, ఉండుర్తి నాగబాబు, వాసంశెట్టి వెంకటలక్ష్మి, శ్రీకాకుళపు సత్తిబాబు, వాసంశెట్టి భాస్కరరావు, పితాని సూరిబాబు, నేదునూరి వెంకటేశ్వరరావు, మంద్రా నాగమణి, కొప్పిశెట్టి గోవిందరాజు, వైద్య సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారుతదితరులు పాల్గొన్నారు.



# ఒమ్మంగిలో ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే పర్వత

ప్రత్తిపాడు అక్టోబర్ 18 ప్రభాత వార్త:

రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్య సేవలు అందించడం కోసమే ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఎమ్మెల్యే పర్వత శ్రీ పూర్ణచంద్ర ప్రసాద్ తెలిపారు.కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల ఒమ్మంగి విలేజ్ హెల్త్ క్లినిక్1లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పర్వత శ్రీ పూర్ణ చంద్ర ప్రసాద్ చేతులమీదుగా ప్రారంభించారు.సుమారు 458 మంది పేషెంట్స్ ని వివిధ వైద్య విభాగాల డాక్టర్లు పరీక్షించి అవసరమైన రక్త పరీక్షలు చేయడంతో పాటు అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్ ఎమ్మెల్యే పర్వత పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రసూతి వైద్య నిపుణులు-డా.జ్యోతిర్మయి,ఎముకల వైద్యనిపుణులు-డా.సత్య సాగర్,పీహెచ్సీ డాక్టర్లు ఆర్. ఆర్.పవన్ కుమార్,శివ కుమార్ పాల్గొని వైద్యసేవలు అందించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీపీ గొర్ల కాంతి సుధాకర్,వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను,మండల కన్వీనర్ పంచాది వీరబాబు,జెసిఎస్ ఇంచార్జి రామిశెట్టి చినబాబు,వైస్సార్సీపీ నాయకులు రామిశెట్టి నాని,మామిడి నరసింహమూర్తి,సేరు కృష్ణకొప్పన గంగారావు,పినిశెట్టి ప్రకాష్,ఎస్సై పవన్ కుమార్, వైద్య సిబ్బంది,సచివాలయం సిబ్బంది, హెచ్.వి సీత,ఆశా వర్కర్లు,గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.



## ఇళ్ల స్థలాలను పరిశీలించిన మైన్స్ అధికారులు

గోపాలపురం అక్టోబర్ 18, (ప్రభాతవార్త):

గోపాలపురంలో వడ్లవాని చెరువు వద్ద ఇచ్చిన జగనన్న ఇళ్ల స్థలాలను గనులు, భూగర్భ శాఖ సాంకేతిక నిపుణులు విగ్నేష్ ఆధ్వర్యంలో బృందం బుధవారం పరిశీలించింది. 2020లో ప్రభుత్వం 5 ఎకరాల 50 సెంట్ల భూమిని కొనుగోలు చేసి 189 మందికి పట్టాలు పంపిణీ చేసింది. అప్పటినుంచి ఆ స్థలాల్లో ఏ ఒక్కరు కూడా గృహ నిర్మాణాలు చేపట్టలేదు. అయితే ఇటీవల గోపాలపురంలో 'జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి విచ్చేసిన జిల్లా కలెక్టర్ మాధవిలతకు, ఎమ్మెల్యే తలారి వెంకట్రావుకు కొంతమంది లబ్ధిదారులు ఆ స్థలాలు ఇళ్ల నిర్మాణానికి అనుకూలంగా లేవని, అంత రాతి ప్రదేశమేనని ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వెంకట్రావు.. ఆ స్థలాలోకి వెళ్లి పరిశీలించి, గోతులు త్రవ్వి పరిశీలించాలని తహసీల్దార్ కు సూచించారు. ఇదిలా ఉండగా కలెక్టర్ ఆదేశాల మేరకు గనులు భూగర్భ శాఖ అధికారులు ఆ ప్రదేశాన్ని పరిశీలించి జేసీబీతో గోతులు త్రవ్వించి మట్టి నమూనాలను సేకరించారు. అదే సమయంలో వైకాపా నాయకులు కూడా ఆ రాతి ప్రదేశం ఇళ్ళ నిర్మాణాలకు వీలు పడదని తెలియజేసారు. అయితే ఈ స్థలాల భూమి స్థితిపై అభిప్రాయాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని సాంకేతిక నిపుణులు విగ్నేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మైన్స్ అధికారులతో పాటు రెవెన్యూ అధికారులు డీటీ కృష్ణ, హౌసింగ్ ఏఈ శ్రీనివాసరావు, వైసీపీ నాయకులు కూసం రామ్మోహన్ రెడ్డి, ఏస్కే వలి, దాసరి కుటుంబరావు, వింజమూరి సుబ్బారావు, ముల్లంగి శ్యాం, కప్పల వరలక్ష్మి, గెల్లా శ్రీను తదితరులు ఉన్నారు.



## షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం పది లక్షల ఆస్తి నష్టం

యానం అక్టోబర్ 18 ప్రభాతవార్త

యానం నియోజకవర్గం యానాం లోని కాకి వారి వీధిలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంగళవారం అర్ధరాత్రి సుమారు ఒంటిగంట సమయంలో అగ్ని ప్రమాదం సంభవించి కాకి నాగేశ్వరరావుకు చెందిన ఇల్లు దగ్ధమైంది.ఈ ప్రమాదంలో బట్టలు సామాగ్రితో పాటు విలువైన సామాన్లు బుగ్గిపాలయ్యాయి.వెంటనే చుట్టుపక్కల వాళ్ళు అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వగా వెంటనే స్పందించినప్పటికీ ఇల్లు పూర్తిగా కాలిపోయింది. అర్ధరాత్రి కాకి నాగేశ్వరరావు ఆయన భార్య నిద్రిస్తూ ఉండగా మంటలు చెలరేగాయి.చుట్టుపక్కల వాళ్ళు చూసి కేకలు వేయడంతో లేచి చూడగా బయటికి రావడానికి దారి లేకుండా మంటలు వ్యాప్తి చెందడంతో పక్కింటి వారి ఇంటి గోడ దూకి తప్పించుకున్నారు.పెను ప్రమాదం తప్పిందని అందరూ ఊపిరి పీల్చుకున్నారు.సుమారు పది లక్షల రూపాయలు ఆస్తి నష్టం ఉంటుందని అంచనా వేశారు. యానంలోనే అన్ని సంఘాల పెద్దలు, యానాం బిజెపి ప్రెసిడెంట్ కనకాల రాజు,మాగాపు సుబ్బారావు నాగేశ్వరరావుని పరామర్శించి అగ్ని ప్రమాదం ఎలా జరిగిందని అడిగి తెలుసుకున్నారు.



## నల్లావీదిలో 108 కలశాలతో గిరి ప్రదక్షిణ

అమలాపురం టౌన్, అక్టోబర్ 18 ప్రభాతవార్త.

అమలాపురం పట్టణం నల్లావీధి రామాలయం వద్ద శ్రీ విజయదుర్గ అమ్మవారికి మంగళవారం 108 కలశాలతో గిరి ప్రదక్షిణ మూడు సార్లు చేసి అమ్మవారికి గంగాస్నానం చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భవానీలు, స్వాములు, బాలికలు, భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.ఈ నెల 19 తేది గురువారం సాయంకాలం 6 గంటల నుండి అమ్మవారి గండ దీపాల ప్రదక్షిణ చేయబడును.ఈ ఉత్సవ కార్యక్రమంలో భవానీలు, స్వాములు, బాలికలు, మహిళలుభక్తులు పాల్గొనవలసిందిగా విజయ దుర్గ ఉత్సవ కమిటీ నల్లావీధి వారు కోరుతున్నారు.



## బాబు అక్రమ అరెస్ట్ కు నిరసనగా ప్రచారం

అమలాపురం టౌన్, అక్టోబర్ 18 ప్రభాతవార్త.

జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా బుధవారం క్లస్టర్ ఇంఛార్జి పెచ్చెట్టి విజయ లక్ష్మి పరిధిలో యూనిట్ ఇంచార్జ్ కర్రి రామస్వామి ఆధ్వర్యంలో ఇంటింటికి బాబుతో నేను కార్యక్రమం13వ. వార్డ్ లో 45 మరియు 46వ. బూత్ లలో పాల్గొని కరపత్రాలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు తిక్కిరెడ్డి నేతాజీ సుభాష్ చంద్రబోస్, వార్డ్ ఇంచార్జ్ యమ్.డి. బషీర్, భాస్కర్ రామకృష్ణ, శెట్టిబత్తుల దిన్నబాబు, గంధం శ్రీను, గుబ్బల నాగ బాబు, రాయుడుపెద్ది సూరిబాబు, మట్టపర్తి సాయిబాబా, జయంతి సురేశ్, వలవల శివరావు, మట్టపర్తి లక్ష్మీ భాస్కర్, పెద్దిరెడ్డి నాయుడు, బత్తుల ప్రసాద్, పట్నాల రమణ, తంగెళ్ళ మాణిక్యాల రావు, తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థికి రూ.40 వేల యుటిఎఫ్ సహాయం అందజేత.

రాజవొమ్మంగి,అక్టోబర్ 18,ప్రభాతవార్త.

అల్లూరి జిల్లా రంపచోడవరం డివిజన్ రాజ వొమ్మంగి మండలం చికిలింత గ్రామానికి చెంది, అదే గ్రామ మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువు తున్న జ్యోతి రిషవర్ధన్ ప్రమాద వశాత్తు గాయపడి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యసేవలు పొంది ఇంటికి వచ్చిన విషయం తెలిసిందే. బుధవారం చికిలింత గ్రామంలో రిష వర్ధన్ ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని యుటిఎఫ్ నేతలు అడిగి తెలుసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఫెడరేషన్ ఉపాధ్యాయ మిత్రులు కొన్ని పాఠశాల విద్యార్థుల నుండి విద్యార్థి వైద్య సహాయం కోసం సేకరించిన రూ.40,650.లను యుటిఎఫ్ మండల కమిటీ, స్థానిక సర్పంచ్ కొండ్ల సూరిబాబు వారి ఆధ్వర్యంలో కొంత నగదును ఫిక్స్ డిపాజిట్, కొంత నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొండ్ల సూరిబాబు, యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ మఠం ఉదయ్ , జిల్లా కార్యదర్శి సార్లం రాంబాబు, గౌరవ అధ్యక్షులు సత్యవతి, యుటిఎఫ్ మండల అధ్యక్షులు దాసరి పైడిమల్లి, ప్రధానకార్యదర్శి పొట్లబోయిన రమణ, అసోసియేషన్ అధ్యక్షుడు పరిశిక సుబ్బారావు, అసోసియేషన్ మహిళా అధ్యక్షులు తాడే లక్ష్మీ ప్రసన్న, కోశాధికారి శ్రీను, జిల్లా కౌన్సిలర్ మిరియాల రమేష్ బాబు, చికిలింత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మఠం శేఖర్ బాబు, ఉపాధ్యాయులు రామకృష్ణ చిట్టిబాబు, బుజ్జిబాబు, రాజ్ కుమార్, ఆపూరి సతీష్ పాల్గొన్నారు.




# ఆదిత్య లో ఇన్నోవేషన్ డే

గండేపల్లి అక్టోబర్ 18 (ప్రభాతవార్త):

గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల లో ఇన్నోవేషన్ డే ను ఐ ఐ సి %ఐ ఇ డి సి విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల పూర్వ విద్యార్థులు ఇట్స్ మై ఫాయిస్ (సెవెంకర్ ప్రైవేట్ లిమిటెడ్) ఫౌండర్ %ఐ డైరెక్టర్ కె.లోకతేజ,కె.రమ్య,ఎం.దిలీప్ కుమార్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో లోకతేజ,దిలీప్ లు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆధా విభాగాల్లో జరుగుతున్న నూతన ఆవిష్కరణల గురించి ఎప్పటికప్పుడు తెలుసుకోని సరైన రీతిలో అవగాహన కలిగి ఉండాలని తెలియజేశారు. ఇన్నోవేషన్ స్టార్ట్ అప్ ల గురించి అవగాహన కల్పించారు. వారి స్వీయ అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐ ఐ సి ఐ డి సి కన్వీనర్ డా. పి.ఎస్. రంజిత్ కో.ఆర్డినేటర్ సి.హెచ్.గోవింద్, డా. ఎస్.విశాలాక్ష్మి,ప్రో.వేమూరి సునీత, ప్రో. కె.శ్రీనివాస్ విద్యార్థులు పాల్గొన్నారు.



## నాసా ఇంటర్నేషనల్ స్పేస్ ఆప్ హ్యాకథాన్ పోటీలలో ఆదిత్య విద్యార్థుల అద్భుత ప్రతిభ

గండేపల్లి అక్టోబర్ 18 (ప్రభాతవార్త):

గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ కళాశాల విద్యార్థులు ఇటీవల చండీగఢ్ యూనివర్సిటీ నందు నిర్వహించిన నాసా ఇంటర్నేషనల్ స్పేస్ ఆప్ హ్యాకథాన్ పోటీల అద్భుత ప్రతిభ కనబరచి అమెరికా లో నిర్వహించు తదుపరి పోటీలకు ఎంపిక అయ్యారు అని ప్రిన్సిపాల్ డా. డోలా సంజయ్ కుమార్ తెలిపారు. ఈ ఛాలెంజ్ పోటీల్లో ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ %ఐ టెక్నాలజీ బిటెక్ ఐ.టి. , విద్యార్థులు కె.సురేఖారాణి,ఎన్.పూజ శ్రీ, పి. నిఖిల, కె.శ్రావ్య ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ డాక్టర్ డోల సంజయ్ కుమార్ పేర్కొన్నారు. ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల కు చెందిన కంప్యూటర్ సైన్స్ విభాగం విద్యార్థి పైలా నిఖిల నాసా పోటీల్లో ప్రతిభ కనబరిచి ఫైనల్ పోటీలకు ఎంపిక అయినట్లు డా. ఎం.శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఫైనల్ పోటీలో అమెరికా లేదా కెనడా లో జరగనున్నాయని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్ సతీష్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం శ్రీనివాసరెడ్డి, డోలా సంజయ్ కుమార్ డీన్ డా. ఎస్.రమ్యశ్రీ, విభాగాధిపతులు ఆర్.వి.వి.ఎస్.భీమారావు,డా. వాసవి, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.



## సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి.. ఎంపీడీవో సత్యనారాయణ..

అంబాజీపేట,అక్టోబర్ 18, ప్రభాతవార్త..

సైబర్ నేరగాళ్ళ పట్ల అప్రమత్తంగా ఉండాలని,ఇటీవల కాలంలో సైబర్ నేరగాళ్ళు ఫోన్లు చేసి బ్యాంక్ వివరాలు తెలుసుకుని మోసంచేస్తున్నారని ఎంపీడీఓ కె. సత్యనారాయణబుధవారం ప్రకటనలో తెలిపారు. సైబర్ నేరగాళ్ళు ఫోన్లు చేసి ప్రభుత్వ పథకాలబ్యాంకు ఖాతాల్లో మీకు జమ అయినది లేనిది చెప్తామని చెప్పి నమ్మించి మోసంచేస్తున్నారన్నారు. అలాంటి ఫోన్ కాల్ వచ్చిన సమయంలో ఆధార్ కార్డు, పాన్ కార్డునెంబర్లు, బ్యాంక్ అకౌంట్ నెంబర్లు చెప్పకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. అపరిచిత వ్యక్తులకు సమాచారం ఇస్తే మీ బ్యాంకు ఖాతాలలోనిసగదును అపహరించుకుపోతారన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ పథకాలకు సంబంధించి ఎవ్వరి వద్ద నుండి ఏ విధమైన ఫోన్లు రావని ఎంపీడీఓ సత్యనారాయణ సూచించారు.

IN THE COURT OF THE I ADDL. SENIOR CIVIL JUDGE :: KAKINADA
I.P. No. 36/2023
Between :
Totala Kodanda Ramachandra Reddy ...Petitioner
and
1) Sathi Gayatri
2) Kovvuri Srinivasa Reddy ...Respondents
Respondents :
1) Sathi Gayatri, W/o. Ananda Bhaskara Reddy Age 41 Years, House Wife, R/o. D.No. 8-378, Gollala Mamidada, Pedapudi Mandal, Kakinada District, Kakinada Junior Civil Judge Jurisdiction.
2) Kovvuri Srinivasa Reddy, S/o. Krishna Reddy, Age 47 Years, Business, R/o. D.No. 1-56, Gollala Mamidada, Pedapudi Mandal, Kakinada District, Kakinada Junior Civil Judge Jurisdiction.
[illegible]
తేది. 10-11-2023 నం. [illegible]
[illegible]
N. RAMADASS, B.Com. B.L.
ADVOCATE
D.No. 10-4-27, Seshagiri Rao Street
Ramaraopeta, Kakinada. Cell: 9848012195

# వైభవంగా భవాని పడిపూజ

**గండేపల్లి అక్టోబర్ 18 (ప్రభాతవార్త):**

మండల కేంద్రమైనగండేపల్లి లో కృషుని ఆలయం వద్ద భవాని మాల ధారణ ధరించిన భవానీలు ఘనంగా పడి పూజ నిర్వహించారు శ్రీ కనకదుర్గ అమ్మవారి పడిపూజ అత్యంత వైభవంగా ప్రత్యేకంగా నిర్మించిన వేదికపై పువ్వులతో సుందరంగా అమ్మ వారి ప్రతిమను అలంకరించారు. వివిధ రకాలు పూలు, విద్యుత్ దీప తోరణలతో సుందరంగా తీర్చిదిద్దారు. శ్రీ కనకదుర్గ అమ్మవారిని ప్రతిష్టించి పడిపూజ నిర్వహించారు . గ్రామంలో సుమారు 300 మంది భవాని మాలధారణతో ఈ పూజలో పాల్గొన్నారు పూజ అనంతరం దుర్గమ్మ అమ్మవారిని ను కీర్తిస్తూ పాడిన పాటలు, శరణుఘోషతో జై దుర్గ జై మాత పడిపూజలో పాల్గొన్న భవాని లు గ్రామం మార్మోగింది. భక్తులు, గ్రామస్తులు హాజరై పడిపూజను తిలకించారు.



# నవగ్రహ శాంతి హోమం

## -రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు అడపా భరత్ బాబు

## -హాజరైన రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ

**జగ్గంపేట/గండేపల్లి అక్టోబర్ 18 (ప్రభాతవార్త):**

చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్ నుండి ఆరోగ్యంగా బయటికి రావాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ ఆదేశాలతో కాకినాడ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ దంపతులచే జగ్గంపేటలో రిలే నిరాహార దీక్ష శిబిరం వద్ద తొమ్మిది రోజులపాటు నవగ్రహ శాంతి హోమం నిర్వహిస్తున్నారు. ఏడవ రోజు పీటలపై కూర్చుని గోకవరం మండలం కామరాజుపేట గ్రామానికి చెందిన తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు అడపా భరత్ బాబు కామరాజు పేట ఎంపీటీసీ సభ్యురాలు అడపా సుహాసిని దంపతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జ్యోతుల నెహ్రూ పూజా కార్యక్రమంలో పాల్గొని భరత్ బాబు దంపతులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ నవీన్ దంపతులు ప్రారంభించినటువంటి ఈ హోమం ఆరు రోజులు పూర్తి చేసుకొని ఏడవ రోజు చేరుకుందని .. ప్రతిరోజు ఇద్దరు దంపతులతో ఈ హోమం నిర్వహిస్తున్నారని ఈ హోమ పూజ ఫలం తో చంద్రబాబు నాయుడుకి దక్కి ఆరోగ్యంగా అక్రమ కేసుల నుండి క్షేమంగా బయటకు రావాలని కోరుకుంటున్నామని అన్నారు. రాష్ట్రం నలుమూలల నుండి నారా భువనేశ్వరి కి సంఘీభావం తెలుపుతున్న ప్రజలపై ఆంక్షలు విధించడం చాలా సిగ్గుచేటని నెహ్రూ అన్నారు. చంద్రబాబుకి ములాకత్ లు తగ్గించడంలో ప్రభుత్వం అభాసపాలవుతుందని నెహ్రూ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ వి ఎస్ అప్పలరాజు, జగ్గంపేట మండలం కన్వీనర్ మారిశెట్టి భద్రం, గోకవరం కన్వీనర్ మంగ రౌతు రామకృష్ణ, క్లస్టర్ ఇంచార్జ్ కన్నబాబు, పాండ్రంగి రాంబాబు, జీను మణిబాబు తదితరులు పాల్గొన్నారు.



# బాబు కోసం మోకాళ్ళపై మెట్లెక్కిన మహిళలు

**గోపాలపురం అక్టోబర్ 18, (ప్రభాతవార్త):**

రాజమండ్రి కేంద్ర కారాగారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు ఆరోగ్యం మెరుగు పడాలని, జైలు నుంచి బయటకు రావాలని కోరుతూ.. గోపాలపురానికి చెందిన కొందరు మహిళా కార్యకర్తలు గోపాలపురం టూ గౌరీపట్నం మేరీమాత పుణ్యక్షేత్రం వరకు పాదయాత్ర నిర్వహించారు. దేవరపల్లి మీదుగా గౌరీపట్నం 15 కిలో మీటర్లు పాదయాత్ర చేసి పుణ్యక్షేత్రంలోని క్రింది నుంచి కొండపై నున్న యేసుక్రీస్తు దివ్య స్వరూపం వరకు 100 మెట్లు మోకాళ్ళపై నడుస్తూ కొండపైకి ఎక్కారు. అక్కడ ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించి చంద్రబాబు ఆరోగ్యం మెరుగుపడాలని, త్వరలోనే జైల్ నుంచి బయటకు రావాలని ప్రార్ధించినట్లు ఆ మహిళలు చెప్పారు. అదేవిధంగా మేము సైతం బాబు కోసం అంటూ చిన్నారులు సైతం 100 మెట్లను ఎక్కడం అందర్నీ ఆశ్చర్యానికి గురి చేసింది.పి.రత్నకుమారి, తేజ, యామిని ప్రియా,రాపాక హర్ష,పసలపూడి శిరీష, మాధవిషేక్ సాత్విక్, ఇంటి మరియమ్మ, చినబుల్లి తదితరులు ఈ పాదయాత్ర చేసిన వారిలో ఉన్నారు. ఈ పాదయాత్రకు మండల టీడీపీ అధ్యక్షులు రొంగల సత్యనారాయణ, శ్రీధర్, ప్రసాద్ తదితరులు సంఘీభావం తెలియజేసారు.



## ప్రభుత్వ అధికారులపై దాడులు చేస్తే ఆదివాసీ వాల్మీకి సంఘం ఊరుకోదు : మండల అధ్యక్షులు వజ్రపు అప్పారావు.

**రాజవొమ్మంగి,అక్టోబర్ 18,ప్రభాతవార్త.**



అల్లూరి సీతారామరాజు జిల్లా, రంప చోడవరం డివిజన్, ఐటిడిఏ అధికారులు మొదలుకొని మండల రెవెన్యూ కార్యాలయాల్లో పనిచేస్తున్న అధికారుల వరకు కొంత మంది వారి స్వార్థ, రాజకీయ ప్రయోజనాల కోసం దాడులు చేయడం మంచి పద్దతి కాదని, అలా చేస్తే ఆదివాసీ వాల్మీకి సంఘం తరపున చూస్తూ ఊరుకోమని రాజవొమ్మంగి మండల ఆదివాసీ వాల్మీకి సంక్షేమ సంఘం అధ్యక్షులు వజ్రపు అప్పారావు, జిల్లా సహాయ కార్యదర్శి రాళ్లగడ్డ అర్జున్ బుధవారం పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. మన ప్రాంతంలో పనిచేస్తున్న అధికారులపై దాడులు చేయడం, దుర్భాషలాడటం ఆదివాసీ సంస్కృతి కాదని అన్నారు. ప్రశాంతంగా ఉన్న రంపచోడవరం నియోజకవర్గంలో తెగలు, కులాలు, వ్యక్తుల మధ్య గొడవలు రేపి, అల్లర్లు సృష్టిస్తే ఊరుకోమని హెచ్చరించారు.అధికారులపై పదే పదే దాడులు చేసే వ్యక్తులు, సంఘాలపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని, ఉన్నతాధికారులకు ఆదివాసీ వాల్మీకి సంఘం అండగా ఉంటుందని ప్రకటనలో పేర్కొన్నారు.

# సీబీఎస్ఈ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన శ్రీ ప్రకాష్ విద్యార్థులు

**పెద్దాపురం/గండేపల్లి అక్టోబర్ 18 (ప్రభాతవార్త):**

సీబీఎస్ఈ క్లస్టర్-7 కబడ్డీ పోటీలు ఈ నెల 14నుండి 16 వరకు , హైదరాబాద్ గండిపేట లోని పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ లో జరిగిన పోటీలలో ఆంధ్ర తెలంగాణ నుండి బాలుర విభాగంలో 54జట్లు, బాలికల విభాగంలో 24జట్లు పాల్గొన్నాయి. హోరాహోరీగా సాగిన ఈ పోటీల నందు శ్రీ ప్రకాష్ విద్యానికేతన్ బాలుర జట్టు ప్రధమ స్థానం సాధించింది, బాలుర విభాగంలో ఫైనల్ లో హీల్ స్కూల్,విజయవాడ జట్టు పై, శ్రీ ప్రకాష్ విద్యానికేతన్ జట్టు 28-47 పాయింట్ లతో విజయం సాధించి ప్రధమ స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు నవంబర్ 24 నుండి 27 వరకు హర్యానా రాష్ట్రం, కర్నాల్ లో ఎస్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్ నందు జరిగే సీబీఎస్ఈ జాతీయ స్థాయి కబడ్డీ పోటీల నందు పాల్గొననున్నారు. జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సిహెచ్ వి కే నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపల్ మూర్తి, అపర్ణ, నీలాదేవి, కోచ్ లక్ష్మణ్ తదితరులు అభినందించారు.




# సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన...

**అమలాపురం రూరల్, అక్టోబర్ 18, (ప్రభాతవార్త):**



అమలాపురం రూరల్ మండలం కామనగరువు గ్రామ పరిధి చిట్టమ్మ చెరువు వద్ద నూతనంగా నిర్మించనున్న సిమెంట్ రోడ్డు నిర్మాణానికి బుధవారం ఆ గ్రామ సర్పంచ్ నక్కా అరుణకుమారి చంద్రశేఖర్ శంకుస్థాపన చేశారు. నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ సిబ్బందికి ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మెండు గంగాభవానీ దుర్గాప్రసాద్, వార్డు సభ్యులు దుర్గా భవాని, నాగేశ్వరరావు, జేఏబీసీ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు

# జిల్లాకు కేటాయించిన బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వివి ప్యాట్ తనిఖీలు

## - కలెక్టర్ కె. మాధవీలత

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త**

జిల్లాకి కేటాయించిన ఎన్నికల యూనిట్స్ ను బెంగుళూర్ బెల్ సంస్థ కు చెందిన సీనియర్ సాంకేతిక ఇంజినీర్స్ ఆధ్వర్యంలో అత్యంత పకడ్బందీగా ఎఫ్ ఎల్ సి పరిశీలన చేపట్టడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ డా కె. మాధవీలత తెలిపారు.బుధవారం సాయంత్రం స్థానిక ఎఫ్ సి ఐ గోడౌన్ లో (వేర్ హౌస్) చేపడుతున్న ఈ వి ఎమ్ లకు చెందిన పరికరాల తనిఖీల ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ కే. మాధవీలత కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు మేరకు జరుగుతున్న ఎఫ్ ఎల్ సి ప్రక్రియ పురోగతి తెలుసుకున్నారు. ఎన్నికల కోసం వినియోగించే సాంకేతిక ఈ వి ఎమ్, అనుబంధ పరికరాలు తనిఖీలు అధీకృత బెల్ కంపెనీ ప్రతినిధుల ఆధ్వర్యంలో ప్రారంభించామని, ఈరోజుకి ఆరోజు నివేదికను ఈ సి ఐ కి సమర్పి స్తున్నట్లు తెలిపారు. జిల్లాకు చెందిన 5,971 బ్యాలెట్ యూనిట్స్, 5,463 కంట్రోల్ యూనిట్స్, వివిపాట్ యూనిట్స్ 4,927 తనిఖీలు నిర్వహించడం జరుగుతోందని అన్నారు. మొదటి రోజు 160 యూనిట్స్ చొప్పున, రెండో రోజు 220 యూనిట్స్ తనిఖీలు నిర్వహించారన్నారు.అక్కడ చేపడుతున్న భద్రత చర్యలు తదితర అంశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఎఫ్ ఎల్ సి ఇంఛార్జి ఏ. చైత్ర వర్షిణి, తదితరులు పాల్గొన్నారు.




## జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం

**అడ్డతీగల,అక్టోబర్18, ప్రభాతవార్త:**



అడ్డతీగల మండలం రాయపల్లి గ్రామానికి చెందిన సరుబోలు చిన్నాయమ్మ గత మూడు రోజుల క్రితం అనారోగ్యం తో మరణించడంతో అడ్డతీగల మండల జనసేన నాయకులు బుధవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ తరపున ఆమె కుమారుడుకు రూ3000 లను ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు కుప్పాల జయరాం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం తీసుకోవాలని కోరారు. సభ్యత్వం తీసుకోవడం వలన పార్టీ తరపున ఇన్సూరెన్స్ చేయించడం జరుగుతుందని తెలిపారు. ఎవరైనా ప్రమాదవశాత్తు గాయపడితే పదివేలు రూపాయల నుండి యాభై వేల వరకు వస్తాయని, అలాగే ప్రమాదవశాత్తు చనిపోయిన కుటుంబంలో నామినీ గా ఉన్న వారికి ఐదు లక్షల రూపాయలు ఇన్సూరెన్స్ వర్తిస్తుందని అడ్డతీగల మండల జనసేన నాయకులు

తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్డతీగల మండల జనసేన పార్టీ నాయకులు కుప్పాల జయరాం, పొడుగు సాయి, చిన్నారెడ్డి ,సురేష్ రెడ్డి ,అప్పాజీ, బాబీ తదితరులు పాల్గొన్నారు.

## అంబేత్కర్ అవార్డ్ గ్రహీత ప్రొఫెసర్ మామిడన్న శ్రీధర్ కు మాల మహానాడు నాయకుల ఆధ్వర్యంలో ఘన సన్మానం

**గోకవరం అక్టోబర్ 18 ప్రభాత వార్త**

గోకవరం.సమాజంలో తమ రచనల ద్వారా ప్రజా సేవకు స్ఫూర్తినిచ్చే కారణంగా ఉండటం వల్ల డాక్టర్ బి.ఆర్ అంబేత్కర్ అవార్డు ప్రభుత్వం ప్రకటించింది ఈ అవార్డును రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా ఇవ్వటం జరిగింది . గోకవరం ప్రాంతానికి పేరు తీసుకు వచ్చిన ప్రొఫెసర్ మామిడన్న శ్రీధర్ కి గోకవరం మండలం మాల మహానాడు ఆధ్వర్యంలో పూలమాలతో శాలవు వేసి ఘనంగా అభినందించారు.. ప్రొఫెసర్ కొన్ని సంవత్సరాలుగా సమాజ ప్రయోజిత, ఉపయోగ పడే పుస్తకాలు రాయడం జరిగింది. దీనికి సంబంధించి కొన్ని రాష్ట్రాల్లో సన్మానం, అవార్డులు శ్రీధర్ కు ఇవ్వడం జరిగింది. ఇందులో అత్యుత్తమమైన డాక్టర్ బి.ఆర్ అంబేత్కర్ అవార్డ్ రావటం రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా తీసుకోవడం చాలా సంతోషంగా ఉందని . పుస్తక రచనల ద్వారా ఇన్ని అవార్డులు పొందిన ప్రొఫెసర్ శ్రీధర్ ను మాల మహానాడు నాయకుల . ఆయన స్వగృహంలో కలిసి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా అవార్డ్ గ్రహీతలు అభినందనలు తెలిపి, పూలమాలలు వేశారు. తరువాత శాలువాతో సత్కరించారు. గోకవరం మండలం పేరు రాష్ట్ర స్థాయిలో వినిపించేలా చేసిన మీకు ప్రత్యేక అభినందనలు అంటు కొనియాడారు. అలాగే ఇటీవల అవార్డులు పొందిన శ్రీదర్ భార్య గాయత్రికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు అధ్యక్షులు కంచమర్తి రాజశేఖర్ మౌలి కేబుల్ నెట్వర్క్ అధినేత భగతారత్నరాజు ఎలక్ట్రిషన్ యూనియన్ సభ్యులు బేధంపూడి రాజబాబు కే వంశీ తదితరులు పాల్గొన్నారు




# గద్దెలో వెలిసిన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారు 4వ రోజు మహాలక్ష్మి అవతారం

**గోకవరం అక్టోబర్ 18 ప్రభాత వార్త**

గోకవరంలో వీరభద్రుని గద్దె మరియు కనకదుర్గ అమ్మవారి ఆలయంలో దుర్గమ్మ వారు లక్ష్మీదేవి అలంకారంతో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘ మహిళల అమ్మవారిని కరెన్సీ రూపాయల నోట్లతో ఆలయం అంతా అలంకరించారు. ఈ సందర్భంగా అర్చకులు రఘురామ శర్మ ప్రవీణ్ శర్మ లు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వచ్చిన భక్తులతో ప్రత్యేక కుంకుమ పూజలు ఏర్పాటు చేశారు.శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు గద్దెలో చిన్నారులకు యక్కల మాధురి, హారిక ఆధ్వర్యంలో క్విజ్ పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ నవరాత్రులులో ప్రతిరోజు అమ్మవారు ఒక అవతారంతో దర్శమిస్తారు అమ్మవారు ఏ రూపంతో అవతరిస్తారో ఆరోజు మా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు అన్నారు



# ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలు అవగాహన సదస్సు...

**కడియం అక్టోబర్ 18 ప్రభాతవార్త:-**



కడియం మండలం ప్రత్యేక అధికారి, తహసీల్దార్, కడియం వారి అధ్యక్షతన ఖరీఫ్ -2023 సీసన్ కి సంబందించి రైతులు నుండి ధాన్యం ప్రభుత్వం నేరుగా కొనుగోలు చేయుటకై ఆర్ బి కే కేంద్రాలు -7 గ్రామాలలో ఎర్పాటు చేయడం జరిగిందనిసరదరు ఆర్ బి కే కేంద్రాలలో అవసరమైన స్టాఫ్ ని కూడా ప్రభుత్వం నియమించడం జరిగింది. రైతులు వద్ద నుండి రైస్ మిల్లు లకు ధాన్యం తీసుకుని వెళుటకు అవసరమైన ఖాళీ గోనె సంచులను కూడా ముందస్తు గానే సంబంధిత ఆర్ బి కే లలో పెట్టడం జరిగింది. ధాన్యం సేకరణకు ట్రాన్స్పోర్ట్ నిమిత్తం ప్రభుత్వం వారు వాహనాలని గుర్తించి వాటి అన్నింటికీ జి.ఎస్.పి ట్రాకింగ్ మెషిన్స్ కూడా అమర్చటం జరిగింది. ఆవ ప్రాంతం లో వరి పంట పొలాలలో మురుగు నీరు పోవడానికి అవకాశం లేకుండా అడ్డు వచ్చిన గుర్రపు డెక్కను తీయడం జరుగుచున్నది. అదేవిధంగా రైతులు పండించిన ధాన్యాన్ని మధ్యవర్తులు ప్రమేయం లేకుండ ఉండుటకై అవసరమైన చర్యలు అన్ని తీసుకోవడం జరిగిందని, ఎక్కడైనా రైతులకి సమస్యలు వస్తే వెంటనే మైత్రి కమిటీ కి గానీ, కంట్రోల్ రూమ్ కి గానీ తెలియపర్చిన వెంటనే సమస్యలు పరిస్కారం దిశగా చర్యలు ప్రభుత్వం తీసుకున్నదని తహసిల్దార్ సుజాత తెలిపారు.

ఈ సమావేశం లో మండలం ప్రత్యేక అధికారి, తహసీల్దార్, కడియం, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ యాలి గోపాల్ రావు, వ్యవసాయ అధికారి కడియం, మోటర్ వెహికల్ అధికారి , సి యస్ డి టి, తదితర అధికారులు పాల్గొన్నారు.

# మేము సైతం బాబుకు అండగా

**అమలాపురం అక్టోబర్ 18, ప్రభాతవార్త**



చంద్రబాబు నాయుడుని అక్రమ అరెస్టు పై నిరసనగా "బాబుతో నేను" అంటూ కొత్తపేట తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఇంటింటికి వెళ్లి జరిగిన విషయాలను తెలియజేస్తూ ప్రజల మద్దతు కోరారు.ఆంధ్ర రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసం అహర్నిశలు కృషి చేసిన చంద్రబాబు నాయుడు అరెస్టు చేయటం దారుణమని ప్రజలు వ్యతిరేకత తెలియజేస్తున్నారు. సానుభూతి వ్యక్తపరుస్తున్నారు.. ప్రజల నుండి లభిస్తున్న ఆదరణతో ప్రజలు యొక్క ఆశీస్సులతో తెలుగుదేశం ప్రభుత్వం ఖాయమని టిడిపి నాయకులు ధీమా వ్యక్తం చేశారు..ఈ కార్యక్రమంలో కంఠం చెట్టి శ్రీనివాస్ బోసి భాస్కరరావు మిద్దె ఆదినారాయణ గుబ్బల మూర్తి అద్దంకి చంటిబాబు అన్యం మునీశ్వరరావు, బొరుసు సత్తిబాబు, ముత్యాల సుబ్బారాయుడు,ముద్రగడ సుబ్బారావు, కాశీ ధన రాజు. ముద్రగడ పణి, మట్టా బాలు, బూసి విష్ణు కముజు తాతాజీ పాలంగి ఆశీర్వాదం మండే పూడి శ్రీను, పప్పుల సాయి, పాలంగి శ్రీను సీతారామరాజు. అస్లాం తదితరులు పాల్గొన్నారు

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps

# ఎన్నికల సమరానికి వైఎస్సార్సీ సమాయత్తం

## 26 నుంచి బస్సు యాత్ర - సామాజిక న్యాయ యాత్ర పేరుతో జనంలోకి

## - నేడు ఇన్‌చార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నేతలతో భేటి

**అనంతపురం, అక్టోబర్ 18 ప్రభాతవార్త బ్యూరో** వచ్చే మార్చి, ఏప్రిల్ నెలల్లో ఎన్నికలు ఉండవచ్చని అందుకు ఇప్పటి నుంచే సమాయత్తం కావాలని, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల వైసీపీ శ్రేణులకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ



నేపథ్యంలో ఈనెల 26 తేది నుంచి సామాజిక న్యాయ యాత్ర పేరుతో రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో వేరువేరుగా బస్సు యాత్ర చేపట్టాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆ పార్టీ నేతలకు దిశ నిర్దేశం చేసిన నేపథ్యంలో రాయలసీమ జిల్లాల్లో బస్సు యాత్ర చేపట్టే విషయంలో వైసీపీ రీజనల్ ఇన్‌చార్జ్, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వైసీపీ నేతలతో సమాలోచనలు చేసేందుకు గురువారం అనంతపురం జిల్లా కేంద్రానికి రానున్నారు. ట్రబుల్ షూటర్‌గా గుర్తింపు ఉన్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గురువారం ఉదయం ఉమ్మడి అనంతపురం జిల్లాలోని వైసీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, జిల్లా పరిషత్ చైర్మన్, ఇతర ముఖ్య నేతలతో బస్సు యాత్ర నిర్వహణపై సమాలోచనలు చేయనున్నారు. ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ వర్గాలకు వైసీపీ ప్రభుత్వం ఏం చేసిందని, బస్సు యాత్ర పేరుతో జనంలోకి వెళ్లనున్నారు. ఇందులో భాగంగా వైసీపీ ఎమ్మెల్యేలతోపాటు ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ వర్గాలకు చెందిన ముఖ్య నేతలను కూడా బస్సు యాత్రలో కీలకంగా జనం ముందుకు తీసుకెళ్లనున్నారు. ప్రతి నియోజకవర్గంలో ఒకరోజు బస్సు యాత్ర నిర్వహించి ప్రతిరోజు ఒక చోట బహిరంగ సభ నిర్వహించి వైసీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు జనంలోకి తీసుకెళ్లాలని వైసీపీ యోచిస్తోంది. ప్రతిరోజు నిర్వహించే సభలో 15వేల నుంచి 25వేల జనాన్ని సభలో సమీకరించాలని పార్టీ నేతలు అంటున్నారు. బస్సు యాత్రలో భాగంగా జగనన్న అమ్మఒడి, జగనన్న తోడు, జగనన్న విద్య దీవెన, జగనన్న విద్య కానుక, వైఎస్ఆర్ కాపు నేస్తం, వైఎస్ఆర్ రైతు నేస్తం, నాడునేడు పనులు సచివాలయాల ద్వారా ప్రజలకు కలిగిన మేలు తదితర సంక్షేమ కార్యక్రమాలను జనంలోకి తీసుకెళ్లాలని యోచిస్తున్నారు. రాయలసీమలో ఒక బస్సు యాత్ర, ఉత్తరాంధ్రలో ఒక బస్సు యాత్ర, కోస్తా జిల్లాల్లో ఒక బస్సు యాత్ర ఒకే రోజు ప్రారంభించనున్నారు. మూడు ప్రాంతాల్లో ప్రతిరోజు సభలు నిర్వహించాలని వైసిపి సన్నాహాలు చేస్తోంది. అందులో భాగంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 14 శాసన సభ స్థానాల ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ముఖ్య నేతలతో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమావేశం కానున్నారు. ఇందుకు గుత్తిరోడ్డులోని కెటిఆర్ ఫంక్షన్ హాలులో సమావేశ నిర్వహణ ఏర్పాట్లను వైసీపీ జిల్లా నిర్వహణ పైలా నరసింహయ్య పర్యవేక్షించి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సమావేశానికి ఎవరెవరు రావాలన్నది సంబంధిత ముఖ్యులకు ప్రత్యేకంగా ఆదేశాలు ఇచ్చినట్లు తెలియవచ్చింది. ఈ సమావేశానికి మీడియాను అనుమతిస్తారా లేదా అన్నది తెలియాల్సి ఉంది.



# పవన్‌కళ్యాణ్ వర్తమాన ఆలోచనలు, చంద్రబాబు సుదీర్ఘ అనుభవం రాష్ట్రానికి అవసరం

## - జనసేన పార్టీ పిఏసి చైర్మన్ నాదెండ్ల మనోహర్

**రావులపాలెం/కొత్తపేట ,అక్టోబర్ 18, ప్రభాతవార్త :** రాష్ట్రంలో నేడు నెలకొని ఉన్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో పవన్ కళ్యాణ్ వర్తమాన రాజకీయ ఆలోచనలు,చంద్రబాబు సుదీర్ఘ అనుభవం రాష్ట్రానికి ఎంతో అవసరమని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ (పిఏసి) నాదెండ్ల మనోహర్ అన్నారు. బుధవారం ఆయన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గ లో పర్యటించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పార్టీ ఇంచార్జి బండారు శ్రీనివాస్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. రావులపాలెం నుంచి భారీ ర్యాలీగా కొత్తపేట చేరుకున్న ఆయన నియోజకవర్గంలో జీవిత ప్రమాదవశాత్తు మరణించిన , గాయపడిన క్రియాశీలక సభ్యుల కుటుంబాలకు భీమా చెక్కులను అందజేశారు. కొత్తపేట మండలం కండ్రిగ గ్రామ పరిధిలోని అల్లపల్లి వార పాలెం బండారు వెంకటరాజు, వానపల్లికి చెందిన నాగిరెడ్డి సత్తిబాబులు కుటుంబాలకు రూ.5లక్షలు చొప్పున భీమా చెక్కులను అందజేశారు. అలాగే పలివెల గ్రామానికి చెందిన గంధ్రోతు మనోహర్ రూ.50వేలు, వానపల్లికి చెందిన గనిశెట్టి శ్రీనివాసరావుకు రూ.29వేలు, రావులపాలెం మండలం ఊబలంకకు చెందిన మద్దింశెట్టి అయ్యప్పకు రూ.50వేలు, ఆలమూరు మండలం బడుగువాని లంకకు చెందిన దూలం దేవతా నాగేంద్రకు రూ.31వేలు, ఆత్రేయపురం మండలం వాసంపల్లికి చెందిన ఏపుగంటి సత్యనారాయణ (సతీష్)కు రూ.47వేలు భీమా చెక్కులను అందజేశారు. అనంతరం వాడపాలెంలో బండారు శ్రీనివాస్ స్వగృహం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర భవిష్యత్తు కోసమే జనసేన, తెలుగుదేశం పార్టీలు కలిసాయన్నారు. పవన్‌కళ్యాణ్, చంద్రబాబుల నాయకత్వంలో ఉమ్మడి ప్రణాళిక సిద్ధం చేసుకుని వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విముక్త ఆంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాము. జనసేన, టిడిపి కలయిక పొత్తు ద్వారా రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని చెప్పారు. త్వరలోనే ఉమ్మడి ప్రణాళిక ద్వారా ప్రజల ముందుకు వెళ్తామని ప్రకటించారు. ఈ ప్రభుత్వం చేసు _న్న బటన్ నొక్కే సంక్షేమం కాకుండా దీనికి భిన్నంగా పేద ప్రజలకు నిజమైన సంక్షేమం అందేలా భవిష్యత్తు ప్రణాళిక ఉంటుందన్నారు. రాష్ట్రంలోని ఏ రాజకీయ పార్టీ చేయని విధంగా పవన్ కళ్యాణ్ సారధ్యంలోని జనసేన పార్టీ ప్రమాదవశాత్తు మరణించిన, గాయపడిన కార్యకర్తల కుటుంబాలను ఆదుకునే విధంగా ఆర్థిక భరోసా ఉంటుందన్నారు. క్రియాశీలక సభ్యత్వాల నమోదులో కొత్తపేట నియోజకవర్గ ం బండారు శ్రీనివాస్ నాయకత్వంలో రాష్ట్రంలోనే మూడో స్థానంలో ఉందన్నారు. ప్రమాదవశాత్తు మరణించిన క్రియాశీలక కార్యకర్తల కుటుంబాలకు రూ.లక్షలు చొప్పున భీమా అందజేస్తున్నామని, ఇవిధంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 11 కుటుంబాలకు రూ.55 లక్షల విలువైన చెక్కులను అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్, వివిధ నియోజకవర్గాల ఇంచార్జిలు వేగుళ్ళ లీలాకృష్ణ, పితాని బాలకృష్ణ, బొంతు రాజేశ్వరరావు, పంతంశెట్టి సూర్యచంద్ర, జిల్లా ప్రధానకార్యదర్శి తాళ్ళ డేవిడ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఏ తప్పు చేయని చంద్రబాబు జగన్ వికృత చేష్టల వల్ల జైలు పాలు

## ఈ పాపం ఊరికే పోదు : మాజీ మంత్రి అమరనాథరెడ్డి



**గంగవరం, అక్టోబర్ 18, ప్రభాతవార్త :** ఏ తప్పు చేయని మచ్చలేని చంద్రుడు నారా చంద్రబాబునాయుడని,అలాంటి మహోన్నత వ్యక్తిపై లేనిపోని కేసులు బనాయించి కటకటాల పాలు చేస్తున్నారంటూ మాజీ మంత్రి అమరనాథరెడ్డి మండిపడ్డారు.బుధవారం పలమనేరు నియోజకవర్గం గంగవరం మండలం గండ్రాజుపల్లె సమీపంలోని ఇండస్ట్రీయల్ నందు మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా తెలుగుదేశం,జనసేన పార్టీల నాయకులతో ఆత్మీయ సమావేశం విజయవంతంగా జరిగింది.2024లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో అరాచక ప్రభుత్వాన్ని అంతమెందించడమే తమ ధ్యేయమని ఇరుపార్టీల నేతలు పేర్కొన్నారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి మాట్లాడుతూ..తెలుగుదేశం,జనసేనలు ఒకే కుటుంబం ఒకే నాయకత్వంలో కలిసికట్టుగా ముందుకు సాగి వైసీపీ ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్ళి ప్రజలను చైతన్యవంతంగా చేయాల్సిన బాధ్యత రెండు పార్టీలపై ఉందన్నారు. తెలుగుదేశం,జనసేన తనకు రెండు కళ్ళు అని ఆయన పేర్కొన్నారు. దేశంలోని అన్ని పార్టీల అధినేతలు చంద్రబాబునాయుడు ఏ తప్పు చేయలేదని ముక్తకంఠంతో ఖండిస్తున్నారన్నారు.అయితే జగన్ వికృత చేష్టలతో ఆయనను జైలులో మగ్గే విధంగా చేస్తున్నాడని, ఈ పాపం ఊరికే పోదన్నారు.లక్షకోట్లు దోచిన దొంగ గొడ్డలి వేటతో బాబాయ్‌ని బలికొన్న అబ్బాయ్ దర్జాగా బయట తిరుగుతుంటే ఏ తప్పు చేయని తమ నేతను అక్రమంగా అరెస్టు చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు.తమ నాయకుడు తన 40 ఏళ్ళ రాజకీయ జీవితంలో మచ్చలేని నాయకుడుగా ఎదిగారని,తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకొని అవినీతికి కేరాఫ్ అడ్రస్సుగా ఆర్థిక నేరచరిత్రతో ముఖ్యమంత్రి జగన్ ఎదిగారని ఆయన ఎద్దేవ చేశారు. అవినీతిపరులు రాజ్యమేలితే నీతిపరులు జైలు పాలుఅవుతారన్న నానుడిని ఆయన గుర్తు చేశారు.ఆంధ్ర అభివృద్ధి కావాలంటే జగన్ వైరస్ పోవాలని, సైకోపోవాలి సైకిల్ రావాలని నినాధాలతో సమావేశంలో హోరెత్తించాయి.రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామని రైతుల పార్టీ అని చెప్పుకుంటున్న యువజన శ్రామిక రైతు పార్టీ వలన రైతులకు వరిగిందేమి లేదన్నారు. యువతకు,నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని ఉన్న పరిశ్రమలను సైతం పారద్రోలుతున్నారు.నిత్యవసర సరుకులు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు.విద్యుత్ బిల్లులు ప్రజలపై భారం మోపుతున్నారన్నారు.మద్యపాన నిషేదం చేస్తామని కల్తీ మద్యం విక్రయించి ఆడపడుచుల పుస్తెలను తెంపేస్తూ,ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారన్నారు.ఇసుక మాఫియా,మట్టి మాఫియా, లిక్కర్ మాఫియా,భూ దందాలు గడిచిన నాలుగన్నార సంవత్సరాల్లో ఎక్కువయ్యాయన్నారు.వీరి అవినీతి అరచకాలపై ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నేతలపై కక్ష సాదింపులో భాగంగా అక్రమ కేసులు పెడుతున్నారని, ఎన్ని కేసులు పెట్టినా పసుపుదళం అదరం బెదరమన్నారు. అనంతరం జనసేన జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడుతూ..తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు కష్టకాలంలో ఉండగా మన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ చంద్రబాబుకి అండగా నిలబడ్డారని అలాగే ప్రతి మండలంలో,ప్రతి పంచాయతీలో,ప్రతి గ్రామంలో ప్రతి జనసేన కార్యకర్తలు సైనికులుగా పనిచేసి తెలుగుదేశం అభ్యర్థిని ఆఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు.రాష్ట్రంలో రాజ్యాంగ బద్ధంగా పని చేయాల్సిన పోలీస్ వ్యవస్థ ఐపిసి సెక్షన్‌లకు బదులు వైసీపీ సెక్షన్‌లను అమలు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు.వైసీపీ ప్రభుత్వం అధికారాన్ని అడ్డం పెట్టుకొని అరాచకాలు,దౌర్జన్యాలు,దోపిడీలు చేస్తుందన్నారు.

# కరెంటు కోతలతో రైతన్నల వెతలు

## - రైతుల పార్టీ అని చెప్పుకుంటున్న వైఎస్సార్సీ రైతులకు విద్యుత్ అందించడం లేదు - మట్టి అమ్ముకోవడంలో ఉన్న శ్రద్ధ రైతులకు కరెంటు అందించడంలో లేదు - సమస్యలు పరిష్కరించకపోతే రైతులతో కలిసి ఉద్యమం చేపడుతాం

## - టిడిపి సీనియర్ నేత పెరుమాళ్ల జీవానందరెడ్డి



రైతులతో టీడీపీ సీనియర్ నేత పెరుమాళ్ల జీవానదరెడ్డి

**అనంతపురం, అక్టోబర్ 18 ప్రభాతవార్త బ్యూరో** కరెంటు కోతలతో పండించిన పంట ఎండిపోతోందని, రైతన్నలు పడుతున్న బాధలు అధికారులకు ప్రజాప్రతినిధులకు కనపడలేదా అని గుంతకల్ నియోజకవర్గం తెలుగుదేశంపార్టీ సీనియర్ నాయకులు పెరుమాళ్ల జీవానందరెడ్డి ధ్వజమెత్తారు. పెరుమాళ్ల జీవానందరెడ్డి మాట్లాడుతూ.. పామిడి మండల విద్యుత్ ముఖ్య కార్యాలయం నుంచి అనుసంధానమైన ఎద్దులపల్లి గ్రామంలో ఉన్నటువంటి సబ్ స్టేషన్ నుంచి సరఫరా అయ్యే రామగిరి ఫీడర్ లైను విద్యుత్ సరఫరాలో రైతులకు బ్రతికున్నంగానే నరకం చూపిస్తున్నారన్నారు. ప్రతిరోజు ప్రతి పఅర్థగంటకి కరెంట్ కట్ చేయడం వల్ల కొద్దిపాటిగా సాగు చేసుకుంటున్న పంటలన్నీ ఎండు ముఖం పట్టాయని, ఈ అధికారులు నిర్లక్ష్యం వల్ల పళ్లతోటలకు చాలీచాలని నీటితో వృక్షాల ఘోషను చూడలేని పరిస్థితిలో రైతులకు కన్నీరు మున్నీరు అవుతూన్నరని పెరుమాళ్ల జీవానందరెడ్డి అన్నారు. రైతన్నలు అధికారులకు ఫోన్ చేసి వారి గోడు విన్నవించుకున్నప్పటికీ అధికారులు స్పందించలేదన్నారు. రైతులకు గిట్టుబాటు ధర ఎలాగూ కల్పించలేదని కనీసం కరెంటన్న రైతులకు అందించడన్నారు. పోలీస్‌యాక్టు పేరు చెప్పి రైతన్నల సైతం భయభ్రాతులకు గురి చేస్తున్నారన్నారు. రైతన్నలకు నాణ్యమైన 9 గంటల కరెంటు సరఫరా చేస్తామని ప్రగల్బాలు చెప్పి ఈ రోజు కరెంటు సబ్‌స్టేషన్‌లో వచ్చే ఫ్లెక్స్ వల్ల మోటార్లు స్టార్టర్ పెట్టు కాలిపోతుంటే రైతన్నలు తమ భార్యల మంగళసూత్రాలన్నీ సైతం తాకట్టు పెట్టి ఈ రోజు రిపేర్లు చేయించుకుని కరెంటు కోసం ఎదుచు చూసేపరిస్థితి వచ్చింది. కరెంటు ఎప్పుడు వస్తుందో తెలియదు ఎప్పుడు పోతుందో తెలియదు, వచ్చిన కరెంటు కనీసం మూడు నుంచి నాలుగు గంటలు నిరవధికంగా వస్తే పంట పొలాలు నీటి పారుదలకు అనుకూలంగా ఉటుంది కానీ ప్రతి అర్ధగంటకు గంటకొకసారి కరెంట్ పోవడం మరీ తిరిగి ఎప్పుడు వస్తుందో తెలియని వైనంతో రైతన్నలు బిక్కుబిక్కుమని వాళ్ల జీవనాన్ని కొనసాగిస్తున్నారన్నారు. రైతన్నల పొలాల పక్కన ఉన్న ఇసుకనుగాని అదే విధంగా కొండ గరుసులకు కానీ అమ్ముకోవడానికి చూస్తున్న శ్రద్ధ రైతన్నలకి నాణ్యమైన కరెంటు సప్లై చేయడంలో చూపించకపోవడం చాలా బాధాకరం. ఎందుకంటే రైతన్నలు ఈ నాయకులకి ఈ ఆఫీసర్లకి లంచాలు ఇవ్వలేరు. కాబట్టి ఈ రైతన్నల నుంచి వీళ్లకి ఎటువంటి లాభం ఉండదని ఈ కరెంటు సమస్య మీద పూర్తిగా అశ్రద్ధ వహించడంచాలా బాధాకరమం. పేరుకు మాత్రమే రైతుల పార్టీ అని చె ప్పుకుంటున్న వైసీపీ ప్రభుత్వం రైతులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. పంట పండిద్దామంటే కరెటు ఉండదు. పండిన పంటను అమ్ముదామంటే గట్టుబాటు ధర ఉండదు, నకిలీ విత్తనాలు నకిలీ ఎరువులు, గిట్టుబాటు ధరలు లేక కరెంటు లేక రైతులు నరకం అనుభవిస్తున్నారన్నారు. 140 కోట్ల జనాభాకు కడుపు నింపుతున్న రైతన్నలకే ఈ భ్రుత్వం ఈ నాయకులు ఈ అధికారులు చూపిస్తున్న ప్రతి కష్టం ఏ రైతన్న మొరవడని రైతన్నల శాపం కచ్చితంగా ఈ వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వ పతనానికి శాసనమవుతుదన్నారు. విద్యుత్ తీగల సమస్య ఉందంటే నమ్మొచ్చుకానీ ఈ సమయంలో కూడా రైతులను ఇలా మోసం చేయడం సరి కాదని నాయకులతో కట్టుకుని తిరుగుతున్న ఈ అధికారులకు కచ్చితంగా బుద్ధి చెప్తామని పెరుమాళ్ల జీవానందరెడ్డి అన్నారు. రేపటి నుంచి రైతులకు అందాల్సిన తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా అందకపోతే కచ్చితంగా విద్యుత్ అధికారుల కార్యాలయం ముందు ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు.

# జ్యుడీషియల్ ప్రివ్యూకు అచ్యుతం,శ్రీపథం టెండర్ డాక్యుమెంట్స్

**తిరుమల,అక్టోబర్ 18ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలతిరుపతిదేవస్థానమ్ తిరుపతినగరంలోని గోవిందరాజస్వామి సత్రాలు స్థానంలో భక్తులకు అధునాతన వసతికోసం నిర్మించతలపెట్టిన అచ్యుతం,శ్రీపథం వసతి సముదాయాల టెండరు డాక్యుమెంట్లను జ్యుడీషియల్ ప్రివ్యూకు టిటిడి సమర్పించింది. ఈ వసతిసముదాయాల నిర్మాణానికి సంబంధించి ఏవైనా అభ్యంతరాలుంట ఈనెల 27వతేదీ లోపు తెలియజేయాలని టిటిడి కోరింది. తిరుపతిలో టిటిడికి చెందిన గోవిందరాజస్వామి రెండవసత్రం స్థానంలో దాదాపు 300కోట్ల రూపాయల అంచనాతో అచ్యుతం, మూడో సత్రం స్థానంలో అదే అంచనాలతో 300కోట్ల రూపాయలతో శ్రీపథం వసతి గృహాలను నిర్మించాలని టిటిడి ఇదివరకే నిర్ణయించి ధర్మకర్తలమండలిలో తీర్మానించింది. ఈ ప్రాజెక్టు పనులకు సంబంధించి ఏదేని అభ్యంతరాలుంటే కాంట్రాక్టర్లు, ఇతరులు తమ సలహాలు అభ్యంతరాలను ఎపిజ్యుడీషియల్‌ప్రివ్యూ అట్‌దిరేట్ ఆఫ్ జిమెయిల్.కామ్ లేదా సిఇటిటిడిటిపిడిఅట్‌దిరేట్‌ఆఫ్ జిమెయిల్.కామ్‌కు మెయిల్ ద్వారా తెలియజేయాలని కోరారు. మరిన్ని వివరాలకు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.తిరుమల.ఓఆర్‌జి సంప్రదించవచ్చని తెలిపింది.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి సురేష్

# వైఎస్సార్సీ సామాజిక న్యాయ బస్సుయాత్ర సన్నాహాక సమావేశం

**నెల్లూరు సిటీ, అక్టోబర్ 18, ప్రభాతవార్త** ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయ బస్సు యాత్ర జరగనున్న నేపథ్యంలో ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాలకు సంబంధించిన ఎస్సీ సన్నాహక సమావేశం శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కేంద్రంలోని కస్తూరిభా పాఠశాల ఆవరణంలోని రవీంద్రనాథ్ ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించారు. అక్టోబర్ 26వ తేదీ నుంచి సామాజిక న్యాయ బస్సుయాత్ర ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు పి.కామరాజు అధ్యక్షతన రాష్ట్ర ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, ఎంపీలు గురుమూర్తి, నందిగం సురేష్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో ప్రారంభం కానున్న బస్సుయాత్రను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని కోరారు. దళితులకు అండగా నిలిచే సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి సీఎం చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి నేతపై ఉందన్నారు. రాష్ట్రంలో పలు సంక్షేమ పథకాలతో పాటు విద్య, వైద్యం, ఉపాధి వంటి ఎన్నో కార్యక్రమాలు కుల,మతాలకు, పార్టీలకు అతీతంగా అమలవుతున్నాయని గుర్తు చేశారు. భవిష్యత్తులోనూ కొనసాగాలి అంటే మరో సారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలుపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. దళితులకు సామాజిక న్యాయం జగనన్నతోనే సాధ్యమని బస్సు యాత్ర ద్వారా ప్రజలకు వివరించేందుకు బస్సు యాత్ర ప్రారంభిస్తున్నామన్నారు. అందరం కలసికట్టుగా పనిచేయాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు. రాష్ట్ర ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో నాలుగు సన్నాహక కార్యక్రమాలు నిర్వహించ తలపెట్టామని కర్నూలులో పూర్తయిందని, ప్రస్తుతం నెల్లూరులో ఏర్పాటు చేశామన్నారు. నవరత్నాలతో దళితులకు, ఇతర వెనుకబడిన వర్గాలకు మేలు జరిగిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కిలివేటి సంజీవయ్య, వెలగపల్లి వరప్రసాదరావు, ఎమ్మెల్సీ మేరుగ మురళీ, బల్లి కళ్యాణ్, మొండితోక అరుణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ, షెడ్యూల్ కులాల కోఆపరేటీవ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ జూపూడి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# సిఎం జగన్‌ను కలిసిన పండుగాయల రత్నాకర్



**విజయవాడ,అక్టోబరు18,ప్రభాతవార్తప్రతినిధి:** నార్త్ అమెరికాలో ఏపీ ప్రభుత్వ ప్రతినిధిగా పనిచేస్తున్న పండుగాయల రత్నాకర్ పదవి కాలాని ్న వరుసగా నాలుగవ సారి ప్రభుత్వం పొడిగించింది.ఈ సందర్భంగా పండుగాయల రత్నాకర్ బుధవారం సీఎం జగన్‌ను ఆయన కార్యాలయంలో కలుసుకుని పుష్పగుచ్ఛాన్ని అందజేసి, ధన్యవాదాలు తెలిపారు.తనపై అత్యంత నమ్మకంతో పదవి కాలాన్ని నాలుగవ సారి పెంచడం పట్ల సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# నెల్లూరులో తల్లీ, కూతురు ఆత్మహత్య

**నెల్లూరు క్రైమ్, అక్టోబర్ 18, ప్రభాతవార్త** శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కేంద్రంలోని వేదాయపాలెం పోలీసు స్టేషన్ పరిధిలోని విక్రమ్‌నగర్‌లో నివాసం ఉంటున్న మురారి లక్ష్మీ(50), మురారి భానులత(34) ఇరువురు ఆత్మహత్య చేసుకున్న సమాచారంతో సంఘటన చేరుకున్న పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో భాగంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వేదాయపాలెం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకట నారాయణ తెలిపారు. వివరాలకు వెళ్తే.. నెల్లూరు రూరల్ మండం పెద్దచెరుకూరులో గత పది సంవత్సరాల నుంచి మృతులు ఇరువురు కూడా నివాసం ఉన్నట్లు, నెల్లూరు నగరంలో వ్యాపారం చేస్తున్న ఆవుల సుధాకర్‌రెడ్డి(45)తో మురారి భానులత సహజీవనం చేస్తున్నట్లు తెలిపారు. వీరు ఇరువురు కూడా 2023 సంవత్సరం ఫిబ్రవరిలో వివాహం చేసుకున్నట్లుగా రెండు నెలల క్రితం విక్రమనగర్‌లో నివాసానికి అద్దెకు చేరినట్లుగా స్థానికులు తెలిపారు. కొద్ది రోజుల క్రితం ఆవుల సుధాకర్‌రెడ్డి బిజినెస్‌లో నష్టాలు రావడంతో ఒక్కసారిగా మనస్థాపానికి గురై పక్షవాతంతో ప్రభుత్వ ఆసుపత్రిలో మరణించాడు. తన భర్త సుధాకర్‌రెడ్డికి డబ్బులు ఇచ్చిన అప్పుల వాళ్ళ తమను ఎక్కడ ఇబ్బంది పెడతారని ముందస్తు భయంతోనే మురారి భానులత, మురారి లక్ష్మీ ఇరువురు కూడా విక్రమ్‌నగర్‌లో నివాసం ఉంటున్న ఇంట్లోనే ఉరివేసుకొని చనిపోయినట్లుగా ప్రాథమిక అంచనాకు వచ్చారు పోలీసులు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# అప్పలాయగుంటలో నిరుపేదల గుడిసెలపై రియల్టర్ల కన్ను

## యేళ్ల తరబడి నివాసముంటున్న మా గుడిసెలే కావాలా?

## - అడ్డుకున్న స్థానికులు-పట్టించుకోని రెవెన్యూ అధికారులు

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 18 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం ప్రశాంతమైన ప్రాంతం. పట్టణ పరిధి పెరిగే కొద్ది శివారు ప్రాంతాల స్థలాలకు విలువ పెరిగింది. ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తి పట్టణానికి ఓ ఫర్లాంగు దూరంలో అప్పలాయగుంట ఉంది. ఇక్కడ సుమారు రెండు వందల కుటుంబాలు నివాసముంటున్నారు. కనీస సదుపాయాల్లేని రోజుల నుంచి నిరుపేదలు ఇక్కడగుడిసెలు నిర్మించుకొని జీవిస్తున్నారు. అయితే గత కొంత కాలంగా ఈ భూమిలపై కొందరు రియల్ ఏస్టేట్ వ్యాపారుల కన్ను పడింది ఇంకేముంది? వెంటనే వారు తమ రాజకీయ పలుకుబడిని ఉపయోగించుకున్నారు. తమ డబ్బు పలుకుబడితో రెవెన్యూ అధికారులను వశ పరచుకున్నారు. రాత్రికి రాత్రే గుడిసెలను తొలగించుటకు పూనుకున్నారు. దాంతో నిరుపేదలు తిరగబడ్డారు.వారికి అండగా ప్రతిపక్షాలు రంగంలో దిగాయి.దాంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. శ్రీకాళహస్తి-పిచ్చాటూరు మార్గంలో అప్పలాయగుంట, ఈదులగుంట ఉంది. ఇక్కడ ఎంతో మంది నిరుపేదలు ఏళ్ళ తరబడి నివాసం ఉంటున్నారు. ఇటీవల అప్పలాయగుంటలో ఉన్న ఇండ్లను ఖాళీచేయించేందుకు కొందరు నేతలు ప్రయత్నించగా ఇక్కడనివాస్థలు అడ్డుకోవడంతో వెనుదిరిగారు. తిరిగి మంగళవారం రాత్రి అప్పలాయగుంట సర్వేనంబర్ 44,45లో ఉంది. కొందరు నేతలు ఈస్థలం ఖాళీచేయాలని కోరుతూ జెసిబిలు తెచ్చి ఇండ్లను కూల్చివేయడానికి రావడంతో స్థానికులు తిరగబడ్డారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సర్వే నంబర్ 42లో మొత్తం 25ఎకరాలు ఈదులగుంట చెరువు ఉంది. ఇందులో 1,2,3,4,7 సర్వేనంబర్లులో ఆక్రమణలు ఉంటే ఆఇండ్లకు తాత్కాలిక ఇంటనెంబర్లు కేటాయించారు. ఈదులగుంటలో నివాసం ఉంటున్న వారికి రేషన్‌కార్డులు, ఆధార్‌కార్డులు, ఓటరు కార్డులు ఉన్నాయి. ఇక ఇక్కడ స్థిరనివాసాలు ఏర్పరచుకుని తమ చిన్నప్పటి నుంచి ఉన్నామని పేర్కొంటున్నారు. ప్రస్తుతం కొందరు నేతలు ఈభూమి తమదని చెప్పుకుని



ఇంటిస్థలాలను కూల్చేందుకు వచ్చిన వారిని అడ్డుకుంటున్న అప్పలాయగుంట వాసులు

ఇక్కడ నివాసం ఉంటున్న పేదలను ఖాళీ చేయించేందుకు సుమారు 50మంది వరకు యువకులు రెండు జెసిబిలతో వచ్చినట్లు అప్పలాయగుంట వాసులు పేర్కొన్నారు. విషయం తెలిసిన టుటౌన్ పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితులను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. అయితే రెవెన్యూ అధికారులు మాత్రం ఈవైపు కన్నెత్తికూడా చూడకపోవడం శోచనీయం. ఇక్కడ నిరుపేదలు సుమారు 20 సంవత్సరాలుగా అక్కడ నివాసముంటున్న నిరుపేదలు ఆందోళనలు ఉద్యమాలు చేయగా అక్కడ మౌళిక సదుపాయాలు కల్పించారు. వారు చక్కగా అన్ని సమకూర్చుకున్న తరువాత ఎందుకో రెవెన్యూ అధికారులు ఎవరి వత్తిడితోనో ఖాళీ చేయాలని ప్రత్యామ్నాయంగా రాజీవ్‌నగర్ పరిసరాల్లో అందిస్తామని చెప్పటం గమనిస్తే ఇదేమి చొద్యమని చర్చించుకుంటున్నారు.ఇంత జరుగుతున్నా శ్రీకాళహస్తి తహశీల్దార్ కల్పించుకోకపోవటం గమనించదగ్గ విషయం. వివరణ కోరటానికి ప్రయత్నించినా కనీసం ఆ అధికారి చరవాణిని కూడా తీయకపోవటం గమనార్హం

# సూళ్లూరుపేటలో గంజాయి పట్టివేత

**సూళ్లూరుపేట, అక్టోబర్ 18 ప్రభాతవార్త** సూళ్లూరుపేట ఆర్టీసీ బస్టాండు వద్దఅక్రమంగా తరలిస్తున్న మూడు కేజీల గంజాయిని పట్టుకొని ఇద్దరిని అరెస్టు చేశారు. ఎస్ఇబి అధికారులు బుధవారం బస్టాండు వద్ద దాడులు నిర్వహించి అనుమానితులుగా ఉన్న ఒంగోలు పాతమార్కెట్ ఏరియాకు చెందిన ఎస్‌కె సిద్దార్థ, కమ్మపాలెంకు చెందిన ఎస్‌కె సాహిల్‌లను పట్టుకొని అరెస్టు చేశారు. వీరితో పాటు మరో ముగ్గురు గంజాయిని తరలించేందుకు సహాయం చేశారని గుర్తించామని ఎస్ఇబి సిఐ సూర్యనారాయణ తెలిపారు. ఒంగోలు జిల్లాకు చెందిన రాహుల్, హరికృష్ణ, చెన్నైకి చెందిన గోకుల్‌కు ఈ అక్రమ రవాణాతో సంబంధం ఉన్నట్లు తెలిపారు. ప్రకాశం జిల్లా నివాసి అయిన రాహుల్ ఆదేశం ప్రకారం ఒంగోలు పట్టణం నివాసం ఉంటున్న సిద్దు, షేక్ సాహిల్ అనే ఇద్దరు కలిసి నర్సీపట్టణం మండలం గబ్బాడ గ్రామంలో హరికృష్ణ వద్ద నుంచి 3 కేజీల గంజాయిని తీసుకొని చెన్నైకి అక్రమంగా తరలించేందుకు బయలుదేరారు. చెన్నైలో గోకుల్ అనే



వ్యక్తికి గంజాయి చేరవేస్తే రూ.10 వేలు ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నారని ఎస్ఇబి అధికారులు తెలిపారు. వీరిని పట్టుకొని అరెస్టు చేశామని, మిగతా వారిని కూడా త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.

ఈ దాడుల్లో ఎస్ఇబి సిబ్బంది ఎం.పోలయ్య, ఆర్.రమణయ్య, రామనరసయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచంలోనే హైదరాబాద్ అత్యంత నివాసయోగ్యమైన ప్రాంతం

## వాషింగ్టన్ డిసిలో జరిగిన యునైటెడ్ నేషన్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ ఈవెంట్ మేయర్ విజయలక్ష్మి ప్రసంగం

**హైదరాబాద్, అక్టోబరు 18 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావా నంతరం ప్రపంచంలోనే హైదరాబాద్ నగరం అత్యంత నివాసయోగ్యమైన ప్రాంతంగా రూపొందిందని ప్రపంచ దేశాలు హైదరాబాద్ నగరంలో ఐటి సంస్థల ఏర్పాటుకు మొగ్గు చూపుతున్నాయని మేయర్ గద్వాల విజయలక్ష్మి అన్నారు. బుధవారం వాషింగ్టన్ డిసిలో జరిగిన యునైటెడ్ నేషన్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఈవెంట్‌లో మేయర్ ప్రత్యేక వక్తగా పాల్గొని ప్రపంచ ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా హేయర్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో తెలంగాణాకు హరితహారంకు సంబంధించిన విషయాలను వివరించారు. నగరంలో రహదారుల వెంట సెంట్రల్ మీడియన్‌లో విస్తృతంగా మొక్కలు నాటడం జరిగిందన్నారు. అదేవిధంగా ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో, పాఠశాలల్లో, కళాశాలలు, యూనివర్సిటీ, ప్రభుత్వ కార్యాలయాల్లో పెద్ద ఎత్తున పచ్చదనం పెపొందించడంతో పాటు ట్రీ పార్కులు, పంచతత్వ పార్కులు, మేజర్ పార్కులు అభివృద్ధి, కాలనీ పార్కులలో విరివిగా మొక్కలు నాటడం, ప్రతి ఇంటికి ఉచితంగా మొక్కలు పంపిణీ చేయడం, ఫ్లైఓవర్ల కింద గార్డెన్‌లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.సిఎం కెసిఆర్ మార్గదర్శకత్వంలో జిహెచ్‌ఎంసి అడవుల పెంపకం డ్రైవ్‌లు, పట్టణ ప్రాంతాల్లో వర్టికల్ గార్డెనింగ్, పర్యావరణ అనుకూల వ్యర్థ పదార్థాల నిర్వహణ పద్ధతులతో పాటు అనేక ప్రగతిశీల చర్యలు అమలు చేశామన్నారు. ఈ ప్రయత్నాలు నగరాల సౌందర్య ఆకర్షను మెరుగుపరచడమే కాకుండా వాతావరణ మార్పులు ప్రతికూల ప్రభావాలను తగ్గించడంలో కూడా గణనీయంగా దోహదపడ్డాయన్నారు.

# బ్రహ్మోత్సవాలు



## కల్పవృక్షంపై రాజమన్నార్ అలంకారం

### నాల్గవరోజు ఉదయం కనువిందుచేసిన మలయప్ప

**తిరుమల, అక్టోబరు 18ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీదేవిభూదేవితో కలసి చేతిలో బంగారు చర్నాకోలు... మరోచేతిలో దండం ధరించి రాజమన్నార్ అలంకారంలో మలయప్పస్వామి కల్పవృక్ష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చాడు. కలియుగవైకుంఠం తిరుమలలో కన్నులపండువగా ఏడుకొండలవానికి జరుగుతున్న నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో నాల్గవరోజు బుధవారం ఉదయం వాహనమండపం వద్ద వేదమంత్రోచ్చరణల నడుమ కల్పవృక్షవాహనంపై అర్చకులు అధిరోహింపజేసి, కర్పూరహారతులిచ్చారు. స్వామివారి వాహనంముందు భక్తులు గోవిందా...వేంకటరమణ గోవిందా అంటూ నామస్మరణలతో తన్మయత్వం పొందారు. భూలోకంలో వృక్షాలు తాము కాసిన ఫలాలు మాత్రమే ప్రసాదిస్తాయి. కల్ప వృక్షం వాంఛిత ఫలాలన్నిటినీ ప్రసాదిస్తుంది. అంతటి ప్రత్యేకత వున్న కల్పవృక్షవాహనాన్ని అధిరోహించి తిరుమాఢవీధుల్లో వైకుంఠవాసుడు కరుణించాడు. ఉదయం వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి, టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి దంపతులు, టిటిడి ఇఓ ఏవి ధర్మారెడ్డి దంపతులు, బోర్డుసభ్యులు, టిటిడి జెఇఓలు సదాభార్గవి, వీరబ్రహ్మం, సివిఎస్ఓ నరసింహాకిశోర్, సిఇ నాగేశ్వరరావు, ఆలయ డిప్యూటీ ఇఓ లోకనాథం, ఆలయ పేష్కార్ శ్రీహరి, అర్చకులు పాల్గొన్నారు.

## సర్వభూపాలునిపై సర్వాంతర్యామి



**తిరుమల,అక్టోబరు 18 ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండలవేంకటేశ్వరునికి అంగరంగవైభవంగా జరుగుతున్న నవరాత్రిబ్రహ్మోత్సవాలలో నాల్గవరోజు బుధవారం రాత్రి ఉభయదేవేరులతో కలసి సర్వ భూపాలవాహనంపై మలయప్పస్వామి భక్తులను కటాక్షించాడు. రాత్రి 7గంటలకు మొదలైన వాహనం ముందు గజరాజులు నడుస్తుండగా భక్తజనబృందాలు కోలాటలు, భజనలు, జీయ్యంగార్ల ఘోష్టితో స్వామివారిని కీర్తించారు. వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి,చిన్న జీయర్‌స్వామి, టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి దంపతులు, టిటిడి ఇఓ ఏవి ధర్మారెడ్డి దంపతులు, టిటిడి జెఇఓలు సదాభార్గవి, వీరబ్రహ్మం, సివిఎస్ఓ నరసింహకిశోర్, అర్చకులు పాల్గొన్నారు.



## నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో తెలంగాణ కళాకారుల ప్రదర్శనలు అద్భుతం

**తిరుమల,అక్టోబరు 18ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో స్వామివారి వాహనసేవల్లో పాల్గొని తమవంతుగా అద్భుత నృత్యాలు చేయడం తమ పూర్వజన్మ సుకృతమని తెలంగాణ రాష్ట్ర కళాకారులు తెలిపారు. స్వామివారి చెంత మాఢవీధుల్లో పలు రకాలూగా కళాకారులు గత నాలుగురోజులుగా స్వామివారికి నాట్యరూపంలో సేవచేసుకునే భాగ్యం కలిగిందన్నారు. తెలంగాణారాష్ట్రం నుండి 11కల్చరల్ బృందాలు 281మంది కళాకారులు వచ్చి గుస్సాడి నృత్యాలు, లంబాడా, చక్కభజనలు, కోలాటాలతో జానపదకళారూపమైన మాథురి నృత్యాన్ని హైదరాబాద్‌కు చెందిన గణేష్ బృందం,వికారాబాద్‌కు చెందిన అశోక్ బృందం గుస్సాడి నృత్యం, ధనశ్రీబృందం స్వామివారికి నీరాజనం సమర్పించుకోవడం ఆనందంగా ఉందన్నారు. జానపద నృత్యాలు, కోలాటలు ప్రత్యేక ఆకర్షణగానిలిచాయి. కళాకారులకు టిటిడిఅందిస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు.



## నిస్వార్థసేవకు నిలువెత్తునిదర్శనం శ్రీవారిసేవకులు

### ఇతరులకు ఆదర్శంగా ఉండాలి: టిటిడి ఛైర్మన్ కరుణాకర్‌రెడ్డి

**తిరుమల, అక్టోబరు 18ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి చెంత తోటి భక్తులకు సేవలందిస్తూ ,నిస్వార్థసేవలకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నారని టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి పేర్కొన్నారు. సనాతన హిందూ ధర్మజ్యోతులుగా శ్రీవారిసేవకులను ఆయన అభివర్ణించారు. తిరుమలలో జరుగుతున్న శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఐదవరోజు (నేడు)గురువారం రాత్రి అత్యంత విశిష్టమైన గరుడసేవకు అశేషంగా వచ్చే భక్తులకు సేవలందించడంపై బుధవారం ఉదయం శ్రీవారి సేవాసదన్-2లో శ్రీవారి సేవకులతో ముచ్చటించారు. టిటిడి పిఆర్ఓ డాక్టర్ తలారి రవి, ఏపి ఆర్ఓ పి.నీలిమ, శ్రీవారి సేవ ఎఇఓ రవికుమార్ రెడ్డితో కలసి శ్రీవారిసేవకులనుద్దేశించి ఛైర్మన్ కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ 23సంవత్సరాల క్రిందట టిటిడి కేవలం 200మంది సేవకులతో శ్రీవారి సేవను ప్రారంభించిందన్నారు. ప్రస్తుతం రోజుకు 2వేలమంది తక్కువగాకుండా సేవకులు భక్తులకు సేవలందిస్తున్నారని తెలిపారు. ఇప్పటివరకు సుమారు 14లక్షలమంది శ్రీవారి సేవకులు తిరుమల,తిరుపతిలో భక్తులకు సేవలందించారని అన్నారు.

శ్రీవారి భక్తులకు సేవచేస్తూ స్వామివారి కీర్తిని దేశవ్యాప్తంగా ప్రచారం చేస్తున్న సేవకులు ధన్యులన్నారు. నిస్వార్థసేవలను కొనసాగించాలని, స్వచ్ఛంద సేవలో ఇతరులకు ఆదర్శంగా నిలవాలని కోరారు. అనంతరం గరుడసేవకోసం ఆలయం లోపల సేవచేసేందుకు సేవకులకు ఎలక్ట్రానిక్ డిప్‌ద్వారా కేటాయించారు.

# కృష్ణాజలాలపై పునఃసమీక్ష చేస్తే నష్టం 'సీమ'కే

## నిమ్మకు నీరెత్తినట్టు జగన్‌సర్కార్ వ్యవహరిస్తోంది

## మీడియాతో టిడిపి ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి



**అమరావతి, అక్టోబర్ 18, ప్రభాతవార్త ప్రతినిధి:** సాగునీటి రంగంలో జగన్‌రెడ్డి అనుసరిస్తున్న అస్తవ్యస్థ విధానాలు, అనాలోచిత నిర్ణయాలతో రాయలసీమ ప్రాంతం శాశ్వత ఎడారిగా మారబోతోందని టిడిపి ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. ఎపి విభజనతర్వాత కృష్ణా నదీ జలాలను ఎపికి 512 టిఎంసిలు, తెలంగాణకు 299 టిఎంసిల చొప్పున కేటాయించారని, దాని ప్రకారమే ఇన్నాళ్లుగా ఉభయ తెలుగు రాష్ట్రాలు నీటిని వినియోగించు కుంటున్నాయని, కానీ తాజాగా తెలంగాణ ప్రభుత్వం నీటి కేటాయింపులపై కొత్తవాదన చేయటంతో, కేంద్రప్రభుత్వం దిగొచ్చి కృష్ణా జలాల కేటాయింపుల్ని పునఃపరిశీలన చేయాల్సిందిగా బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌ను ఆదేశించిందని ఆయన గుర్తుచేశారు.. బుధవారం టిడిపి జాతీయ కార్యాలయంలో రామ్‌గోపాల్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. తెలంగాణ వాదనపై కేంద్రం స్పందించి కృష్ణా జలాల వినియోగంపై పునఃసమీక్ష చేయాలని బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌ను ఆదేశించినా, జగన్ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించటం దేనికి సంకేతం? అంటూ నిలదీశారు. కేంద్ర నిర్ణయంతో కృష్ణా జలాలనే నమ్ముకున్న రాయలసీమ ప్రాంతానికి అన్యాయం జరగుతున్నా, తనకు రాజకీయ జన్మనిచ్చిన ప్రాంతం మొత్తం ఎడారిగా మారే పరిస్థితులున్నా సిఎం మౌనంగా ఉండటాన్ని ఏమనాలి అని ప్రశ్నించారు. ప్రతిపక్షనేత చంద్రబాబును అక్రమ కేసులతో వేధించటంపై పెడుతున్న శ్రద్ధలో సగం కూడా, సిఎం సొంత ప్రాంత సాగునీటి ప్రయోజనాలపై పెట్టటం లేదని విమర్శించారు.

తెలంగాణ ప్రభుత్వం పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నుంచి 6రకాల అనుమతులు పొందే వరకు సిఎం జగన్ నిద్రపోయారన్నారు. ఏనాడు తన వాదనను కేంద్రప్రభుత్వంవద్ద ప్రస్తావించలేదన్నారు. ఇదంతా చూస్తుంటే.. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నిర్మాణాన్ని జగన్ స్వాగతిస్తున్నట్టే కన్పిస్తోందన్నారు.. తన స్వప్రయోజనాలకోసం తెలంగాణ ప్రభుత్వంతో అంటకాగుతున్న జగన్,ఏకంగా సీమకే తీరని ద్రోహం చేయటానికి సిద్ధమయ్యారని అన్నారు. కేంద్రం కృష్ణాజలాలవినియోగంపై పునఃసమీక్ష చేయాలన్నపుడు అపెక్స్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయమని అడగలేని దుస్థితిలో జగన్ ఉండటం సిగ్గుచేటన్నారు. నీటి వినియోగంలో తెలంగాణ అనుసరిస్తున్న నియంతృత్వ విధానాలపై గతంలోనే సుప్రీం కోర్టులో ఉన్నకేసుల విచారణలో జగన్ ప్రభుత్వం ఎందుకు జోక్యం చేసుకోలేదన్నారు. పేరుప్రఖ్యాతులున్న న్యాయవాదుల్ని నియమించి, ఎపి వాదనలను సమర్ధవంతంగా న్యాయస్థానాల దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం నాలుగున్నరేళ్లలో జగన్‌రెడ్డి ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ కృష్ణాజలాలపై పునఃసమీక్ష చేస్తే రాష్ట్ర 100 టిఎంసిల కృష్ణానీటిని కోల్పోతుందని, దాని వల్ల తీవ్రంగా నష్టపోయేది రాయలసీమే అన్నారు. రాయలసీమను సస్యశ్యామలం చేస్తానని మాయమాటలు చెప్పిన జగన్, తన స్వప్రయోజనాలకోసం తనకు, తనతండ్రికి రాజకీయ జీవితమిచ్చిన సీమను శాశ్వత ఎడారిగా మార్చేందుకు సిద్ధమయ్యారని రాంగోపాల్ రెడ్డి ధ్వజమెత్తారు. భవిష్యత్ తరాలను నాశనం చేసే దుర్మార్గపు చర్యలకు జగన్ స్వస్తిచెప్పకపోతే, ఆయన రాజకీయ జీవితం శాశ్వతంగా ముగిసిపోతుందని అన్నారు. తెలంగాణ ప్రయోజనాల కోసం రాష్ట్రాన్ని నాశనం చేయటానికి సిద్ధమైన జగన్‌రెడ్డికి ప్రజలు ఎన్నికల్లో కోలుకోలేని విధంగా బుద్ధిచెబుతారని ఆయన హెచ్చరించారు.

# పుంగనూరు అభివృద్ధికి నా జీవితం అంకితం

## -భూగర్భగనుల శాఖా మంత్రి పెద్దిరెడ్డి



ఏరియావైద్యశాలను ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

**పుంగనూరు,అక్టోబరు 18 ప్రభాతవార్త :** నియోజకవర్గ ప్రజలకు సదుపాయాలు, సౌకర్యాలు కల్పించడానికి తన జీవితాన్ని అంకితం చేశానని, రాష్ట్ర స్థాయిలో పుంగనూరును ఆదర్శంగా తీర్చిదిద్దుతానని,రాష్ట్ర అటవీ,ఇంధన, భూగర్భగనుల శాఖామంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టంచేశారు. బుధవారం ఉదయం ఆయన పట్టణంలో రూ.5.50కోట్ల నాబార్డు నిధులతో నిర్మించిన ఏరియా వైద్యశాలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తరాల తరబడి పుంగనూరు ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదని, దివంగత వైఎస్సార్ సిఎంగా ఉన్నపుడు తనకు లభించిన ఏడాదిన్నర సమయంలోనే మంత్రిగా అనేక సదుపాయాలు కల్పించానన్నారు. ఆతరువాత కిరణ్ కుమార్, చంద్రబాబుల పాలనలో పదేళ్ల పుంగనూరు నియోజకవర్గప్రజలకు రూపాయి కూడా అభివృద్ధికి ఇవ్వకపోగా తనపైఉన్న రాజకీయకక్ష్యను,ప్రజల మీద తీర్చుకున్నారన్నారు. అందుకే ఇపుడు పుంగనూరు నియోజకవర్గానికి రెట్టింపుగా అభివృద్ధి అందిస్తున్నానని వివరించారు. మరో 33.52కోట్లతో ఏరియావైద్యశాలకు మరిన్నిసదుపాయాలు కల్పించి వెంటనే వైద్యసౌకర్యాలు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఎంపి మిధున్‌రెడ్డి మాట్లాడుతూ తన తండ్రి ఎపుడూ పుంగనూరు ఉన్నతి కోసం తనమీద కూడా ఒత్తిడి తెస్తుంటారన్నారు. బైపాస్, ఆర్టీసిడిపో, ఉపరవాణాశాఖ, ఏరియావైద్యశాల వంటి సదుపాయాల కల్పించామన్నారు. దీంతో పాటూ ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు ముమ్మర యత్నాలు సాగుతున్నాయన్నారు. అత్యవసర వైద్యం కోసం తిరుపతి, బెంగళూరులకు వెళ్ళే పరిస్థితి ఇపుడు పుంగనూరు ప్రాంతానికి ఉండబోదన్నారు. ముఖ్యమంత్రి చొరవతో పుంగనూరులో 1100 ఎకరాలు ఎకనమిక్‌జోన్ ఏర్పాటయిందన్నారు.

# మహిళా సంక్షేమం, భద్రతను గాలికొదిలేసిన ప్రభుత్వం



- వైఎస్సార్సీ పాలనలో మహిళలపై లక్షా22 వేలకు పైగా నేరాలు
- రాష్ట్రంలో ప్రతి 8 గంటలకు ఒక అత్యాచారం, ఇద్దరు మహిళలపై లైంగిక వేధింపులు
- నాలుగున్నరేళ్లలో 30,196 మంది మహిళలు, చిన్నారుల అదృశ్యం
- ఎక్కడ దిశాచట్టం, ఏదీ దిశా యాప్?
- మీడియాతో టిడిపి ఎమ్మెల్సీ అనురాధ

**అమరావతి, అక్టోబరు18, ప్రభాతవార్త ప్రతినిధి:** మహిళా సంక్షేమం, భద్రతను గాలికొదిలేసి సమీక్షలతో సిఎం జగన్ కాలక్షేపం వల్ల ఒనగూరే ప్రయోజనమేంటి అనేది సిఎం జగన్‌కే తెలియాలని టిడిపి ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ అన్నారు.. తమపార్టీ అధినేత చంద్రబాబు మహిళా సంక్షేమం, భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వగా, నేటి సిఎం జగన్ వాటిని గాలికొదిలేశారని దుయ్యబట్టారు. నా అక్కచెల్లెమ్మలు, నా ఆడబిడ్డలు అంటూ సిఎంచెప్పే తియ్యటి మాటలకు, వాస్తవానికి ఎంత తేడా ఉందో రాష్ట్రంలో మహిళలపై అతా ్యచారాలు, అకృత్యాలే సాక్ష్యమన్నారు.. వైఎస్సార్సీ పాలనలో మహిళలపై లక్ష22 వేలకు పైగా జరిగిన నేరాలపై సమాధానం చెప్పే దమ్ము సిఎంకు ఉందా? అని నిలదీశారు.. నాలుగేళ్లలో జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని అత్యాచారాంధ్ర ప్రదేశ్‌గామార్చేశారన్నారు. రాష్ట్రంలో ప్రతి 8 గంటలకు ఒక అత్యాచారం, 8ఏళ్లలోపు చిన్నారులపై ప్రతి 12 గంటలకు ఒక రేప్, వారానికి సగటున నలుగురు ఎస్సీ, ఎస్టీ మహిళలపై అత్యాచారం, ప్రతి గంటకు ఇద్దరు మహిళలపై లైంగిక వేధింపులు జరుగుతున్నాయంటే అందకు జగన్ రెడ్డి పాలనా వైఫల్యమే కారణమని అన్నారు. దేశవ్యాప్తంగా మహిళలపై జరిగే నేరాల్లో 3వ వంతు ఆంధ్రప్రదేశ్ లోనే జరుగుతున్నాయంటే రాష్ట్రంలో శాంతిభద్రతలు ఎక్కడున్నట్టు అని ప్రశ్నించారు.

నాలుగేళ్ల వైఎస్సార్సీ పాలనలో 30,196 మంది మహిళలు, చిన్నారులు అదృశ్యమయ్యారంటే జగన్ రెడ్డి ఏం సమాధానం చెప్తారని నిలదీశారు.. దిశా చట్టం, దిశా యాప్ ఎక్కడా? అనిప్రశ్నించారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే లెక్కల ప్రకారం రాష్ట్రంలో 15నుంచి 19 ఏళ్ల మధ్య ఉన్న 12.6 శాతం బాలికలు గర్భందాల్చుతున్నారని, ఈ దారుణాల్లో దేశంలోనే ఎపి మూడవ స్థానంలో ఉందన్నారు. ఇండియా టుడే సర్వే ప్రకారం ఎపిలో 1,33,447 మంది వ్యభిచారకూపంలో చిక్కుకున్నారని తెలిపారు. ఈ అమానుషాల్లో ఎపి దేశంలోనే రెండోస్థానంలో ఉందన్నారు. నాలుగేళ్లలో 30,196 మంది మహిళలు, చిన్నారులు అదృశ్యమయ్యారని పార్లమెంట్ సాక్షిగా వెల్లడి కావటం సగ్గుచేటన్నారు.. పాలనను గాలికొదిలేసి రాజకీయ లబ్దికోసం ప్రత్యర్థుల గొంతునొక్కే పనిలో జగన్‌రెడ్డి బిజీగా ఉండటం వల్లే రాష్ట్రంలో భయానక పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఆడబిడ్డకు కష్టమొస్తే గన్‌కంటేముందు జగన్‌వస్తారన్న మహిళా మంత్రులు అత్యాచారాలు, మిస్సింగ్ ఘటనలపై ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు.. ఎపిలో 1,33,447 మంది వ్యభిచార కూపంలో చిక్కుకోవటం జగన్‌రెడ్డి శాంతి భద్రతల వైఫల్యం కాదా? అని ప్రశ్నించారు.. చంద్రబాబు పాలనలో ఆడబిడ్డగా పుట్టటం అదృష్టంగా భావిస్తే .. జగన్ రెడ్డి పాలనలో ఆడబిడ్డగా పుట్టటం కంటే అడవిలో మానై పుట్టటం నయమంటున్నారని అన్నారు.. నాశిరకం మద్యంతో మహిళల మాంగల్యాలు తెంచుతున్నారని దుయ్యబట్టారు.. నిత్యావసర వస్తువుల ధరలు పెంచి గృహిణుల ఆర్థిక స్థితి గతులపై దెబ్బకొట్టారని అనురాధ మండిపడ్డారు.. వైకాపా ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించిన సంపూర్ణ పోషణ పథకం, ..జగన్‌రెడ్డి పురుగుల పథకంగా మార్చేశారన్నారు.. పాము కళేబరం ఉన్న ఆహారాన్ని గర్భిణిలు, బాలింతలు చిన్నారులకు పంపిణీ చేయటమనేది మహిళా సంక్షేమంపై జగన్‌రెడ్డి చిత్తశుద్ధికి నిదర్శనంగా నిలుస్తోందన్నారు.

టిడిపి హయాంలో విజయవంతంగా అమలుచేసిన బాలామృతం, ఫుడ్ బాస్కెట్, గిరి గోరుముద్దలు, వంటి పథకాలన్నింటినీ సమీకృతం చేసిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ పేరుతో హడావుడి చేస్తున్న జగన్‌రెడ్డి పథకం అమలును మాత్రం గాలికొదిలేశారన్నారు. కుళ్లిన గుడ్లు, ముతక బియ్యం, పురుగులు చిక్కీలు పంపిణీ చేయటమే జగన్‌రెడ్డి చెబుతున్న సంక్షేమం ...అంటూ అనురాధ ఎద్దేవా చేశారు.

# కూష్మాండ అలంకారంలో ఆకట్టుకున్న దుర్గమ్మ

## కిటకిటలాడుతున్న కనకాచలం



**శ్రీకాళహస్తి, అక్టోబరు 18 ప్రభాతవార్త:** తిరుపతిజిల్లా శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో దసరా నవరాత్రి ఉత్సవాలు కన్నుల పండువగా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఆలయానికి అనుబంధంగా ఉన్న కనకాచలంపై వెలసిన దుర్గమ్మ ఆలయంలో మూలవిరాట్టుకు 'కూష్మాండదేవి అలంకారం' ఆకట్టుకుంది. దసరా ఉత్సవాలను అమ్మవారి ఆలయంతో పాటు ఆలయంలో వెలసిన బెజవాడ కనకదుర్గమ్మ ఆలయం వద్ద పూజలు, అలంకారాలు నిర్వహించారు. కాగా దేవేరి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారికి ప్రతి రోజూ బంగారు చీరతో అలంకారం నిర్వహించారు. ఇక అనుబంధ ఆలయం అయిన కనకాచలంపై వెలసిన దుర్గమ్మ ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్టుకు మహాలక్ష్మి అలంకారం నిర్వహించారు. ఈ అలంకారం మహిళా భక్తులను ఆకట్టుకుంది.ఇక ఉదయం 5 గంటల నుంచే కొండపై భక్తులు విశేష సంఖ్యలో హాజరై అమ్మవారికి దీపారాధన చేస్తున్నారు. ఇక కొందరు మహిళాభక్తులు మొక్కులు తీర్చుకొనుటకు పొంగళ్ళను నిర్వహించారు. ఇక ముత్యాలమ్మ ఆలయంలో వెలసిన మూలవిరాట్టుకు, ఏడుగంగమ్మల ఆలయంలో అమ్మవారికి 'కుష్మాండ అలంకారం' నిర్వహించారు. ఈ ఆలయాలకు మహిళా భక్తులు తండోపతండాలుగా హాజరై పూజలు నిర్వహిస్తున్నారు.ఈ ఆలయాల్లో శ్రీకాళహస్తీశ్వరాయం ప్రత్యేక ఏర్పాట్లు చేసారు. ప్రతి రోజూ ఉదయం సాయంత్రం మూల విరాట్టుకు ప్రత్యేకాలంకారాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఆలయానికి విశేష సంఖ్యలో మహిళా భక్తులు హాజరౌతారని భావించిన శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆలయాధికారులతో సమీక్షించారు. చిన్న ఆలయాల పర్యవేక్షకులు లక్ష్మయ్య,దుర్గాప్రసాద్‌లకు సూచనలు చేస్తూ వచ్చిన భక్తుల మనోభావాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని అలాగే ప్రసాదాలు పుష్కలంగా ఏర్పాటు చేయాలని సూచించారు.

**భవాని మాతలతో ఆలయాలు కళ కళ:**

శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో ఈ ఏడాది భవాని మాల ధరించిన మహిళలు, పురుషుల సంఖ్య గణనీయంగా పెరిగింది. మాలధరించిన వారు వేకువ జామున స్నానమాచరించి పట్టణ నడిబొడ్డులోని కనకాచలంపై వెలసిన కనక దుర్గమ్మ, ముత్యాలమ్మగుడివీధిలోని ముత్యాలమ్మ,ఏడుగంగమ్మల ఆలయంలో దర్శనానికి వస్తున్నారు.అంతేకాక శ్రీకాలహస్తీశ్వరాలయంలోకూడా ఉదయం 7గంటల వరకు స్థానికులకు దర్శనాలకు అనుమతిస్తారు కాబట్టి ఆలయంలో కూడా మహిళా భక్తుల సంఖ్య గణనీయంగా కనబడుతుంది.



## మొల్లరామాయణం, విష్ణుపురాణం గ్రంథాలు ఆవిష్కరణ

**తిరుమల,అక్టోబరు 18ప్రభాతవార్తప్రతినిధి:** రామాయణంలో ధర్మస్వరూపుడైన శ్రీరామ చంద్రుడు ఈ సమాజంలో ఎలాజీవించాలో తను స్వయంగా ఆచరించి చూపి ఆదర్శప్రాయుడైనాడు. వాల్మీకి మహర్షి విరజిత శ్రీమద్రామాయణాన్ని భారతీయ భాషల్లో అనేకమంది అనువదించుకున్నారు. తమతమ ప్రాంతాలకు ప్రాతినిధ్యాన్ని కల్పిస్తూ చాలామంది రామకథను తయారు యాస, భాషలలో రాసుకున్నారు. మొల్లరామాయణాన్ని ఆచార్య కె.మలయవాసిని పరిమళ వ్యాఖ్యానంతో టిటిడి భక్తులకు అందుబాటులోకి తెచ్చింది. అలాగే వేదవ్యాసమహర్షి విరదసి అష్టాదశపురాణాల్లో ఒకటైన విష్ణుపురాణం. శ్రీహరి తనకు ప్రధానంగా మూడు గురుతల బాధ్యతలు ఉన్నట్లు గీతలో తెలియజేశాడు. త్రిమూర్త్యాత్మక స్వరూపుడు శ్రీహరి అని అతడే సర్వోత్తముడని తెలియజేస్తోంది. ఈ రెండు గ్రంథాలను బుధవారం ఉదయం కల్ప వృక్ష వాహనసేవలో టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి దంపతులు, టిటిడి ఇఓ ఏవి ధర్మా రెడ్డి దంపతులు, జెఇఓలు సదాభార్గవి, వీరబ్రహ్మం, ఢిల్లీ స్థానిక సలహామండలి ఛైర్మన్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆవిష్కరించారు.



బుధవారం ఉన్నతవిద్యామండలి ఛైర్మన్‌కు వినతిపత్రం అందజేసిన టిఎన్ఎస్ఎఫ్ నాయకులు

## ఎంసెట్ 3వ విడత కౌన్సెలింగ్‌ను రద్దుచేసి విద్యార్థులకు తీరని ద్రోహం

### వెంటనే కౌన్సెలింగ్ కోరుతూ టిఎన్ఎస్ఎఫ్ నిరసన

**అమరావతి, అక్టోబరు 18, ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ఎంసెట్ 3వ విడత కౌన్సెలింగ్ నిర్వహణపై ప్రభుత్వం ఉదాసీన వైఖరి అవలంభిస్తోందని, అందుకు నిరసనగా జోన్-3 పరిధిలోని పార్లమెంట్ టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు బుధవారం రాష్ట్ర ఉన్నత విదా ్య మండలి ఛైర్మన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఎంసెట్ 3వ విడత కౌన్సెలింగ్‌ను తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేశారు..ఈ మేరకు ఉన్నత విద్యా ఛైర్మన్ హేమచంద్రరెడ్డికి వినతి పత్రం అందజేశారు.. ఈసందర్భంగా నాయకులు మాట్లాడారు.. ఇంజనీరింగ్ ప్రవేశాలకు సంబంధించి రాష్ట్రంనుంచి ఏటా లక్షలాది మంది ఎంసెట్ రాస్తుంటారని గుర్తుచేశారు. ఇప్పటివరకు ఏటా3 విడతల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తుండగా, ఈ ఏడాది అర్ధాంతరంగా రెండు కౌన్సెలింగ్‌లకే పరిమితం చేయటం బాధాకరమని అన్నారు. ఈ విషయం తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌సిఎం జగన్‌కు లేఖ కూడ రాశారని గుర్తుచేశారు. పద్ధతిగా జరగాల్సిన 3వ విడత కౌన్సెలింగ్‌ను రద్దుచేసి విద్యార్థులకు తీరని ద్రోహం చేశారని మండిపడ్డారు. మంత్రి బొత్స సత్యనారాయణ కౌన్సెలింగ్ డేట్ ఇస్తామని విద్యార్థులకు హామీ ఇచ్చి మోసగించారన్నారు.. రాష్ట్రంలోఇప్పటి వరకు ప్రతి ఏటా మూడువిడతల కౌన్సెలింగ్ నిర్వహిస్తుండగా, ఈ ఏడాది రెండు విడతలకే పరిమితం చేయటం వెనుక ఆంతర్యం ఏంటో ప్రభుత్వం సమాధానం చెప్పాల్సి ఉంద న్నారు.. స్పాట్ అడ్మిషన్లు అయితే ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించక్కర్లేదని, కౌన్సెలింగ్ సీట్లయితే చెల్లించాల్సి వస్తుందనే కుతంత్రంతోనే ఏకంగా 3వ విడత కౌన్సెలింగ్‌ను రద్దు చేయటం అన్యాయమని అన్నారు.. స్పాట్ అడ్మిషన్లు, కన్వీనర్ కోటాలో సిఎస్ఇ సీట్లన్నీ అమ్ముకునేందుకు సర్కారు విద్యార్థులజీవితాలతో ఆడుకుంటోందని ఎద్దేవా చేశారు.

# మిద్దె తోటల్ని ప్రోత్సహిస్తోన్న జ్యోతి



ఆరోగ్యాన్ని అందించే 'నల్ల బంగారా'న్ని పండిస్తున్నారామె. తనని అనారోగ్యం నుంచి బయటపడేసిన ఆ 'ఆహార మంత్రాన్ని' రైతులకూ, ప్రజలకు పరిచయం చేయాలనే సంకల్పంతో పనిచేస్తున్నారు. 16 ఎకరాల్లో వానపాముల్ని సాగుచేస్తూ.. రైతులు, మిద్దెతోట పెంపకందార్లు సేంద్రియ బాట పట్టేలా చేస్తున్నారు హైదరాబాద్‌కి చెందిన గుత్తా జ్యోతి వెంకటరెడ్డి. ఆ విశేషాలను తెలుసుకుందాం..

మాది వ్యవసాయ కుటుంబం నల్గొండలోని గుర్రపల్లి మా సొంతూరు. టీచర్ కావాలని బిఇడి చదివా. కానీ నాన్న చనిపోవడంతో.. ఆ కల నెరవేరలేదు. హైదరాబాద్‌కి చెందిన వెంకటరెడ్డితో నా వివాహం అయ్యింది. ఆయన వ్యాపారవేత్త. ఇద్దరు పిల్లలు, జీవితం అలాగే సాగిపోయి ఉంటే నేనిలా వ్యవసాయ వ్యాపారవేత్తని అయి ఉండేదాన్ని కాదేమో. మా వారికి వ్యాపారంలో వరుసగా నష్టాలు పలకరించాయి. దాన్నుంచి బయటపడటానికి డెయిరీఫామ్‌ని మొదలుపెట్టారు. సరైన అవగాహన లేక దాంట్లోనూ నష్టాలే. దాంతో నేను చీరల వ్యాపారం మొదలుపెట్టా. కాస్త ఫరవాలేదు అనుకొనే సమయానికి మరో దెబ్బ. నన్ను అనారోగ్యం కుదిపేసింది. పెద్ద పేగులో గడ్డ ఏర్పడిందన్నారు వైద్యులు. ఆపరేషన్ చేసి తొలగించారు. కానీ కలుషిత ఆహారానికి దూరంగా ఉండమన్నారు. దాంతో ఆరు నెలలు డాక్టర్లు చెప్పినట్టుగా మందులు వేయకుండా మేం సొంతంగా పండించిన ఆహారమే తిని ఏడాదికల్లా కోలుకున్నా. అంత త్వరగా కోలుకోవడం చూసి డాక్టర్లే ఆశ్చర్యపోయారు. అప్పుడు వచ్చిన ఆలోచనే వర్మీకంపోస్ట్ తయారీ.

**భూమి కలుషితం కాకుండా...** ఒకప్పుడు కేన్సర్ నూటికో కోటికో ఒకరికి వచ్చేది. అలాంటిది ఎవరి నోట విన్నా అదే మాట. దీనికి కలుషిత ఆహారం కూడా కారణమే అనిపించింది. అందుకే సమస్య ఎక్కడుందో మందు అక్కడే వేయాలనుకున్నా. భూమి కలుషితం కాకుండా, సేంద్రియ ఎరువుని తయారు చేసి రైతులకి అందించాలనుకున్నా. మాది వ్యవసాయ కుటుంబం కావడంతో కొంత అవగాహన ఉంది. దీనికి తోడు కొంత మంది శాస్త్రవేత్తలతోనూ మాట్లాడాను. వర్మీకంపోస్ట్‌తో భూమికీ, పంటకీ కూడా లాభం. అందుకే పెద్ద అంబర్‌పేట్‌లో 3.5 ఎకరాలు లీజుకి తీసుకుని వానపాముల పెంపకం చేపట్టా. మొదట్లో సరైన అవగాహన లేక పక్షులు వాటిని తినేసేవి. వాతావరణ మార్పులకీ వానపాములు చనిపోయేవి. దీనికి తోడు చుట్టాలు, ఇరుగు పొరుగువాళ్లు 'ఇంత చదువుకున్నావ్ పెంటతో వ్యాపారం ఏంటి' అనేవారు. ఇక ఆపేద్దామనుకున్నా. మావారు ధైర్యం చెప్పడంతో మరిన్ని జాగ్రత్తలు తీసుకుని ముందుకెళ్లా. వానపాములు పెరిగే బెడ్స్‌ని పూర్తి నీడలో ఉంచి, పక్షులు రాకుండా షెడ్‌లు, నెట్ వేశా. నల్లబంగారం లాంటి వర్మీకంపోస్ట్ కోసం 60 రోజులు ఓపిగ్గా ఎదురుచూడాలి.

మొదట్లో రైతుల్లో అవగాహన పెంచడానికి చాలా సమయం పట్టింది. కోవిడ్ తర్వాత ప్రజల్లో అవగాహన పెరిగి వాళ్లే మా దగ్గరకు రావడం మొదలుపెట్టారు. రైతులు, మిద్దెతోటలు పెంచేవాళ్లు, గృహిణులు మా ఉత్పత్తులని ప్రత్యేకంగా అడుగుతున్నారు. దాంతో వాళ్ల కోసం వేపపిండి, కోకోపీట్, పాట్‌మిక్స్, ఎర్రమట్టి, జీవామృతం తయారుచేస్తున్నా. వానపాముల్నీ విడిగా అమ్ముతాం. 12 యేళ్ల క్రితం మొదలైన ఈ వ్యాపారం ఇప్పుడు ఆదిభట్ల, పెద్దఅంబర్‌పేట్, తారామతిపేట్, నాదర్‌గుల్ ప్రాంతాలకు విస్తరించింది. 16 ఎకరాల్లో సాగుచేస్తున్నాం. ఈ ఉత్పత్తులను విదేశాలకూ పంపే ఏర్పాట్లు చేస్తున్నాం. 40 మంది ఉపాధి పొందుతున్నారు. నెలకి అన్ని ఖర్చులు పోను రూ.2 నుంచి 3 లక్షల వరకు ఆదాయం వస్తోంది. నేను చేస్తున్న సేంద్రియ ఎరువుల తయారీని సోషల్ మీడియాలో చూసిన తెలంగాణ అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఎ.ఇంద్రకరణ్‌రెడ్డి తన ఇంటికి పిలిచి మరీ ప్రశంసించడం సంతోషంగా అనిపించింది. రైతులందరూ రసాయనాలకు దూరంగా సేంద్రియం బాట పట్టాలన్నదే నా లక్ష్యం.

## నేటి అలంకరణ

# శ్రీ మహా చండీ దేవి



"హ్రీంకారాసన గర్భితా నలశిఖాం సౌఃక్లీం కళాంబిభ్రతీం
సౌవర్ణాంబరధారిణీం వరసుధాధౌతాం త్రినేత్రోజ్జ్వలాం
వందే పుస్తకపాశమంకుశ ధరాం స్రగ్భూషితాముజ్జ్వలాం
త్వాం గౌరీం త్రిపురాం పరాత్పర కళాం శ్రీచక్రసంచారిణీం!!"

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో 5వ రోజు శ్రీ మహా చండీదేవిగా బెజవాడ దుర్గమ్మ భక్తులకు దర్శనమీయనుంది. సాధారణంగా అమ్మను పట్టువస్త్రాలతో అలంకరిస్తారు. కానీ ఈ అవతారంలో అమ్మవారి అలంకారం పూర్తిగా వస్త్రాలతో సహా స్వర్ణమయమై ఉంటుంది. విజయవాటిక (ప్రస్తుతం విజయవాడ)ను పరిపాలించిన మాధవవర్మ అనే రాజు ధర్మనిరతికి మెచ్చిన అమ్మవారు విజయవాడలో కనకవర్షం కురిపించింది. అందుకు గుర్తుగా ఆనాటి నుండి దసరా ఉత్సవాలలో మొదటి రోజున అమ్మవారిని స్వర్ణకవచంతో అలంకరించడం ఆనవాయితిగా వచ్చింది. ఈ అవతారంలో అమ్మవారి దర్శనం సకల పాపాలను పోగొట్టి, లౌకిక సంపదలు చేకూరుస్తుంది.

**అలంకారం :** అమ్మవారికి అలంకరించే పట్టుచీర బంగారు వర్ణంతో జరీ అంచు కలిగి స్వర్ణకాంతులతో ధగధగలాడుతుంది.

**మంత్రం :** "ఓం హ్రీం శ్రీం క్లీం మహాచండికాయై నమః" అనే మంత్రాన్ని 108 సార్లు జపించాలి. ఎరుపు, పసుపు రంగు పూలతో అమ్మవారిని పూజించాలి.

**నైవేద్యం :** అమ్మవారికి పులిహోర, పొంగలి నివేదన చేయాలి.

-భట్టిప్రోలు నటరాజకుమార్, ప్రభాతవార్త, విజయవాడ

# నేడు అలిగిన బతుకమ్మ



బతుకమ్మ సంబురాల్లో ఆరవ రోజు తంగేడు, గునుగు, బంతి, చేమంతి తదితర పూలను ఆరు వరుసఎత్తుల్లో పేర్చి, గౌరమ్మను వాటిపై పెడతారు. అలిగిన బతుకమ్మగా ఆడరు.

# ఆకట్టుకునే దాండియా స్టిక్స్



బతుకమ్మ, దసరా అంటేనే దాండియా, గర్బా నృత్యాల కోలాహలం! ఈ నవరాత్రులూ యువతులు, మహిళలు 'దాండియా ఆటలు ఆడ.. సరదా పాటలు పాడ..' అంటూ తమ ఆటపాటలతో అమ్మవారిని ప్రసన్నం చేసుకుంటుంటారు. అయితే ఈ సరదా ఆటల్లో దాండియా స్టిక్స్ ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంటాయి. ఎందుకంటే చాలామంది అమ్మాయిలు సాధారణ కోలలతో పాటు వివిధ రకాలుగా అలంకరించిన దాండియా స్టిక్స్‌ని ఎంచుకోవడానికి ఆసక్తి చూపుతుంటారు. వారి అభిరుచులకు తగినట్లుగానే ఏటికేడు ఆకర్షణీయంగా ముస్తాబై అతివల మనసు దోచుకుంటుంటాయివి.















# సగ్గు బియ్యంతో వడలు..

సగ్గు బియ్యంతో స్పెషల్‌గా..

రోజూ బ్రేక్‌ఫాస్ట్‌లో ఉల్లి దోశ, సాంబారు ఇడ్లీ అంటే ఎవరికైనా బోర్ కొడుతుంది. అందుకే ఈ సారి సగ్గుబియ్యంతో వడలు వేసుకోండి. సాబుదానా బోండాలను ఒకసారి రుచి చూస్తే మీ బ్రేక్‌ఫాస్ట్ మెనూలో అవి రెగ్యులర్ అయిపోతాయి. ఇంకా సగ్గుబియ్యంతో దోశలు, థాలీ పీట్, పాపడ్ వంటివి చేసుకోవచ్చు. వాటి తయారీ విశేషాలు తెలుసుకుందాం..

**కావలసినవి:** సగ్గుబియ్యం-ఒకటిన్నర కప్పు, బంగాళదుంపలు-రెండు, పంచదార-అర టీస్పూన్, పల్లీలు-ముప్పావు కప్పు, పచ్చిమిర్చి-మూడు, కొత్తిమీర- ఒక కట్ట, నిమ్మరసం-అర టేబుల్‌స్పూన్, ఉప్పు-రుచికితగినంత, నూనె-డీప్ ఫ్రైకి సరిపడా.

**తయారీ విధానం :** సగ్గుబియ్యాన్ని కడిగి పావు కప్పు నీళ్లు పోసి మూత పెట్టి రెండు గంటలపాటు పక్కన పెట్టుకోవాలి. బంగాళదుంపలను మెత్తగా ఉడికించుకుని పొట్టు తీసేసి ఒక బౌల్‌లోకి తీసుకోవాలి. పల్లీలు వేయించి పొడి చేసుకోవాలి. ఇప్పుడు బంగాళదుంపల బౌల్‌లో సగ్గుబియ్యం, పల్లీల పొడి, పచ్చిమిర్చి, కొత్తిమీర, నిమ్మరసం, పంచదార, తగినంత ఉప్పువేసి కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని కొద్ది కొద్దిగా తీసుకుంటూ వడలుగా ఒత్తుకోవాలి. తరువాత కొద్దిసేపు వాటిని ఫ్రిజ్‌లో పెట్టుకోవాలి. స్టవ్‌పై కడాయి పెట్టి నూనె పోసి వేడి అయ్యాక వడలు వేసి వేయించాలి. ఏదైనా చట్నీతో సర్వ్ చేసుకోవాలి. ❑

# సువాసనల కురులు

చాలా మందిలో తల స్నానం చేసిన మరుసటి రోజే జుట్టు కళావిహీనమవుతుంది. లేదా జిడ్డుగా తయారవుతుంది. దీనికి చుండ్రూ తోడైతే ఒకలాంటి వాసన. ఆరోగ్యంగా కనిపించడంతోపాటు తల సువాసనలూ వెదజల్లాలా? అయితే వీటిని ప్రయత్నించేయండి.



**మల్లె..** అరకప్పు గులాబీ నీటికి నాలుగు చుక్కలు వెనీలా ఎక్స్‌ట్రాక్స్, రెండు టేబుల్ స్పూన్ల గ్రేప్‌సీడ్ అయిల్, పది చుక్కలు జాస్మిన్ ఎసెన్షియల్ ఆయిల్ కలపాలి. ఈ మిశ్రమాన్ని సన్నమంట మీద కొద్దిగా వేడిచేయాలి. చల్లారాక స్ప్రే బాటిల్‌లో పోస్తే సరి. తలస్నానం చేసి, జుట్టు ఆరబెట్టుకున్నాక దీన్ని తలంతా స్ప్రే చేసుకోవాలి. తేలిగ్గా మాడుమీద ఇంకడమే కాదు. జిడ్డూ ఉండదు. పైగా వెంట్రుకలకు తేమనందించి మెరిసేలానూ చేస్తుంది.

**గులాబీ...** కప్పున్నర గులాబీ నీటికి కొన్ని చుక్కలు చొప్పున మల్లె, నారింజ నూనెల్నికలపాలి. దీన్నో స్ప్రే బాటిల్‌లో పోసుకుంటే సరి. తలస్నానం చేసి నీరు కారడం ఆగాక తల, వెంట్రుకలకు దీన్ని స్ప్రే చేసుకుంటే చాలు. ఉండ్రు, జిడ్డులను దూరం చేస్తుందిది. చిక్కులు తేలిగ్గా వీడేలా చేయడంతపాటు వెంట్రుకలు మెరవడంలోనూ సాయం చేస్తుంది.

**కలబందతో...** కప్పు నీటికి పావు కప్పు అలొవెరా గురజ్జు, టేబుల్ స్పూను కొబ్బరి నూనె జోడించి బాగా కలపాలి. దీన్ని తలస్నానం చేశాక స్ప్రే చేసుకుంటే. మాడుపై మృతకణాలను తొలగించడంలో సాయపడుతుంది. దురద, అలర్జీలను దూరం చేయడంతోపాటు కురులు వేగంగా పెరిగేలా, మృదువుగానూ ఉండేలా చేస్తుంది. ❑

# వారిలో నైపుణ్యాలను పెంచండి..



చిన్నారుల్లో బాల్యం నుంచి సృజనాత్మకత పెంచడానికి ప్రయత్నించాలంటున్నారు నిపుణులు. ఇదేవారిని వివిధ రంగాల్లో నైపుణ్యాలను పెంచుకునేలా చేస్తుందని చెబుతున్నారు.

పిల్లల గది గోడలకు అంతరిక్షం, రకరకాల జంతువుల బొమ్మల పోస్టర్లు వంటివి ఉండేలా ఏర్పాటు చేయాలి. ఇవి వారిలో అన్వేషణ తరహా ఆలోచన మొదలయ్యేలా చేస్తాయి. తెలియని విషయాలను తెలుసుకోవాలనే ఆత్రుత పెరుగుతుంది. కొత్త విషయాల పట్ల ఆసక్తిని పెరిగేలా చేస్తాయి. క్రమేపీ సృజనాత్మకంగా ఆలోచించడం మొదలు పెడతారు. పిల్లల సందేహాలను తీర్చడానికి పెద్దవాళ్లూ కొత్త విషయాలు తెలుసుకుంటూ ఉండాలి. అప్పుడే చిన్నారుల మెదడుకు కావాల్సిన మేతను అందించగలుగుతారు. **విశ్లేషణ....** హోంవర్క్ చేసే బల్లపై భూగోళం బొమ్మను అమర్చాలి. గది గోడకు అట్లాస్ ఉండాలి. దీంతో భౌగోళికపరంగా వారిలో ఎన్నో ప్రశ్నలు తలెత్తుతాయి. వాటి గురించి తెలుసుకోవా లనే ఆసక్తి వస్తుంది. మనం నివసించే భూమి గురించి అది తన చుట్టూ తాను తిరుగుతూ, సూర్యుడి చుట్టూ తిరగడం వింతగా అనిపిస్తుంది. అట్లాస్‌లో ప్రపంచదేశాలు, ఆయా భాషలు, ప్రాంతాల విశేషాలు వంటివన్నీ రోజుకొకటి చెప్పాలి. అవన్నీ వారికి భూగోళం గురించి తెలుసుకోవాలనే ఆసక్తిని పెంచుతాయి. ప్రతి చిన్న విషయంపై విశ్లేషణ ఇవ్వగలిగితే చాలు. వారి మెదడు చురుకుగా, సృజనాత్మకంగా మారుతుంది.

**కానుకలు...** ప్రత్యేక సందర్భాల్లో చిన్నారులకిచ్చే కానుకలు వారిని ఆలోచింపచేసేలా ఉండాలి. తోటిపిల్లలకు ఇచ్చే కానుకలను పిల్లలతోనే తయారు చేయించాలి. అలా వారి మెదడులో కొత్త డిజైన్ల ఆలోచనలొస్తాయి. దుకాణంలో కొన్న బొమ్మలకన్నా తమ చేత్తో తయారు చేసే వాటిపై పిల్లలకు ఎక్కువ ఆసక్తి పెరుగుతుంది. కాగితం అట్ట, క్లే వంటి వాటితో రకరణాల బొమ్మల ఆలోచనలు అందిస్తే చాలు. ఉత్సాహంగా నేర్చుకుంటారు. అలాగే క్విజ్ పూర్తి చేయడం నేర్పాలి చెస్, క్యారమ్స్ వంటివి వారి మెదడును మరింత చురుకుగా పని చేసేలా సృజనాత్మకతను పెంచుతాయి. ❑

# కౌన్సెలింగే సరైన చికిత్స

## వ్యథ



డాక్టర్ ఎన్.బి.సుధాకర్‌రెడ్డి, సైకాలజిస్టు

మావారికి తాగుడు, వాగుడు ఎక్కువ అయ్యింది. పెళ్ళయిన కొత్తలో ఎప్పుడో ఒకప్పుడు తాగిఇంటికి వచ్చేవారు. పార్టీలనో మిత్రుల బలవంతం వల్ల తాగవలసి వచ్చిందని సాకులు చెప్పేవారు. ఇంకెప్పుడు తాగనని ప్రాథేయ పడేవారు పదేళ్ల తరువాత తిరగబడి మాట్లాడటం ప్రారంభించారు. రోజు తాగి ఇంటికి వచ్చేవారు. అడిగితే ఎదురు తిరిగి ఇష్టం ఉంటే కాపురం చెయ్యి లేకపోతే వదిలెయ్యి అంటూ ఈసడించుకునేవారు. అప్పటికే ఇద్దరు పిల్లలు ఉన్నందువల్ల, వారి మీద ఉన్న వాత్సల్యంతో బాధ్యత గుర్తించి సర్దుకోవడం అలవర్చుకున్నాను. మరో పదేళ్ల గడిచేసరికి ఆయన తీరు అసభ్యకరంగా, అసహ్యంగా మారిపోయింది. తాగి ఇంటికివచ్చి నానా రభస చేస్తారు. భూతులు తిడతారు. ఆయనకు నిద్రవచ్చే వరకు ఏదేదో వాగుతూ ఉంటారు. పిల్లలు పెరిగి పెద్దవారు అయ్యారు. చిన్నప్పుడు భయపడేవారు. ఇప్పుడు ఆయనను పట్టించుకోవడం మానేశారు. మావారి తండ్రి బాగా సంపాదించిపెట్టారు. నెలకు మూడు లక్షలకు పైగా అద్దెలు వస్తాయి. ఊరిలో పొలాలు, మామిడితోటలు ఉన్నాయి. వాటిమీద యేడాదికి ఐదారు లక్షలు వస్తాయి. దీనితో మావారు పనీపాటా లేకుండా తిరిగినా పూటగడుస్తున్నది. సరదాలు తీరుతున్నాయి. అయితే ప్రేమ అనురాగాలు మృగ్యమయ్యాయి. సుఖ సంతోషాలు కరువయ్యాయి. ఈ మధ్యకాలంలో ఆయన తాగి విపరీతంగా ప్రవర్తిస్తున్నారు. నెలక్రితం ఎవరో కారుకు అడ్డం వచ్చాడని, ఆపి కొట్టారు. అతనితో వున్న వ్యక్తులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అర్ధరాత్రి వరకు పోలీస్‌స్టేషన్‌లో ఉండవలసి వచ్చింది. వారం క్రితం హైదరాబాదు వెళ్లారు. పేరున్న స్టార్ హోటల్లో దిగారు. హోటల్లోని బారులో ఊటుగా తాగి తన గది బదులు వేరే గది తాళం తీసే ప్రయత్నం చేశారు. తాను ఒకటే అన్న విషయం మరచిపోయి ఎవరో గదిలో ఉన్నారని భావించి కాలింగ్‌బెల్ నొక్కారు. అంతలోనే తలుపు దబా దబా బాదారు. గదిలో ఉన్నావారు బయటికి వచ్చి భూతులు తిట్టి హోటల్ మేనేజరుకు ఫిర్యాదు చేశారు. అదే హోటల్లో దిగిన మా బంధువు ఒకాయన విషయం తెలిసి సర్ది చెప్పారు. తరువాత ఆయన నాకు ఫోన్‌చేసి, మావారికి డి అడిక్షన్ చికిత్స చేయించమని సలహా ఇచ్చారు. ఇప్పుడు ఆయన వయస్సు 48 యేళ్ళు నాకు 45 ఏళ్ళు. పదిమందికి బుద్ధి చెప్పవలసిన వయసులో ఆయనకు చికిత్స అవసరమా అనిపిస్తోంది. సైకాలజిస్టు ద్వారా కౌన్సెలింగ్ చేయిస్తే మార్పు రాదా! అన్న సందిగ్ధం ఏర్పడుతున్నది.

ఇప్పటివరకు ఆయన ప్రవర్తన వల్ల మేము మాత్రమే ఇబ్బంది పడే వాళ్లం. ఇప్పుడు బయట కూడా ఇబ్బందులు ఎదురై పరువు పోతున్నది. నేను కూడా తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నాను. ఒక్కోసారి ఎక్కడైనా ఒక అనాథ ఆశ్రమంలో తలదాచుకుందాము అనిపిస్తోంది. అప్పుడప్పుడు ఆత్మహత్య చేసుకుంటే పీడ విరగడవుతుందన్న భావన కలుగుతున్నది. అయితే ఇద్దరు బిడ్డల కోసం బాధలు భరిస్తూ బతుకుసాగిస్తున్నాను. ఈ పరిస్థితులలో మా వారిని మార్చుకోవడానికి మార్గం చెప్పండి.. - ఒక సోదరి



**జవాబు :** అమ్మా, చిరుగు చిన్నదిగా ఉన్నప్పుడే కుట్టాలి అంటారు పెద్దలు. ఏదైనా అంతే రోగం, రుగ్మత, జబ్బు, ప్రవర్తనా లోపం అన్నింటికీ ఈ మాట వర్తిస్తుంది. మొక్కైవంగనిది మానైవంగునా అన్న సామెత కూడా అక్షరాల సరిపోతుంది. వ్యసనం కూడా ఒక మానసిక రుగ్మతే అన్న విషయం గుర్తించాలి. పూర్వం గ్రామాలలో ఒకరో ఇద్దరో తాగుబోతులు ఉండేవారు. అందులోను కూలీ నాలి చేసుకునే వారిలోనే ఇలాంటి అలవాట్లు ఎక్కువగా ఉండేవి. వారు ఒళ్ళు నొప్పుల కోసం, ఇతర కారణాలతో తాగేవారు. ఇప్పుడు జనాభాలో అధిక శాతం పురుషులు వ్యసనాలకు బానిసలు అవుతున్నారు. కొందరు సరదా కోసం, మరికొందరు స్టేటస్ కోసం ఇంకొందరు మానసిక ప్రశాంతత కోసం తాగుబోతులు అవుతున్నారు. మన సమాజంలో ఇంకా మహిళలు ఆ స్థితికి రానందుకు ఒక విధంగా సంతోష పడాలి. ఇప్పుడిప్పుడు కాలేజీ హాస్టళ్లలో ఉన్న కొందరు అమ్మాయిలు, హైసొసైటీ అన్న భ్రమలో ఉన్నకొందరు మహిళలు మందు వేస్తున్నారు. అతి తక్కువ కుటుంబాలలో భార్యాభర్తలు ఇద్దరు కలిసి తాగుతున్నారు. జీవితాన్ని ఉపయుక్తంగా సాగించలేని కొందరు సంతోషం, సరదాల కోసం అంటూ వ్యసనాలకు బానిసలు అవుతున్నారు. అక్రమ సంపాదనపరులు, అక్రమ వ్యాపారాలు చేసేవారు తాము పతనం అవుతూ తమ చుట్టూ ఉన్నవారిని పతనం చేస్తున్నారు. ఇప్పటి యువతలో కొందరు మద్యం, మాదక ద్రవ్యాలకు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. సరైన లక్ష్యం లేని వారు మానసిక దృఢత్వం కోల్పోయిన వారే ఎక్కువగా వ్యసనాలకు బానిసలు అవుతుంటారు. మీ వారికి పెద్దలు సంపాదించిన ఆస్తులు బాగా ఉన్నాయి. కూర్చుని తిన్నా తరగనంత సంపద ఉంది. దానిని ఉత్సాదక శక్తిగా మార్చుకునే లక్ష్యం లేక ఖాళీగా తిరగడం అలవర్చుకున్నారు. పనిలేక, పొద్దుపోక తాగడం అలవాటు చేసుకున్నారు. మీరు కూడా మొదట్లో ఆయనను నియంత్రించలేకపోయారు. తరువాత సాధ్యం కాదని వదిలేశారు. ఇప్పుడు ప్రమాదకర స్థాయికి చేరడంతో మేల్కొన్నారు. ఈ దశలో కౌన్సెలింగ్ చేసి మార్చడం ఒక విధంగా కష్టమనే చెప్పాలి. మీ బంధువు చెప్పినట్టు దీనికి డి-అడిక్షన్ చికిత్సే శరణ్యం ఆయనను అనువయించి లేదా బలవంతంగా అయినా సరే ఒప్పించి డి-అడిక్షన్ కేంద్రంలో చేర్పించి చికిత్స చేయించండి. అక్కడే కౌన్సెలింగ్ కూడా చేస్తారు. బాధలను భరించడం కాకుండా పరిష్కరించుకోవాలి అన్నది గమనించి ఆయనకు చికిత్స చేయించండి.




E-BOOK* TODAY AT WWW.MARUTISUZUKI.COM OR VISIT YOUR NEAREST MARUTI SUZUKI ARENA DEALERSHIP

**AUTHORISED DEALERS:** **NORTH ANDHRA:** **SATTI BABU:** (KAKINADA) CALL: 0883-2442410. **JAYABHERI:** (KRANTHI NAGAR) CALL: 7093915512, (VIZIANAGARAM) CALL: 8912505000. **VARUN:** (SIRIPURAM) CALL: 8912599999, (GAJUWAKA) CALL: 8912599999, (MURALINAGAR) CALL: 8912599999, (SRIKAKULAM) CALL: 8912599999, (RAJAHMUNDRY) CALL: 9985444777. **S.B. MOTORS:** (RAJAHMUNDRY) CALL: 0883-2442410. **E-OUTLETS:** **VARUN:** (PENDURTHY) CALL: 8912599999, (RAJAM) CALL: 8912599999. **JAYABHERI:** (NARSIPATNAM) CALL: 8912505000, (ANAKAPALLE) CALL: 8912505000, (MADHURWADA) CALL: 8912505000. **SATTI BABU:** (TUNI) CALL: 0883-2442410. **S. B. MOTORS:** (AMALAPURAM) CALL: 0883- 2442410.

*Terms and conditions apply. Creative Visualization. Black Glass on the vehicle is due to lighting effect. Features and accessories shown may not be part of standard fitment. Images used are for illustration purposes only. **Fuel efficiency as certified by test agency under Rule 115 of CMVR 1989. For details on functioning of safety features, including air bag, kindly refer to the Owner's Manual. All Loans & schemes are under the sole discretion of the Finance Partner.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 11-37, Morampudi Centre, Rajahmundry-533103. Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. RNI No. 64863